కల్లుకు బానిసైన తల్లి....కన్నకూతురిని చంపి

తల్లి కన్నకూతురినే కడతేర్చింది. అనంతరం తన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. మొదట కుటుంబ సభ్యులు సైతం బాలిక ఆత్మహత్య చేసుకుందని భావించారు. పోలీసుల దర్యాప్తు, పోస్టుమార్టం నివేదికతో అసలు విషయం బయటపడడంతో తల్లిని అరెస్టు చేశారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు పురపాలక కేంద్రంలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరులోని హనుమాన్ కాలనీలో ఆటోడ్రైవర్ ముత్యడి రాజు, విజయలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె సువర్ణ (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లి విజయలక్ష్మికి కల్లు తాగే అలవాటు ఉండటంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. పెద్ద కూతురుతో తల్లి పలుమార్లు గొడవ పెట్టుకుంది. ఈ నెల 27న సాయంత్రం మరోసారి తల్లీకూతుళ్ల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన విజయలక్ష్మి కుమార్తెను గొంతు నులిమి హత్య చేసింది.

స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక

సంపాదకుడు : కె.బి.జి. తిలక్

ఇద్దరు చిన్నారులను చంపిన సవతి తల్లి

అమ్మ ప్రేమకు దూరమైన ఆ ఇద్దరు చిన్నారులకు సవతి తల్లిలోనైనా ఆప్యాయత కనిపిస్తుందని ఆశించారు. కానీ ఆ చిన్నారుల పాలిట సవతి తల్లి మృత్యువుగా మారుతుందని ఊహించలేకపోయారు. తల్లి మరణంతో ఇప్పటికే అనాథలైన ఆ పిల్లలను అక్కున చేర్చుకోవాల్సిన ఆమె.. ఆస్తి వివాదాన్ని మనసులో పెట్టుకుని కర్కశంగా వ్యవహరించింది. చివరకు చికెన్ బిర్యానీలో విషమిచ్చి ఇద్దరు చిన్నారుల ప్రాణాలను సవతి తల్లి తీసింది. ఈ సంఘటన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... బ్రాహ్మణకోడూరుకు చెందిన స్వర్ణ, నెహ్రూనగర్‌కు చెందిన రాంబాబు గత 11 సంవత్సరాల క్రితం లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. వీరికి సాత్విక్ (10), నిత్య (8) అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగు సంవత్సరాల క్రితం స్వర్ణ చనిపోయారు. తల్లి దూరం కావడంతో చిన్నారులు తండ్రి వద్దే పెరిగారు. కొంతకాలానికి మేరి అనే మహిళను రాంబాబు రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు అప్పటికే ఒక కుమారుడు ఉన్నాడు. సవతి తల్లి సాత్విక్, నిత్యలను సరిగా చూసేది కాదు. ఆస్తి విషయంలో కుటుంబంలో ఘర్షణలు జరుగుతున్నాయి. ఇద్దరు పిల్లలను చంపితే తన కుమారుడికే ఆస్తి దక్కుతుందని ప్లాన్ వేసింది.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 189 విజయవాడ 31 అక్టోబర్ 2026 శనివారం 10పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com´

మహారాష్ట్ర సర్కార్ లో సంక్షోభం

షిండే గుడ్ బై-థాక్రేలకు సీఎం ఆహ్వానం



మహారాష్ట్రలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అధికార మహాయుతి కూటమిలో చిచ్చు రేపాయి. బీజేపీపై అసంతృప్తిగా ఉన్న సంకీర్ణ భాగస్వామి, డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే పార్టీ శివసేన సహకరించకపోవడంతో నాగ్ పూర్ సహా పలు చోట్ల కాషాయ పార్టీకి షాకులు తప్పలేదు. ఈ నేపథ్యంలో షిండేపై బీజేపీ ఆగ్రహంగా ఉంది. అదే సమయంలో షిండే కూడా ప్రభుత్వానికి గుడ్ బై చెప్పేయవచ్చన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్.. రాజకీయ ప్రత్యర్థులైన థాక్రే సోదరులు ఉద్ధవ్, రాజ్ తో కలిసి ఓ వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్సీ ఎన్నికల సాక్షిగా మహాయుతి ప్రభుత్వంలో విభేదాలు బయటపడ్డాయి. ఎన్నికల్లో ఓటమి పాలైన బీజేపీ ఇందుకు శివసేనే కారణమని విమర్శలు గుప్పించగా.. ఇందులో తమ పాత్రేమీ లేదని షిండే వర్గం బదులిచ్చింది. ఈ నేపథ్యంలో ముంబైలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభకు సీఎం ఫడ్నవీస్ తో పాటు థాక్రే బ్రదర్స్ ఉద్ధవ్, రాజ్ హాజరు కావడంతో పాటు ఆయనతో చనువుగా, చర్చలు జరుపుతూ కనిపించారు. దీంతో ప్రభుత్వంలో మార్పులు జరగబోతున్నారూ అన్న చర్చ మొదలైంది.ఇందుకు ఊతమిచ్చేలా ఉద్ధవ్ పై సభలోనే ఫడ్నవీస్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. ఉద్ధవ్‌తో తన పాత అనుబంధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. 2019కి ముందు ఉద్ధవ్ తనకు ఫోన్ చేసినప్పుడల్లా స్పందించేవాడినని, కానీ ఆ తర్వాత ఆయన నుంచి పిలుపు కోసం ఎదురుచూస్తూనే ఉన్నానని చెప్పారు. 2019 వరకు ఉద్ధవ్ జీ నాకు ఫోన్ చేసినప్పుడల్లా నేను వెళ్లేవాడిని. 2019 తర్వాత ఆయన నాకు ఫోన్ చేయలేదు. నేను ఆయన పిలుపు కోసం ఎదురుచూస్తూనే ఉన్నానంటూ ఫడ్నవీస్ పేర్కొన్నారు. దీంతో ఈసారైనా ఉద్ధవ్ సీఎం ఫడ్నవీస్ ఫోన్ కు స్పందించి ఆయన వద్దకు వెళ్లారా లేదా అన్న చర్చ మొదలైంది.

అయితే ఈ ప్రచారాల్ని థాక్రే బ్రదర్స్ లైట్ తీసుకుంటున్నారు. ఇది పార్టీలకతీతంగా నేతలు వ్యవహరించాల్సిన సందర్భం మాత్రమేనని వారు చెప్తున్నారు. రాబోయే రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

ముగుస్తున్న టీటీడీ పాలక మండలి గడువు

కొత్త చైర్మన్, సభ్యులుగా వీరికే ఛాన్స్..!?

టీటీడీ కి కొత్త పాలక మండలి పైన కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం బీఆర్ నాయుడు చైర్మన్ గా నియమించిన బోర్డు గడువు ముగియనుంది. దీంతో.. కొత్త చైర్మన్ సహా పాలక మండలి సభ్యులు ఎవరనేది కీలకంగా మారుతోంది. కొత్త బోర్డు పైన ఇప్పటికే ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త చైర్మన్ విషయంలోనూ దాదాపు నిర్ణయం జరిగిందని చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో.. పూర్తయిన తరువాత అధికారికంగా ప్రకటన రానుంది. ఇక.. బోర్డు సభ్యులుగా పలువురు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుత పాలక మండలి గడువు పూర్తి కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024 నవంబర్ 1న చైర్మన్ గా బీఆర్ నాయుడు, 24 మంది సభ్యులతో కొత్త పాలక మండలి నియమించారు. రెండేళ్ల కాల పరిమితి విధించారు. ఇప్పుడు ఆ సమయం ముగియటంతో కొత్త పాలక మండలి పైన కసరత్తు కొనసాగుతోంది. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు జరుగుతుండటంతో ఇవి పూర్తయిన తరువాత అధికారికంగా కొత్త బోర్డును ప్రకటించే అవకాశం ఉంది. అప్పటి వరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శితో ప్రత్యేకంగా స్పెసిఫైడ్ కమిటీ ప్రకటించనున్నారు. కొత్త పాలక వర్గం పైన భారీ అంచనాలు ఉన్నాయి. మూడు పార్టీల కూటమి అధికారంలో ఉండంతో... మూడు పార్టీల నుంచి ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉంది.

ఎన్నికల తరువాత కొత్త బోర్డు నియామకం

కొత్త చైర్మన్ గా టీడీపీలోని ఇద్దరు సీనియర్ నేతలు పేర్లు రేసులో ఉన్నాయి. అందులో టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా పని చేసిన కళా వెంకటరావు, ప్రస్తుత టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కాగా.. ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడుకు మరో ఏడాది అవకాశం ఇస్తారనే వాదన ఉంది. అదే సమయంలో సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖుడు సైతం చైర్మన్ రేసులోకి వచ్చినట్లు సమాచారం. ఇక.. టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి బోర్డు సభ్యులుగా ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా అవకాశం దక్కనుంది. వీరితో పాటుగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి బోర్డు సభ్యులుగా నియామకం చేయాల్సి ఉంది. బీజేపీ ముఖ్య నాయకత్వం ద్వారా ఇప్పటికే పలువురు సభ్యులుగా అవకాశం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో, చివరగా టీటీడీ నూతన చైర్మన్.. బోర్డు సభ్యులుగా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఉత్కంఠగా మారుతోంది.

జనసేన అంతంతమాత్రం.. బీజేపీ నామమాత్రం..

కూటమి లెక్కలు అసక్తికరం

స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు హాట్ టాపిక్ అవుతోంది. నామినేషన్లకు ముందు తమకు భారీగా సీట్లు కావాలని, బలం ఉన్న ప్రతిచోటా పోటీ చేస్తామని గంభీరమైన ప్రకటనలు చేసిన బీజేపీ, జనసేన పార్టీలు తుది లెక్కలకు వచ్చేసరికి తేలిపోయినట్లు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రధానంగా తమకు 30 శాతం వాటా ఇవ్వాలని హడావుడి చేసిన జనసేన నేతలు, గ్రామాల వరకు వచ్చేసరికి చేతులెత్తేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక బీజేపీ అయితే అక్కడక్కడ మాత్రమే పోటీలో నిలబడి తానూ ఉన్నానని చాటుకునే ప్రయత్నం మాత్రమే చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా కూటమిలో ప్రధాన పక్షం టీడీపీ హవానే ఎక్కువగా ఉందని ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా స్పష్టం చేస్తోందని చెబుతున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల సంఘం వెల్లడించింది. ఏకగ్రీవాలు మినహాయిస్తే పోటీ జరుగుతున్న మొత్తం స్థానాల్లో టీడీపీ 6,423 ఎంపీటీసీ స్థానాల్లో బరిలో నిలిచింది. అంటే మొత్తం స్థానాల్లో 65 శాతం టీడీపీ వాటాగా చెబుతున్నారు. ఇదే సమయంలో జనసేన 1,521 చోట్ల ఎంపీటీసీ అభ్యర్థులను నిలిపి 15 శాతంతో సరిపెట్టుకుందని అంటున్నారు. అదేవిధంగా బీజేపీ కేవలం 285 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోంది. సుమారు 2.90 శాతం వాటా మాత్రమే తీసుకుందని విశ్లేషిస్తున్నారు. ఇక జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ 452, జనసేన 109, బీజేపీ 34 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. వరుసగా మూడు పార్టీలు 68.59 శాతం, 16.54 శాతం, 5.16 శాతం స్థానాలు తీసుకున్నాయని చెబుతున్నారు.టీడీపీ హవా రాష్ట్రంలో మొత్తం 9829 ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగితే, 1985 ఎంసీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అదేవిధంగా 77 జడ్పీటీసీ స్థానాలు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ స్థానాలు మినహాయిస్తే 7844 ఎంపీటీసీ స్థానాలు, 582 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో టీడీపీ అత్యధికంగా 6423 చోట్లో పోటీ చేస్తూ కూటమిలో తమ పార్టీకి ఎదురులేనట్లు సంకేతాలిచ్చింది. ఇదేసమయంలో జనసేన, బీజేపీ నేతలు పొత్తుల్లో వెనకబడినట్లు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం క్షేత్రస్థాయిలో సీట్లు సర్దుబాటు జరగాలని మూడు పార్టీల అగ్ర నాయకత్వం నుంచి సూచనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు కారణంగా అమలు చేయలేకపోయారని అంటున్నారు. ప్రధానంగా జనసేన, బీజేపీకి క్షేత్రస్థాయిలో సమర్థులైన నాయకుల కొరత, ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురయ్యే



అవకాశం కారణంగా టీడీపీ అడ్వాంటేజ్ తీసుకున్నట్లు చెబుతున్నారు.

జనసేనకు నిరాశే..

స్థానిక ఎన్నికల్లో తమ బలం ఉన్న ప్రతిచోట పోటీ చేస్తామని హడావుడి చేసిన జనసేన నేతలు జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో వెనక్కి తగ్గడంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో జనసేన నుంచి 15 నుంచి 16 శాతం మాత్రమే నామినేషన్లు వేయడం చూస్తే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ ఇంకా పుంజుకోలేదన్న విషయాన్ని బయటపెడుతోందని అంటున్నారు. కేడర్ గట్టిగా ఉన్న చోట మాత్రమే జనసేన అభ్యర్థులకు అవకాశం ఇచ్చారని, అంతంత మాత్రం ప్రజాదరణ ఉన్న వారికి, ఆర్థిక బలం లేనివారికి అస్సలు అవకాశం ఇవ్వలేదని అంటున్నారు.

ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఉండటం వల్ల అర్థబలం, అంగబలం బేరీజు వేయడం వల్ల జనసేన నాయకులు ఎక్కువ చోట్ల వెనక్కి తగ్గాల్సివచ్చిందని అంటున్నారు. ఇక బీజేపీ పరిస్థితి మరింత తీసికట్టుగా ఉందని అంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ పదవులపై చూపిన మక్కువ క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ కోసం ప్రదర్శించకపోవడం వల్ల స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ గట్టిగా వాదించలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఈ కారణంగానే సీట్ల సర్దుబాటులో జనసేన, బీజేపీ నాయకులను ఆత్మరక్షణలోకి నెట్టేసి టీడీపీ పైచేయి సాధించిందని విశ్లేషిస్తున్నారు.

గోవధకు ముగ్గురికి జీవిత ఖైదు

వేదాలు, మనుస్మృతి ప్రస్తావనతో గుజరాత్ కోర్టు తీర్పు

దేశంలో మనుస్మృతి, గోవధ వంటి అంశాలపై చర్చ జరుగుతున్న తరుణంలో గుజరాత్ లోని ఓ స్థానిక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గోవధకు పాల్పడిన ముగ్గురు ముస్లిం యువకులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఇచ్చే క్రమంలో మనుస్మృతి, రుగ్వేదాలను, ప్రాచీన గ్రంథాలను సైతం ప్రస్తావించింది. వీటి ఆధారంగా తాము ఈ తీర్పు ఇస్తున్నట్లు తెలిపింది. దీంతో భారతీయ శిక్షాస్మృతిని పాటించే న్యాయస్థానం.. వేదాలు, మనుస్మృతి ప్రకారం తీర్పు ఇవ్వడం ఏంటన్న చర్చ జరుగుతోంది. 2024 ఆగస్టు 22న గుజరాత్ లోని జమ్లా గ్రామంలోని ఒక ఇంట్లో పోలీసులు తనిఖీలు చేసి నిందితులు అక్రమంగా గోవులను వధించారని, ఆ మాంసాన్ని విక్రయించేందుకు సిద్ధమవుతున్నారని గుర్తించి, వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో సుమారు 277 కిలోగ్రాముల గోమాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు కత్తులు, గొడ్డలి, త్రాసు, తాళ్లు, వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. గాంధీ నగర్ లోని కలోల్ స్థాని కోర్టులో ఈ గోవధ కేసు విచారణకు వచ్చింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బ్రిజేష్ కుమార్ రామేశ్వర్ సింగ్ రాజ్ పుత్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్ట ప్రకారం గోవధ చేసే వ్యక్తుల్ని శిక్షించకపోతే గోవులు అంతరించిపోయే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. గోవుల శరీర భాగాలను క్రూరంగా ముక్కలు చేసి వేరు చేసిన ఇటువంటి నిందితులను చట్టప్రకారం శిక్షించకపోతే, కాలక్రమేణా భూమిపై నుండి గోమాత అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున, నిందితులకు చట్టప్రకారం శిక్ష విధించడం అవసరమని భావించి జీవిత ఖైదు విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా, గోవులను ప్రపంచానికి తల్లులుగా, గోరక్షణను ఒక ధార్మిక కర్తవ్యంగా పేర్కొనే సంస్కృత శ్లోకాలను కోర్టు ఉదహరించారు. "గోవులు జగత్తుకు మాతృస్వరూపాలు, అవి అందరికీ సుఖసంతోషాలను కలిగిస్తాయి. గోవులను రక్షించడం ఒక ధార్మిక కర్తవ్యం; సత్యానికి రక్షకమే న్యాయం. గోవధ ఎక్కడ జరిగినా, అది ధర్మానికి జరిగిన నష్టంగా పరిగణించబడుతుంది. నేరం రుజువైనప్పుడు, చట్టప్రకారం శిక్ష విధించాల్సిందే. రాజా! న్యాయమార్గం ద్వారానే ధర్మం నిలబడుతుంది. జీవరాశులను రక్షించడం పుణ్యకార్యం, న్యాయాన్ని కాపాడటమే అత్యున్నత ధర్మం." అంటూ న్యాయమూర్తి రాజ్ పుత్ తీర్పులో ప్రస్తావించారు.

విజయవాడలో ఓటుకు నోటు..!

ఆయా పార్టీల రేట్లు ఇవే..ఏబీవీ వర్గం

ఏపీలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఇవాళ ముగియబోతోంది. సాయంత్రానికి ప్రచార హోరు ముగించుకుని పోలింగ్ కోసం పార్టీలు, అభ్యర్థులు సిద్ధం కావాల్సి ఉంది. అయితే పోలింగ్ వరకూ ఆగకుండా ముందే ఓటర్లకు డబ్బులు పంచేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించేశాయి. ఇందులో భాగంగా కీలకమైన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ధన ప్రవాహం జోరుగా సాగుతోంది.

వీటి వివరాలను ఈ ఎన్నికల్లో కూటమి, వైసీపీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు వర్గం బయటపెట్టింది. విజయవాడలో ప్రస్తుతం కూటమి అభ్యర్థిగా జనసేన నేత వంగవీటి రాధాకృష్ణ, వైసీపీ అభ్యర్థిగా రాయన భాగ్యలక్ష్మి పోటీ చేస్తున్నారు. వీరికి పోటీగా స్వతంత్ర అభ్యర్థిగా, కాంగ్రెస్, కమ్యూనిస్టుల మద్దతుతో మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు రంగంలో నిలిచారు. అయితే ఆయన ఎన్నికల్లో తాను డబ్బు పంచేది లేదని తేల్చిచెప్పేశారు. దీంతో ఆయన ఇప్పుడు తనకు పోటీగా ఉన్న ఇద్దరు అభ్యర్థులు, పార్టీల ఎత్తుగడల్ని బయటపెట్టేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

ఇందులో భాగంగా విజయవాడ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులు ఓట్ల కోసం ఎంతెంత డబ్బు పంచుతున్నారనేది ఏబీ వెంకటేశ్వరరావు వర్గం బయటపెట్టింది. విజయవాడలో భారీ వరద! అంటూ ఏబీవీ టీమ్ లో కీలకంగా ఉన్న సామాజిక కార్యకర్త నల్లమోతు చక్రవర్తి ట్వీట్ చేశారు. ఇందులో ఆయన గత రాత్రి విజయవాడలో మధ్యం ఏరులై పారింది, నోట్ల కట్టల వరద వచ్చిందని తెలిపారు. వైసీపీ ఓటుకి 500 రూపాయలు పంచితే, జనసేన/టీడీపీ/బీజేపీ కూటమి 1000 రూపాయలు పంచిందన్నారు. తద్వారా ఈ ఎన్నికల్ని ఆయన పార్టీలు ఎంత సీరియస్ గా తీసుకుంటున్నాయో వెల్లడించారు. మరోవైపు ఇంత తీవ్రంగా సాగుతున్న పోటీలో ఏబీవీ ఓట్లు చీలుస్తారని, లేకపోతే గెలుస్తారనే భయంతో ఆయన్ను ఇరు పార్టీలు టార్గెట్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా తప్పుతాగిన మూకలు ఏబివి ప్రచార వాహనాలను ధ్వంసం చేశాయని నల్లమోతు చక్రవర్తి ట్వీట్ లో తెలిపారు. ఈ విష సంస్కృతి పోవాలి, మీ ఓటు పాలకులకు కోట్లు కాకూడదు, దొంగలు పోవాలి. పోలీసు రావాలి! అంటూ ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఏఐ చిప్‌ల దిగ్గజం ఎన్విడియా సీఈఓ లక్ష్యంగా చైనా భారీ గూఢచర్యం ఆపరేషన్.. సంచలన నివేదిక

ఏఐ చిప్‌లను తయారుచేసే దిగ్గజ సంస్థ ఎన్విడియా సీఈఓను లక్ష్యంగా చేసుకుని చైనా ఓ భారీ గూఢచర్యం ఆపరేషన్ నడిపినట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక తాజాగా ఓ నివేదికను వెల్లడించింది. అయితే, ఈ విషయం ఆయనకు తెలియదని పేర్కొంది. కానీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గూఢచర్యం గురించి నివేదిక అందినా ఆయన చూసీచూడనట్లు వ్యవహరించారని తెలిపింది. సింగపూర్ కేంద్రం పనిచేసే మెగా స్పీడ్ అనే డేటా సెంటర్ ఎగ్జిక్యూటివ్ అయిన మహిళ.. జెన్సన్ హుయాంగ్‌తో సన్నిహితంగా మెలిగింది.కృత్రిమ మేధ చిప్‌ల దిగ్గజం ' ఎన్విడియా ' సీఈఓ జెన్సన్ హుయాంగ్‌ను లక్ష్యంగా చేసుకుని చైనా ఒక పెద్ద గూఢచార విభాగాన్ని నడిపిందని 'ది న్యూయార్క్ టైమ్స్' నివేదిక పేర్కొంది. సింగపూర్ కేంద్రంగా పనిచేసే డేటా సెంటర్ కంపెనీ 'మెగాస్పీడ్' ఎగ్జిక్యూటివ్, చైనా పౌరురాలు అలైస్ హుయాంగ్. జెన్సన్ హుయాంగ్‌తో పరిచయం పెంచుకుని అత్యంత సాన్నిహిత్యంగా ఉంటూ ఎన్విడియా అధునాతన ఏఐ చిప్‌లు, సమాచారాన్ని బీజింగ్‌కు చేరవేసినట్లు అమెరికా నిఘా సంస్థలు గుర్తించాయి.

ఏడాది కిందటే ట్రంప్‌కి సమాచారం

ఈ గూఢచర్యం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దాదాపు ఏడాది క్రితమే నిఘా వర్గాలు నివేదిక అందించాయి. అయితే, అమెరికా ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్‌కు కీలకమైన ఎన్విడియా వ్యాపారానికి విఘాతం కలగకూడదని, చైనాతో వాణిజ్య సంబంధాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ట్రంప్ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి చైనాకు ఎన్విడియా సహాయం చేస్తోందన్న ఆందోళనలతో అప్పటి అధ్యక్షుడు బైడెన్ యంత్రాంగం దర్యాప్తు ప్రారంభించింది.

స్పందించిన ఎన్విడియా

అయితే, ఈ ఆరోపణలను ఎన్విడియా ప్రతినిధి జాన్ రిజో ఖండించారు. సీఈఓగా జెన్సన్ హుయాంగ్ వేలాది మంది కస్టమర్లను కలవడం సాధారణ విషయమని, ఎలాంటి సున్నితమైన సమాచారం లేదా జాతీయ భద్రతకు సంబంధించిన రహస్యాలను పంచుకోలేదని స్పష్టం చేశారు. మెగాస్పీడ్ కంపెనీ ద్వారా చైనాకు చిప్‌ల స్మగ్లింగ్ జరగడం లేదని ఎన్విడియా పేర్కొంది. తమ చిప్‌లను చైనాకు అక్రమంగా తరలిస్తున్నారనడానికి ఎటువంటి ఆధారాలు లేవని, తమ పరిశ్రమను రక్షించుకోవడానికి అక్కడి ప్రభుత్వం ఇప్పటికే అమెరికా-ూ× చిప్‌లను దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించిందని ఎన్విడియా పేర్కొంది.వాషింగ్టన్ డీసీలోని చైనా ఎంబసీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. అమెరికా కావాలనే చైనా ప్రతిష్టను దిగజార్చేందుకు ఈ నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని పేర్కొంది. 2022 నుంచి అమెరికా ఎగుమతి ఆంక్షలు విధించినప్పటికీ, ఆగ్నేయాసియా దేశాలలో ఆఫీసులు ఏర్పాటు చేసి, అక్కడ డేటా సెంటర్లు నెలకొల్పి చైనా కంపెనీలకు ప్రాసెసింగ్ పవర్ అద్దెకు ఇచ్చే లొసుగులను ఉపయోగించుకుంటున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీనిని నియంత్రణ లోపంగా భావించిన బైడెన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆ తర్వాత ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఆ చర్యలను వెనక్కి తీసుకున్నారు.

సింగ్‌పూర్ కంపెనీ 'మెగాస్పీడ్'

చైనా మార్కెట్‌కు సేవలు అందించేందుకు ఈ-ూ× చిప్‌లను కొనుగోలు చేసే 'మెగాస్పీడ్' వంటి విదేశీ డేటా సెంటర్ ఆపరేటర్లపై నేరుగా ప్రభావం చూపే ఈ విధానంపై తిరిగి కఠినమైన నియంత్రణలను విధించాలా? వద్దా అనే అంశంపై అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం తీవ్రంగా చర్చిస్తోంది.అమెరికా పౌరులపై నిఘా పెట్టడానికి సాధారణంగా అమెరికా నిఘా సంస్థలకు కోర్టు ఉత్తర్వులు అవసరం. అయితే, విదేశీ సమాచార మార్పిడిని విశ్లేషించేటప్పుడు సంబంధిత ప్రభుత్వ సంస్థ తగిన కారణాలను చూపిస్తే 'అన్‌మాస్కింగ్' (ఖఅఘ్ఘంఎఅఅస్త్ర) అనే ప్రక్రియ ద్వారా ఆ అమెరికా పౌరుడి అసలు గుర్తింపును వెల్లడిస్తారు. ఈ క్రమంలోనే చైనా ఏజెంట్ అలైస్ హుయాంగ్ సంప్రదిస్తున్న అమెరికా వ్యక్తి ఎన్విడియా సీఈఓ జెన్సన్ హుయాంగ్ అని స్పష్టమైంది.2025 కి ముందు వరకు ఎన్విడియా సీఈఓ వాషింగ్టన్‌ను సందర్శించడం చాలా అరుదుగా ఉండేది, అలాగే ఆయన రాజకీయాలకు దూరంగా ఉండేవారు.అయితే, చైనాకు ఎన్విడియా సెమీకండక్టర్ల ఎగుమతిని పూర్తిగా నిషేధించే అంశాన్ని ట్రంప్ యంత్రాంగం పరిశీలిస్తున్న సమయంలో, జెన్సన్ హుయాంగ్ తన భార్యతో కలిసి ట్రంప్‌కు చెందిన 'మార్-ఎ-లాగో' రిసార్ట్‌లో జరిగిన ఒక విలాసవంతమైన విరాళాల విందు కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ టెక్ కంపెనీలు బీజింగ్‌తో తమ వాణిజ్య కార్యకలాపాలను కొనసాగించేలా అనుమతించాలని ఆయన వ్యక్తిగతంగా అధ్యక్షుడి వద్ద లాబీయింగ్ చేశారు.

ట్రంప్‌కు ఎన్విడియా విరాళం

ఎన్విడియా సంస్థ ట్రంప్ బాల్‌రూమ్ ఫండ్‌కు కనీసం 20 మిలియన్ డాలర్ల విరాళం ఇవ్వడమే కాకుండా, అమెరికా తయారీ రంగంలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చింది.

అర్నబ్ తుపాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం...అయినా ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆర్టీజీఎస్‌లో సమీక్షల పేరుతో చంద్రబాబు డ్రామా...అబద్ధాలు ప్రచారం చేస్తూ కేవలం ఆర్భాటం ...సీసీ కెమెరాల ద్వారా పంట నష్టం అంచనా ఎలా సాధ్యం?...పంట నష్టంపై పూటకో లెక్క చెబుతున్న ప్రభుత్వం...ఏమీ చేయకపోయినా అన్నీ చేశామంటూ ప్రచారం...
ఉచితపంటలబీమాలేకతీవ్రంగానష్టపోతున్నరైతులు...మరోవైపుఆర్బీకేలు,ఈ--క్రాప్ పూర్తిగానిర్వీర్యం...సున్నావడ్డీ పంట రుణాలు లేవు. గిట్టుబాటు ధరలూ లేవు...మొంథా తుపాన్ నష్టానికి ఇప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ లేదు : వైయస్ జగన్



విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : అర్బబ్ తుపాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగినా, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం చూపుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆర్టీజీఎస్‌లో సమీక్షల పేరుతో డ్రామా చేస్తున్న సీఎం చంద్రబాబు, అబద్ధాలు ప్రచారం చేస్తూ కేవలం ఆర్భాటానికే పరిమితం అవుతున్నారని, ఆర్‌టీజీఎస్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌తో పంట నష్టం అంచనా ఎలా సాధ్యం? అని నిలదీశారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజలు, రైతులకు తోడుగా, అండగా నిలబడాలని, వారితో ఉన్నామన్న భరోసా కల్పించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని శ్రీ వైయస్ జగన్ పిలుపునిచ్చారు. అర్బన్ తుపాన్ ప్రభావం, నష్టాలపై వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్, ఆ తుపాన్ ప్రభావిత జిల్లాల పార్టీ అధ్యక్షులతో విషయాలు ఆరా తీశారు. పూర్తి వివరాలు తెలుసుకున్న ఆయన, పలు అంశాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

వ్యవస్థలన్నీ దిగజారాయి. దీంతో అంతా డ్రామా:

అర్బన్ తుపాన్ ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఎక్కడా నష్టం అంచనా జరగలేదు. ఎక్కడా పూర్తిగా సహాయ కార్యక్రమాలు లేవు. విద్యుత్ సరఫరా కూడా పునరుద్ధరణ లేదు. వాలంటీర్లు లేకపోవడం వల్ల గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఆర్బీకేలు లేవు. ఉచిత పంటల బీమా లేదు. దీంతో వ్యవస్థలన్నీ దిగజారిపోయాయి. ఇంత జరుగుతున్నా చంద్రబాబు ఏమంటున్నారు. సీసీ కెమెరాల ద్వారా పంట నష్టం అంచనా చేస్తున్నారంట. ఇక్కడ ఆరీటీజీఎస్‌లో కూర్చుని మానిటర్ చేస్తే సరిపోతుందా? మరోవైపు పంట నష్టాలపై ఇష్టానుసారం లెక్కలు చెబుతున్నారు. ఒకసారి వరి పంట 1.70 లక్షల ఎకరాల్లోనూ, ఉద్యాన పంటలు 24 వేల ఎకరాల్లోనూ నష్టపోయాయని చెబుతారు. మళ్లీ సాయంత్రానికి ఆ లెక్కలన్నీ మారిపోతున్నాయి. ఎక్కడా సీరియస్‌నెస్ లేదు.

నష్టాన్ని తక్కువగా చూపే ప్రయత్నం చేస్తున్నారు:

ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 12 లక్షల ఎకరాల్లో తీవ్ర నష్టం జరిగింది. కోనసీమ, ఉభయ గోదావరి, అనకాపల్లి జిల్లాల్లో వరి పంట నష్టం చాలా ఎక్కువగా ఉంది. వరి పంట ఇప్పుడు పొట్టకొచ్చింది. తుపాన్ వల్ల పంటలు మునిగిపోగా, రైతులకు చాలా నష్టం కలుగుతోంది.

ఉచిత పంటల బీమా లేక నష్టం మరింత ఎక్కువైంది. ఇంకా కొబ్బరి, అరటి.. ఆక్వాకు చాలా నష్టం కలిగింది. ఏరియేటర్లు నడవక ఆక్వా పంట దెబ్బ తింది. ఇవన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నా నష్టం పెద్దగా జరగలేదని ప్రచారం చేస్తున్నారు. అస్సలు పట్టించుకోవడం లేదు. వరి పంటలో ఎకరాకు రూ.40 వేలు, అరటిపై ఎకరాకు రూ.2 లక్షలు, ఆక్వా ఎకరాకు దాదాపు రూ.45 లక్షల వరకు నష్టపోతున్నా, ప్రభుత్వం చాలా తక్కువగా చూపే ప్రయత్నం చేస్తోంది.

రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం:

గత ఏడాది మొంథా తుపాన్ వల్ల కలిగిన నష్టంలో దాదాపు రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ, ఇంకా ఇవ్వలేదు. సున్నా వడ్డీ పంట రుణాలు లేవు. ఉచిత పంటల బీమా లేదు. మొన్నటిదాకా కరవు. ఇప్పుడు తుపాన్. రెండింటి వల్ల రైతులకు చాలా నష్టం కలిగింది. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు, ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి, అంటే 2024 జూన్ నుంచి ఒక్క రూపాయి సాయం చేయలేదు. నాడు మన ప్రభుత్వ హయాంలో ఏదైనా సీజన్‌లో పంట నష్టం జరిగితే, ఆ తర్వాత పంటకు ఉచిత విత్తనాలు ఇచ్చాం. ఇప్పుడు అది లేదు. అన్నదాత సుఖీభవలో మూడేళ్లలో రూ.60 వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.19 వేలు ఇచ్చి, రూ.41 వేలు బకాయి పడ్డారు. ఆర్బీకేలతో పాటు, ఈ--క్రాప్ నిర్వీర్యం చేశారు. సున్నా వడ్డీ పంట రుణాలు లేవు.

సిండికేట్‌గా మారి దోపిడి:

మరో వైపు కేజీ బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది.మొత్తం సిండికేట్‌గా మారి బియ్యం ఎగుమతి చేస్తున్నారు. సీజ్ ది షిప్ అన్నారు. సీజ్ లేదు. షిప్ లేదు. నాదెండ్ల మనోహర్. చినబాబుకు కమిషన్లు. వ్యాపారం చేసేది పయ్యావుల కేశవ్ తదితరులు. కృష్ణా, గోదావరి డెల్టాల్లో పండించిన పంటలు చేతికి రాక, ఇంకా నష్టం జరుగుతోంది. దీంతో బియ్యం ధరలు ఇంకా ఎంత పెరుగుతాయో అన్న భయం అందరిలో ఉంది.

తుపాన్ బాధితుల చేయి పట్టుకుని నడిపించాలి:

మనం ప్రతి అడుగులో తుపాన్ బ్యాధితులైన ప్రజలు, రైతులకు అండగా ఉండి, చేయి పట్టుకుని నడిపించాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా జోన్--1 లో ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. అయినా ప్రతి చోటా మనం ప్రజలు, రైతులకు అండగా నిలబడాలి. రంగు మారిన ధాన్యం, తడిసిన ధాన్యం కొనిపించే ప్రయత్నం చేయాలి. తుపాన్ వస్తే ఒక్కరూ చనిపోకూడదు అంటారు.

ఇక్కడ 8 మంది చనిపోయినా, చంద్రబాబు మాత్రం అంతా సవ్యంగా ఉందంటాడు. ఆర్‌టీజీఎస్‌లో కూర్చుని సీసీ కెమెరాల్లో చూసి, పంట నష్టం తెలుసుకున్నా అంటాడు. మొత్తం సహాయ కార్యక్రమాలు చూశానంటాడు. అందుకే ఇంత దారుణమైన పాలన గతంలో ఎక్కడా చూడలేదన్న వైయస్ జగన్.. గ్రామాల్లో రైతులు, ప్రజలకు తోడుగా, అండగా ఉండాలని, ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని దిశా నిర్దేశం చేశారు.

పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, రైతు సంక్షేమం) ఎంవీయస్ నాగిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండలి డిప్యూటీ ఛైర్మన్ తూమాటి మాధవరావు తదితరులు వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి హాజరు కాగా.. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు మైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిధున్‌రెడ్డి, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డితో పాటు.. పార్టీ జిల్లాల అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి (కోనసీమ), దాడిశెట్టి రాజా (కాకినాడ), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (తూర్పు గోదావరి), ముదునూరి ప్రసాదరాజు (పశ్చిమ గోదావరి), బి.ప్రసాద్ (అనకాపల్లి), పేర్ని వెంకట్రామయ్య (నాని) (కృష్ణా), మత్స్య విశ్వేశ్వరరాజు (అల్లూరి సీతారామరాజు), పరీక్షిత్‌రాజు (పార్వతీపురం మన్యం), బెల్లాన చంద్రశేఖర్ (విజయనగరం), ధర్మాన కృష్ణదాస్ (శ్రీకాకుళం), అంబటి రాంబాబు (గుంటూరు), మేరుగ నాగార్జున (బాపట్ల), దేవినేని అవినాష్ (ఎన్టీఆర్), కెకె రాజు (విశాఖ) తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

పబ్లిసిటీ తప్ప ప్రజా ప్రయోజనం శూన్యం... బాధిత రైతులను గాలికొదిలేసి చంద్రబాబు పబ్లిసిటీ

పంటనష్టం రైతులే అప్‌లోడ్‌చేయాలా? అధికారులుఏంచేస్తున్నారు...కంప్యూటర్లముందుకూర్చునిపంటనష్టం అంచనాల పేరుతో పబ్లిసిటీ... ముందే తుపాన్ హెచ్చరికలున్నా మంత్రులను ఎందుకుపంపలేదు...తుపాన్‌నష్టపరిహారంఎప్పటిలోపుచెల్లిస్తారో ప్రభుత్వంప్రకటించాలి...స్కేల్‌ఆఫ్‌అసిస్టెన్స్ ప్రకారం వరి రైతులకు కూడా పరిహారం పెంచాలి : మాజీమంత్రి కురసాల కన్నబాబు



కాకినాడ: తుపాన్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తమైతే సీఎం చంద్రబాబు ప్రజలను, రైతులను గాలికొదిలేసి.. కేవలం ప్రచార ఆర్భాటాలతో కంప్యూటర్ల ముందు కూర్చుని టైంపాస్ చేస్తున్నాడని మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాకినాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాధితుల పరిస్థితిని తెలుసుకుని వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఫోటోలు, వీడియోలు, సమీక్షల పేరుతో ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. తుపాన్ హెచ్చరికలు ముందుగానే ఉన్నా కనీసం తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు మంత్రులను ఎందుకు పంపించలేదని నిలదీశారు. రైతులు తమ పంట నష్టం ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని చెబుతున్నారనీ, ఎంతమంది రైతులకు ఆ యాప్‌ను ఉపయోగించే అవగాహన ఉంటుందని ప్రశ్నించారు. రైతుల దగ్గరకు వెళ్లి నష్టాన్ని అంచనా వేయాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. ప్రజలు కన్నీళ్లు పెడుతుంటే చంద్రబాబుకు రాజకీయాలు, ఎన్నికలే ముఖ్యమయ్యాయని, మైవస్ జగన్ గారి ప్రభుత్వంలో రైతులకు కల్పించిన భరోసాను దెబ్బతీసి, ఇప్పుడు వారిని బీమా లేకుండా, ఇన్‌పుట్ సబ్సిడీ లేకుండా వదిలేయడం చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. విజయవాడ ముంపు సమయంలో సహాయక చర్యల పేరుతో రూ. 500 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పి, అందులో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకే రూ. 23 కోట్లు ఖర్చు చేశామని లెక్కలు చూపిన ఘనత ఈ ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. అలాగే ఇప్పుడు అర్బబ్ తుపాన్ విపత్తును సైతం బాధితులకు న్యాయం చేయడానికి కాకుండా పబ్లిసిటీకి వాడుకుంటున్నారని కురసాల కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు యాప్‌లపై అవగాహన ఉంటుందా? :

అర్బబ్ తుపాను బాధితులకు తక్షణ సహాయం అందించడంలో, పంట నష్టాన్ని అంచనా వేయడంలో, పరిహారం చెల్లించడంలో మీ ప్రభుత్వం విఫలమైంది. తుపాన్లు వచ్చిన ప్రతిసారీ చంద్రబాబు ప్రజలను, రైతులను గాలికొదిలేసి కేవలం ప్రచార ఆర్భాటాలతో కాలం వెళ్లదీస్తున్నారు. రైతులు పంట నష్టం ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు, అసలు ఎంతమంది రైతులకు ఆ యాప్‌పై అవగాహన ఉంది? క్షేత్రస్థాయికి వెళ్లి నష్టాన్ని అంచనా వేయాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఏం చేస్తున్నారు? విజయవాడలో బుడమేరు వరదల సమయంలో ప్రజలు పడవల్లో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సహాయక చర్యలకు రూ.500 కోట్లు ఖర్చు చేశామని చెప్పిన ప్రభుత్వం, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకే రూ.23 కోట్లు ఖర్చయినట్లు లెక్కలు చూపించింది. వరద బాధితులకు అందించిన సహాయం ఎంత, వాహనాలు కోల్పోయిన వారికి ప్రకటించిన పరిహారం ఎంతమందికి అందిందో చెప్పాలి. తుపాను హెచ్చరికలు వచ్చినా బాధిత ప్రాంతాల్లో సమర్థంగా సహాయక చర్యలు చేపట్టలేకపోతున్నారు. సమీక్షలు, ఫొటోలు, వీడియోలతో సరిపెట్టకుండా ప్రజలకు తక్షణ సహాయం అందించాలి. చంద్రబాబు, నారా లోకేష్ రాజకీయ ప్రచారాన్ని పక్కనపెట్టి బాధితుల సమస్యలపై దృష్టి పెట్టాలి.

తుపాను నష్టపరిహారాన్ని ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలి:

మైవస్ జగన్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ఎకరానికీ ఈ-క్రాప్ నమోదు చేసి, రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశాం. 2019--2024 మధ్య ఈ ప్రాంతంలోనే ఎకరానికి రూ.23 వేల నుంచి రూ.29 వేల వరకు బీమా పరిహారం అందించిన చరిత్ర మా ప్రభుత్వానిది. పంట నష్టపోయిన రైతులకు తదుపరి పంట సీజన్‌లోపు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాం. నేడు కూటమి ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా లేదు, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం తన వాటా ప్రీమియం చెల్లించకపోవడంతో ప్రీమియం కట్టిన రైతులు కూడా నష్టపోయారు. పాత ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలతో పాటు తాజా తుపాను నష్టపరిహారాన్ని ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రకటించాలి. సుమారు 8.30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే, అందులో 7.60 లక్షల ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు చెబుతున్న ప్రభుత్వం వరి రైతులకు పరిహారం ఎందుకు పెంచడం లేదు? మైవస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023 నవంబర్ 14న జీవో నంబర్ 5 ద్వారా పెంచిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ ప్రకారం వరి రైతులకు కూడా పరిహారం పెంచాలి. కౌలు రైతులను గుర్తించి, నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

బాధితులకు న్యాయమైన పరిహారం అందించాలి:

తుపాను బాధితులకు నిత్యవసరాలు ఇస్తామని ప్రకటనలు చేయడం మాత్రమే సహాయక చర్యలు కాదు, బాధిత కుటుంబాల జాబితా, సహాయం అందించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి. పడవలు, వలలు కోల్పోయిన మత్స్యకారులకు, విద్యుత్ అంతరాయాలు, చెరువులకు గండ్ల వల్ల నష్టపోయిన చేపలు, రొయ్యల రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి. మైవస్ జగన్ ప్రభుత్వంలో ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి పరీక్షలు, చికిత్స అందించాం, ఇప్పుడు కూడా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తుపాను కారణంగా క్షేత్రస్థాయి పరిశీలనకు ఆటంకం ఏర్పడినప్పుడు ఓటర్ల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ షెడ్యూల్‌ను మార్చాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, గ్రామాల విలీనం, వార్డుల పరిధి అంశాల్లో పారదర్శకత పాటించాలి. కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ప్రజల అభ్యంతరాలను స్వీకరించిన తర్వాతే ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మైవస్సార్‌సీపీ పోటీకి సిద్ధంగా ఉంది, కానీ ప్రజలు తుపాను బాధల్లో ఉన్నప్పుడు ఎన్నికలే ముఖ్యమన్నట్లు వ్యవహరించడం సరికాదు. చంద్రబాబు ప్రభుత్వం కాకి లెక్కలు మానేసి వాస్తవ నష్టాన్ని ప్రకటించి, ప్రతి రైతుకు, కౌలు రైతుకు, మత్స్యకార కుటుంబానికి న్యాయమైన పరిహారం అందించాలి. ప్రచార స్టంట్లకు స్వస్తి చెప్పి బాధితులను ఆదుకోవాలి, ప్రజలకు న్యాయం జరిగే వరకు మైవస్సార్‌సీపీ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని కురసాల కన్నబాబు స్పష్టం చేశారు.

ఆర్నబ్ తుపానుతో జిల్లాలో ఆక్వా రంగానికీ తీవ్ర నష్టం...ఈ నష్టానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

అర్నబ్ తుపాన్‌తో పశ్చిమ గోదావరి జిల్లా అతలాకుతలం..లక్షలాది కొబ్బరి చెట్లు నేలకొరిగాయి...70 వేల హెక్టార్లలో వరి పంటకు నష్టం...పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పరిహారం అందించాలి...పునరావాస కేంద్రాల్లో బాధితులకు బియ్యం, పప్పులు, పాలు, నిత్యావసరాలు తక్షణమే పంపిణీ చేయాలి...దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం అందించి బాధితులను ఆదుకోవాలి : ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం: ఆర్నబ్ తుపాను నష్టానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైయస్ఆర్‌సీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మండిపడ్డారు. తుపాను ప్రభావంతో జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా వరి, అరటి, కొబ్బరి పంటలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. తుపాను ప్రభావం తగ్గినా విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణలో జాప్యం కొనసాగుతోందని, బాధితులకు తక్షణ సహాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. పంట నష్టాన్ని వేగంగా అంచనా వేసి రైతులకు పరిహారం అందించడంతో పాటు, తుపాను బాధితులకు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టాలని నరసాపురంలో మీడియాతో మాట్లాడిన ప్రసాదరాజు కోరారు.

పంటలు, ఆక్వా రంగానికి భారీ నష్టం:

ఆర్నబ్ తుపానుతో పశ్చిమ గోదావరి జిల్లాలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆక్వా సాగు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సుమారు 70 వేల హెక్టార్లలో వరి పంట నష్టపోగా, అరటి, కొబ్బరి పంటలు సుమారు 12 వేల ఎకరాల్లో దెబ్బతిన్నాయి. లక్షలాది కొబ్బరి చెట్లు నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గోదావరి జిల్లాల్లో ప్రధానమైన ఆక్వా సాగు కూడా విద్యుత్ అంతరాయంతో సంక్షోభంలో పడింది. చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

విద్యుత్, పునరావాస సదుపాయాలు వెంటనే కల్పించాలి:

తుపాను ప్రభావం తగ్గినా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం కొనసాగుతోంది. రహదారులపై చెట్లు పడిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు దెబ్బతిన్నాయి. విద్యుత్ పునరుద్ధరణ కోసం అదనపు సిబ్బందిని నియమించి పనులను వేగవంతం చేయాలి. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు బియ్యం, పప్పులు, పాలు, ఇతర నిత్యావసర సరుకులను వెంటనే పంపిణీ చేయాలి. పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి బాధితులకు తక్షణ సహాయం అందించాలి. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకూడదు.

పంటల బీమా, నష్టపరిహారం అందించాలి:

మైవస్ జగన్ ప్రభుత్వ హయాంలో రైతులకు పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి అండగా నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, ఉద్యాన పంటలు, కొబ్బరి తోటలు, దెబ్బతిన్న ఇళ్ల నష్టాన్ని వేగంగా అంచనా వేయాలి. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు తగిన నష్టపరిహారం అందించాలి. మైవస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో బాధితులకు కూరగాయలు, పాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి:

పశ్చిమ గోదావరి జిల్లాలోని 20 మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో మైవస్ఆర్‌సీపీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండు మున్సిపాలిటీల్లోనూ పార్టీ పోటీ చేస్తోంది. నరసాపురం నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 41 ఎంపీటీసీ స్థానాలకు, రెండు జెడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థులను బరిలో నిలిపాం. నిత్యావసరాల ధరల పెరుగుదల, అమలు కాని హామీలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రజలు ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ముదునూరి ప్రసాదరాజు విజ్ఞప్తి చేశారు.

కొంపముంచిన చోలే భటూరే..

అదనపు చోలే అడిగినందుకు కత్తితో పొడిచి హత్య



న్యూఢిల్లీ: సందీప్ ఆదివారం జ్వాలాపురి నాలా సమీపంలోని వారపు సంతకు వెళ్లాడు. అక్కడ చోలే భటూరే విక్రేతను అదనంగా చోలే ఇవ్వాలని అడిగాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విక్రేత సందీప్‌ను దూషించడంతో వివాదం మరింత ముదిరి ఘర్షణకు దారితీసిందని సందీప్ తండ్రి బిజేందర్ సింగ్ ఆరోపించారు. ఈ క్రమంలో విక్రేత తన కుమారుడిపై పలుమార్లు కత్తితో దాడి చేశాడని తెలిపారు. దాడిలో సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అక్టోబర్ 25 రాత్రి తొలుత సంజయ్ గాంధీ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పంజాబీ బాగ్‌లోని మహారాజా అగ్రసేన్ ఆసుపత్రికి మార్చారు. అయితే, రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సందీప్ మంగళవారం చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. వైద్య-న్యాయ నివేదిక ప్రకారం.. సందీప్ ఎడమ వైపు పొత్తికడుపుపై మూడు కత్తిపోట్లు ఉన్నాయి. ఎడమ ముంజేయిపై మూడు గాయాలతో పాటు మణికట్టుపై మరో గాయం ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.సందీప్ గాయాల తీవ్రత, ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించిన పోలీసులు తొలుత హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 109(1) కింద ఆదివారం పశ్చిమ్ విహార్ వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విచారణలో భాగంగా చింటూ గుప్తాను అరెస్టు చేసి న్యాయ కస్టడీకి తరలించారు. సందీప్ మరణించిన అనంతరం పోలీసులు కేసులో బీఎన్ఎస్ సెక్షన్ 103(1)ను చేర్చారు. ఈ సెక్షన్ హత్య నేరానికి సంబంధించినది. తన కుమారుడిపై జరిగిన దాడిలో ముగ్గురు లేదా నలుగురు పాల్గొన్నారని, అయితే పోలీసులు ఇప్పటివరకు ఆహార విక్రేతను మాత్రమే అరెస్టు చేశారని బిజేందర్ సింగ్ ఆరోపించారు. ఘటన గురించి తెలియగానే తాను అక్కడికి చేరుకున్నానని, కొందరు ప్రత్యక్ష సాక్షుల సహాయంతో కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు.అదనంగా కొంత చోలే అడగడమే నా కుమారుడు చేసిన తప్పు. అతడిపై పలుమార్లు కత్తితో దాడి చేశారు. రెండు రోజుల పాటు ప్రాణాలతో పోరాడి చివరకు మృతి చెందాడు అని సందీప్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న వారందరినీ గుర్తించి అరెస్టు చేయాలని, తమకు న్యాయం చేయాలని ఆయన పోలీసులను కోరారు. సందీప్ ఢిల్లీలోని నిహాల్ విహార్ పరిధిలో రావ్ విహార్ ప్రాంతంలో నివసిస్తూ ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్యతో పాటు నాలుగు, పది సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న సందీప్ మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

నా ప్రస్తైలతాడునే లాగుతార్రా...

దొంగల్ని పట్టుకుని పాట్లు పాట్లు కొట్టిన మహిళ



సాధారణంగా దొంగలు యజమానుల నుంచి తప్పించుకుని పోలీసులకు దొరుకుతారు. కానీ ఈ దొంగలు మాత్రం దొంగతనం చేస్తూ యజమానికే దొరికారు. దాంతో వారికి దేహశుద్ధి తప్పలేదు. గత కొంత కాలంగా బంగారం రేట్లు పెరుగుతున్న క్రమంలో దోపిడీలు పెరుగుతున్నాయి. మహిళలు బయట కనిపిస్తే వారి మెడలో పుస్తెల తాడులు లాక్కెళ్లడం, తాళం వేసిన ఇళ్లలో చొరబడి బంగారం, డబ్బును కాజేయడం లాంటి ఘటనలు ఇటీవల అధికం అవుతున్నాయి. ఓవైపు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా ఇలాంటి ఘటనలు మాత్రం ఆగడం లేదు. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఇలాంటి ఘటనే జరిగింది. మహిళ మెడలో చైన్ స్నాచింగ్ కు యత్నించగా ఆ మహిళ సాహసంతో వారిని పట్టుకుని చితకబాదింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఏం జరిగిందంటే..సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్ పల్లి గ్రామానికి చెందిన కిష్టమ్మ అనే మహిళ తన పొలంలో పని చేస్తూ ఉంది. అయితే ఇదే క్రమంలో ఆమె మెడలోని పుస్తెల తాడును లాక్కునేందుకు ఇద్దరు వ్యక్తులు యత్నించారు. ఆమె కేకలు వేయడంతోపాటు వారిని పట్టుకునేందుకు యత్నించింది. వారి చేతి వేళ్లు కొరికింది. ఈ లోపు సమీప పొలాల్లోని రైతులు వచ్చి వారిని పట్టుకున్నారు. ఆ తర్వాత ఆ మహిళ పెద్ద కర్రతో ఇద్దరు దొంగల్ని కొడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో దొంగల నుంచి నగలను కాపాడుకున్న ఆ మహిళ ధైర్యాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఇక నిందితులు హత్నూర మండలం ముచ్చర్లకు చెందిన వడ్డే సాయిలు, మీనంపల్లికి చెందిన అరవింద్ గా గుర్తించారు. వీరిపై గతంలోనూ కేసులు ఉన్నాయని జిన్నారం సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.ఈ మేరకు బహిరంగ ప్రదేశాల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరిపైనా అనుమానం వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కొచ్చి హిట్ అండ్ రన్ కేసులో జడ్జి అరెస్టును నిలిపివేసిన కేరళ హైకోర్టు



కేరళలోని కొచ్చి నగరంలో తీవ్ర కలకలం రేపిన మెర్సిడెస్-బెంజ్ కారు ప్రమాదం కేసులో నిందితుడిగా చేర్చబడిన అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జికి రాష్ట్ర హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. విచారణాధికారుల దర్యాప్తుకు సహకరిస్తున్న సమయంలో ఆయన్ను అరెస్టు చేయాల్సిన అవసరం లేదని భావించిన ఉన్నత న్యాయస్థానం.. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు జడ్జి అరెస్టును నిలిపివేస్తూ స్టే విధించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు గురువారం మధ్యాహ్నం 1 గంటకు దర్యాప్తు బృందం ముందుకు హాజరై విచారణకు సహకరించాలని ఆదేశించింది. ఇరింజలకుడ మోటారు ప్రమాదాల దావాల ట్రిబ్యునల్‌లో జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పేరు మీద ప్రమాదానికి కారణమైన మెర్సిడెస్ కారు ఆయన పేరు మీదే ఉండడంతో.. ఈ కేసులో ఆయనను పోలీసులు నిందితుడిగా చేర్చారు.అసలేం జరిగిందంటే..అక్టోబర్ 25వ తేదీ తెల్లవారుజామున కొచ్చిన్ సమీపంలోని చేరనల్లూర్ మారపరంబు రోడ్డుపై చోటుచేసుకుంది.

కొచ్చిలో రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్ నడుపుకునే 55 ఏళ్ల జయ బాలకృష్ణన్ తన వ్యాపారాన్ని ముగించుకుని స్కూటర్‌పై ఇంటికి తిరుగుప్రయాణం అయ్యారు. అయితే అదే సమయంలో జడ్జి 17 ఏళ్ల మైనర్ కుమారుడు కారు నడుపుతూ వచ్చి.. స్కూటర్‌ను ఢీకొట్టారు. ఈ తీవ్రమైన ప్రమాదంలో జయబాలకృష్ణన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 199ఏ ప్రకారం.. మైనర్ నేరానికి పాల్పడితే కారు యజమాని లేదా గార్డియన్‌పై చట్టపరంగా కేసు నమోదు చేయొచ్చు. ఈ విధంగానే జడ్జిపై కేసు నమోదు అయింది.

అయితే తన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో జడ్జి అనేక అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో తాను గాఢ నిద్రలో ఉన్నానని, కుమారుడు ఫోన్ చేసి చెప్పిన తర్వాతే సంఘటన గురించి తెలిసిందని పేర్కొన్నారు. కేవలం కారు తన పేరిట నమోదు అయి ఉన్నంత మాత్రాన క్రిమినల్ బాధ్యతను తనపై మోపలేమని సవాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. వారు వేరే కారులో అక్కడికి వెళ్లారని, ఆ పర్యటన కేవలం ఒక తండ్రిగా ఆందోళనతో మాత్రమే జరిగిందని, దర్యాప్తును ప్రభావితం చేసేందుకు లేదా జడ్జి హోదాను దుర్వినియోగం చేసేందుకు కాదని స్పష్టం చేశారు.ఈ కేసు ప్రారంభ విచారణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో నలుగురు పోలీసు సిబ్బందిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కేసు తీవ్రతను బట్టి విచారణను జిల్లా క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేయడమే కాకుండా, కొచ్చి సిటీ పోలీస్ కమిషనర్ ఎస్ కాళీరాజ్ మహేష్ కుమార్‌ను కూడా పదవి నుంచి తొలగించారు. అలాగే మైనర్‌కు కారును ఎందుకు ఇచ్చారో వివరణ కోరుతూ కేరళ మోటారు వాహనాల శాఖ జడ్జికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ప్రమాదానికి కారణమైన టీనేజర్‌పై, అతని తండ్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబం డిమాండ్ చేస్తోంది.

బాధితులకు బ్యాంకులే పరిహారం చెల్లించాలి..... డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



దేశంలో వెలుగుచూస్తోన్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ ప్రచారాలు, మీడియా కథనాలు, కోర్టు ఉత్తర్వులు ఇన్ని ఉన్నప్పటికీ విద్యావంతులు కూడా ఎలా మోసపోతున్నారో అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. "ఈ బాధితులకు ఏమైంది? వీళ్లు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? ఈ ప్రాథమిక విషయం కూడా వాళ్లకు అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు చేస్తారేమోనని భయమెందుకు?" అని సీజేఐ ప్రశ్నించారు."మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు పోతుంది కదా? మనుషుల్లో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్‌లో అరెస్ట్ అవ్వడమేంటి?" అని సీజేఐ వ్యాఖ్యానించారు. "ఈ వయస్సులో మీరు డిజిటల్‌గా అరెస్ట్ అయితే రాబోయే తరానికి ఏం పాఠాలు నేర్పుతారు? అసలు నిజంగా కోర్టు ఉత్తర్వులు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు కదా?" అని ప్రధాన న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గతవారం ఓ మహిళ డిజిటల్ అరెస్ట్ మోసంతో రూ. 2.5 కోట్లు పోగొట్టుకున్న విషయాన్ని అమికస్ క్యూరీ ఎన్.ఎస్. నప్పినాయ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.డిజిటల్ అరెస్ట్ మోసాల బారిన పడుతున్న బాధితులకు బ్యాంకులు రక్షణ కవచంగా నిలవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రిటైర్డ్ వ్యక్తుల ఖాతాల నుంచి అనూహ్యంగా పెద్ద మొత్తంలో సగదు ట్రా అవుతుంటే బ్యాంకులు సకాలంలో ఎందుకు స్పందించి నిరోధించడం లేదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ప్రశ్నించింది.బ్యాంకులు సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోవడం వల్ల మోసం జరిగిందని విచారణ తేలితే, ఆ బాధితుడికి జరిగిన నష్ట పరిహారాన్ని పూర్తి స్థాయిలో సదరు బ్యాంకే చెల్లించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, సంబంధిత బ్యాంకులపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

ప్రపంచాన్ని చుట్టేద్దామనుకుంటే.. నడి సముద్రంలో వదిలేశారు



ప్రపంచమంతా చుట్టేస్తూ, రోజూ ఒక కొత్త దేశంలో నిద్రలేవాలనేది చాలామందికి ఉండే ఒక పెద్ద కల. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా ప్రపంచాన్ని తిరిగేద్దామనుకునే భాగ్యవంతుల కలలను ఆసరాగా చేసుకుని 'సముద్రంపై తేలియాడే నివాసాలు' పేరిట ఓ విదేశీ కంపెనీ భారీ హంగామా చేసింది. ఓ విలాసవంతమైన విహార నౌకనే శాశ్వత నివాసంగా మార్చుకుని, ఏళ్ల తరబడి సముద్ర ప్రయాణం చేయవచ్చంటూ కోట్ల రూపాయలు వసూలు చేసింది. అయితే, ఆ నివాస నౌక ప్రయాణం సగం దూరం కూడా సాగకుండానే కంబోడియా తీరంలో ఆర్థిక సంక్షోభం రూపంలో భారీ ప్రమాదంలో పడింది. ఇంధన ధరల భారం, అంతర్గత నిర్వహణ లోపాలతో నౌక సర్వీసులను హఠాత్తుగా నిలిపివేయడంతో వందలాది మంది ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో కంబోడియా సముద్ర తీరంలో చిక్కుకుపోయారు.

లగ్జరీ క్యాబిన్.. కోట్లలో పెట్టుబడి

అమెరికా ఫ్లోరిడాకు చెందిన 'విల్లా వీ రెసిడెన్సెస్' అనే సంస్థ ఈ వినూత్న సముద్ర నివాస ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. 'ఎమ్‌వీ ఆడిసీ' అనే భారీ క్రూయిజ్ షిప్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, అందులో క్యాబిన్లను నివాస గృహాలుగా విక్రయించింది. ఒక్కో క్యాబిన్ జీవితకాల హక్కుల ధర అక్షరాలా రూ.2 కోట్ల పైమాటే. అంతేకాకుండా ప్రతినెలా మెయింటెనెన్స్ ఖర్చుల కింద వేలాది డాలర్ల వసూలు చేసేవారు. హోటళ్లు మారే తిప్పలు లేకుండా, తరచూ సూట్‌కేసులు సర్దుకోవాల్సిన అవసరం లేకుండా ప్రపంచం మొత్తాన్ని తమ గుమ్మం ముందుకు తీసుకొచ్చే ఈ కాన్సెప్ట్‌కు ఆకర్షితులై అమెరికా సహా పలు దేశాలకు చెందిన ధనవంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, డిజిటల్ నోమాడ్స్ ఈ నౌకలో శాశ్వత నివాసాలను కొనుగోలు చేశారు.

ప్రపంచ యాత్రగా మొదలై.. అడుగడుగునా సమస్యలు

ఉత్తర ఐర్లాండ్‌లో అన్ని రీఫిట్టింగ్ పనులూ పూర్తి చేసుకుని, 2024 అక్టోబర్‌లో ఈ విలాసవంతమైన 'ఎమ్‌వీ ఆడిసీ' నౌక మూడేళ్లన్నర ప్రపంచ యాత్రను ప్రారంభించింది. ఏడు ఖండాలను చుట్టిరావాలనే లక్ష్యంతో ప్రయాణం మొదలైన కొద్దిరోజులకే పర్యాటకులకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. అనుకున్న షెడ్యూళ్లను తరచూ మార్చడం, నౌకలో వైఫై సేవలు సరిగా లేకపోవడం, ఫుడ్ క్వాలిటీ లేకపోవడం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఇంధనం, ఇతర ఖర్చుల పేరుతో యాజమాన్యం తమ వద్ద నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తోందని ప్రయాణికులు ఆరోపించడం ప్రారంభించారు.

మధ్యలోనే ముగిసిన ప్రయాణం

మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధిలో షిప్పింగ్ నిబంధనల కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆసియా సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న సమయంలో ప్రతినెలా ఒక్కో క్యాబిన్‌పై ఇంధన భారం సుమారు రూ. 1.5 లక్షల నుంచి ఏకంగా రూ. 6.5 లక్షల వరకు పెరిగిపోయింది. నౌక వేగాన్ని తగ్గించి, రేవుల్లో ఎక్కువ సేపు ఉంచడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాలని చూసినా ఫలితం లేకపోయింది. దీంతో నౌకను నడపడం తమ వల్ల కాదంటూ అక్టోబర్ 27న కంపెనీ యాజమాన్యం చేతులెత్తేసింది.

7 గంటల డెడ్‌లైన్.. రోడ్డున పడ్డ కోటీశ్వరులు

కంబోడియాలోని సిహానోక్‌విల్లే పోర్టుకు నౌక చేరుకున్న కొద్దిసేపటికే కంపెనీ సంచలన ప్రకటన చేసింది. నౌకలోని 203 మంది ప్రయాణికులు, 156 మంది సిబ్బంది కేవలం 7 గంటల వ్యవధిలోనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశించింది. తమ సొంత నివాసాలను అమ్మేసి, సముద్రంపై ఇళ్లను కొనుగోలు చేసిన ఈ బాధితులు, ఇప్పుడు తిరిగి స్వదేశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయాలు లేక, చేతిలో ఉన్న కోట్ల రూపాయల పెట్టుబడి ఏమవుతుందో తెలియక విలపిస్తున్నారు. కేవలం ఇంధన ధరల పెరుగే కాకుండా, యాజమాన్య లోపాలు, సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక అందమైన కలగా మొదలైన తేలియాడే నివాస ప్రయాణం.. చివరికి కంబోడియా తీరంలో ఒక కడివెడు కన్నీటిగా మిగిలిపోయింది.


రాష్ట్రస్థాయి షూటర్ .. పట్టపగలే తండ్రికొడుకు సహా ముగ్గురిని కాల్చి చంపేశాడు



ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ చిన్న పార్కింగ్ వివాదం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. రాష్ట్రస్థాయి షూటర్ అయిన ఓ వ్యక్తి, తన పొరుగింటిలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని పట్టపగలే కాల్చి చంపాడు. ఈ ఘాతుకానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేపుతోంది.లక్నోలోని సాదత్‌గంజ్ ప్రాంతంలోని బ్రాహ్మణి టోలాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 26న ఉదయం 10:30 గంటల సమయంలో, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శివాజీ తివారీ (63), ఆయన సోదరుడు శివేంద్ర అలియాస్ శంభు (55), శివాజీ కుమారుడు సుయాశ్ (30) హత్యకు గురయ్యారు. వీరి ఇంటి పక్కనే నివసించే రిషభ్ శుక్లా అనే వ్యక్తితో పార్కింగ్ స్థలం విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది.సంఘటన జరిగిన రోజు ఉదయం తివారీ కుటుంబ సభ్యుడు ఒకరు వివాదాస్పద స్థలంలో కారు పార్క్ చేయడంతో గొడవ మళ్లీ మొదలైంది. వాగ్వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఆగ్రహానికి గురైన రిషభ్ శుక్లా తన వద్ద ఉన్న పిస్టల్‌తో కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో శివాజీ, శివేంద్ర, సుయాశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ ట్రామా సెంటర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురూ మరణించారు. త్వరలో వివాహం జరగాల్సి ఉండగా సుయాశ్ మృతి చెందడం వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.నిందితుడు రిషభ్ శుక్లా గతంలో మర్చంట్ నేవీలో నావిగేషన్ అధికారిగా పనిచేశాడని, రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు కూడా గెలుచుకున్నాడని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అతడిని అరెస్ట్ చేసి, పిస్టల్, ఖాళీ కాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. దీంతో, స్థానిక ఎస్‌హెచ్‌ఓ సహా ఇద్దరు పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలలో నిందితుడు కాల్పులు జరుపుతున్న దృశ్యాలు, గాయపడిన వ్యక్తి సాయం కోసం అర్థిస్తున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. ఈ వీడియోల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY K.B.G.TILAK, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA, D.NO.28-1-22, II FLOOR, SHAIK MOHIUDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520 002. EDITOR : K.B.G.TILAK. PH : 0866 - 6620870. R.N.I.NO.APTEL/1999/1614

పుల్లారెడ్డి స్వీట్స్ లైసెన్స్ సస్పెన్షన్ -ఇలా తయారు చేస్తారా?



దీపావళి పండుగ వేళ మిఠాయిల కొనుగోళ్లతో సందడిగా మారిన భాగ్యనగరంలో ఆహార భద్రతా ప్రమాణాలు దారుణంగా దిగజారిన వైనం బట్టబయలైంది. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు నగరవ్యాప్తంగా చేపట్టిన మెరుపు తనిఖీల్లో ప్రముఖ స్వీట్ బ్రాండ్ జి. పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ కేంద్రంలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. సనత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్స్ ప్రధాన తయారీ కేంద్రంలో కనీస పరిశుభ్రత పాటించకపోవడం, ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టేలా ఉండటంతో సదరు యూనిట్ ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయించారు.పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ కేంద్రంలో అధికారులు జరిపిన సోదాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతున్నట్లు తేలింది. స్వీట్లు తయారు చేసే ప్రధాన వంటగది, వాషింగ్ ఏరియాలు అత్యంత మురికిగా ఉండటమే కాకుండా.. ముడిసరుకులు నిల్వ చేసే స్టోరేజ్ గదుల్లో ఎలుకల మలం, విచ్చలవిడిగా తిరుగుతున్న క్రిమికీటకాలు, కుళ్ళిపోయిన కూరగాయలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా సరైన కేటగిరీ కింద లైసెన్స్ తీసుకోకపోవడం, తయారీ గడువు ముగిసిన నిల్వలను ఉంచడం, తప్పుడు లేబుళ్లతో కూడిన పదార్థాలను ఉపయోగించడం వంటి తీవ్ర ఉల్లంఘనలు బయటపడ్డాయి. దీంతో సుమారు రూ. 15.03 లక్షల విలువైన 3,133 కిలోల అనుమానాస్పద ఆహార పదార్థాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్కడికక్కడే సీజ్ చేశారు.కేవలం పుల్లారెడ్డి స్వీట్స్‌కే పరిమితం కాకుండా.. 13 ప్రత్యేక బృందాలతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విస్తృతంగా సోదాలు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం మరో నాలుగు ప్రముఖ సంస్థల లైసెన్సులను సైతం రద్దు చేసింది. చార్మినార్‌లోని ఆగ్రా మిఠాయి ఘర్, కాటేదాన్‌లోని మినర్వా స్వీట్స్, వనస్థలిపురంలోని స్వీట్ వన్ రుచులు, ఫలక్‌నుమాలోని బాలాజీ శ్రీ కిషన్ మిఠాయి భండార్‌ల లైసెన్సులను సస్పెండ్ చేసి తయారీని నిలిపివేశారు. అలాగే తిమ్మాపూర్‌లోని ప్రసిద్ధ కరాచీ బేకరీ ఇంటర్నేషనల్ యూనిట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు.. కనీస లైసెన్స్ లేకుండా, అపరిశుభ్రంగా నడుస్తున్న చంపపేట్ బాలాజీ స్వీట్స్, సికింద్రాబాద్ మమతా స్వీట్ హౌస్ సహా మరో 5 తయారీ కేంద్రాలను పూర్తిగా మూసివేయించారు.ఈ దాడుల సందర్భంగా మొత్తం 22 రకాల స్వీట్ శాంపిళ్లను సేకరించిన అధికారులు, రసాయనాలు , కల్తీని గుర్తించేందుకు ప్రభుత్వ ల్యాబ్ పరీక్షలకు పంపించారు. లాభాపేక్షతో ప్రముఖ బ్రాండ్ల పేరిట నాసిరకం, అనారోగ్యకరమైన నూనెలు, రసాయన రంగులతో మిఠాయిలు తయారు చేసి విక్రయిస్తే ఎంతటి పెద్ద సంస్థలైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఫుడ్ సేఫ్టీ విభాగం హెచ్చరించింది.

మియాపూర్ భూములు సర్కారువే -- సుప్రీంతీర్పుతో వేల కోట్లు

హైదరాబాద్ లో అత్యంత విలువైన మియాపూర్ భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో చారిత్రక విజయం దక్కింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమిపై ప్రైవేట్ వ్యక్తులు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓపెన్ మార్కెట్లో రూ. వేల కోట్ల విలువైన ఈ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం చేయడానికి న్యాయస్థానం ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, ప్రజాధనం–ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తాము మౌనంగా ఉండలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికార యంత్రాంగం చూపిన చొరవను ప్రశంసిస్తూ, ఉమ్మడి హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ వివాదం మూలాలు దశాబ్దాల క్రితం నాటి నిజాం జాగీర్దారీ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. సర్వే నంబర్లు 100, 101లలోని భూములను నిజాం కాలం నాటి జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నీసా బేగం తదితరుల నుంచి కొనుగోలు చేశామంటూ గోల్డ్‌స్టోన్ పార్థసారథి, ఆయన సోదరుడు ప్రసాద్, సువిశాల్ జైన్ తదితరులు క్లెయిమ్ చేశారు. వారి నుంచి ఇరివోకబుల్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందామని, సనద్ హక్కుల ప్రకారం ఈ భూములు తమకే చెందుతాయని వాదిస్తూ ట్రినిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సువిశాల్ పవర్, గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థల పేరిట రికార్డులు సృష్టించే ప్రయత్నం చేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ ఈ జీపీఏ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు కోర్టులను ఆశ్రయించారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తహసీల్దార్ చర్యను సమర్థిస్తూ ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పు ఇవ్వగా, ఆ తీర్పును సవాలు చేస్తూ గోల్డ్‌స్టోన్ వర్గం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది.సుప్రీంకోర్టులో గత 23 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుపై తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు గట్టి ఆధారాలతో వాదనలు వినిపించారు. జాగీర్దార్ కైసరుద్దీన్‌కు నిజాం నవాబుల కాలంలోనే ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించారని, జాగీర్ల రద్దు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ భూములు పూర్తిగా సర్కారు పరం అయ్యాయని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందులో మెజార్టీ భూమిని హెచ్ఎండీఏకు అప్పగించామని, కొంత భాగాన్ని హైదరాబాద్ మెట్రో రైల్ డిపోకు కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చట్టబద్ధంగా పరిహారం తీసుకున్న తర్వాత కూడా నకిలీ డాక్యుమెంట్లు, మోసపూరిత రెవెన్యూ రికార్డులతో వారసులమంటూ క్లెయిమ్ చేయడం చెల్లదని సర్కారు వాదించింది.ఇరుపక్షాల వాదనలను సమగ్రంగా పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. మోసపూరిత రెవెన్యూ రికార్డుల ద్వారా ఎలాంటి యాజమాన్య హక్కులు రావని తేల్చిచెప్పింది. 2003 నాటి హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తూ, ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. 2017లో కూకట్‌పల్లి సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా జరిగిన భారీ మియాపూర్ భూకుంభకోణం వెనుక కూడా ఇదే నెట్‌వర్క్ ఉండటం, క్రిమినల్ కేసులు నమోదు కావడం అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తుది తీర్పుతో ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉన్న 550 ఎకరాల అత్యంత విలువైన భూమిపై తెలంగాణ ప్రభుత్వానికి సంపూర్ణ సర్వహక్కులు ఖరారయ్యాయి.

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు.“జడ్పర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం” అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్పర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు.నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కేటీఆర్‌పై ఆరోపణలు చేయకుండా బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌లపై కోర్టు ఆంక్షలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన రూ.10 కోట్ల పరువు నష్టం దావాపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌లు భవిష్యత్తులో కేటీఆర్‌పై ఎలాంటి నిరాధారమైన, పరువు నష్టం కలిగించే అసత్య ఆరోపణలు చేయరాదని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అంతేకాకుండా, ఇప్పటివరకు ప్రసారమైన వివాదాస్పద వీడియోలు, వార్తా కథనాలను తక్షణమే సోషల్ మీడియా, యూట్యూబ్ తదితర ప్లాట్‌ఫారమ్‌ల నుంచి తొలగించాలని మీడియా సంస్థలను కోర్టు ఆదేశించింది.ఈ వివాదానికి ప్రధాన కారణం ఇటీవల సీఎల్పీ మీడియా హాల్‌తో పాటు పలు మీడియా వేదికల్లో కాంగ్రెస్ నేతలు చేసిన తీవ్రమైన వ్యక్తిగత ఆరోపణలే. కేటీఆర్‌కు డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్నాయని, ప్రైవేట్ జెట్ ప్రయాణాలు చేశారని, సినీ ప్రముఖులు, హీరోయిన్లతో అనుచిత సంబంధాలు ఉన్నాయంటూ బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌లు బహిరంగంగా మాట్లాడారని కేటీఆర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ భయంతోనే పలువురు ముంబైకి వెళ్లిపోయారంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలు, నిర్వహించిన ఇంటర్వ్యూలు తన వ్యక్తిగత ప్రతిష్టను, రాజకీయ జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.కేటీఆర్ తరపు న్యాయవాదుల వాదనలను ఆలకించిన సిటీ సివిల్ కోర్టు.. రాజకీయ విమర్శల పరిధిని దాటి వ్యక్తిగత పరువుకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం సరికాదని అభిప్రాయపడింది. నిరాధార ఆరోపణలతో కూడిన ప్రెస్‌మీట్లు, ఇంటర్వ్యూల వీడియోలను తక్షణమే తొలగించాలని ఆదేశించడంతో పాటు, భవిష్యత్తులోనూ దావాలో పేర్కొన్న అంశాలకు సంబంధించి ఎటువంటి వివాదాస్పద కంటెంట్‌ను ప్రచురించడం గానీ, ప్రసారం చేయడం గానీ చేయరాదని మీడియా, డిజిటల్ మాధ్యమాలకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 28వ తేదీకి వాయిదా వేస్తూ, ప్రతివాదులైన బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌లకు నోటీసులు జారీ చేసింది.కోర్టు తాజా ఆదేశాలు కేటీఆర్‌కు న్యాయపరంగా పెద్ద ఊరట లభించినట్లయింది. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రతిపక్ష నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటాన్ని న్యాయస్థానం అడ్డుకుందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాల్లో విధానపరమైన విభేదాలు సహజమే అయినా, కుటుంబాలు, మహిళలు, వ్యక్తిగత జీవితాలను రోడ్డుపైకి లాగుతూ చేసే దిగజారుడు ప్రచారాలకు కోర్టు తీర్పు చెంపపెట్టుగా నిలిచిందని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

గూగుల్‌కు గట్టి ఎదురుదెబ్బ.. ఒక్కరోజే రూ.47లక్షల కోట్లు నష్టం..

టెక్ దిగ్గజం, గూగుల్ మాతృ సంస్థ అయిన 'ఆల్ఫాబెట్' మార్కెట్ విలువలో చారిత్రక నష్టాన్ని చవిచూసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భారీగా ఖర్చు చేయడం, ప్రధాన ఆదాయ వనరైన సెర్చ్ అడ్వర్టైజింగ్ వృద్ధి మందగించడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురయ్యారు. ఫలితంగా గురువారం ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఒక్కరోజే ఆల్ఫాబెట్ మార్కెట్ విలువ నుంచి దాదాపు 500 బిలియన్ డాలర్లు (రూ.47లక్షల కోట్లు) ఆవిరైపోయాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒకే రోజు ఒక కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో విలువను కోల్పోవడం ఇది ఒక రికార్డు.మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత ఆల్ఫాబెట్ క్లాస్-ఏ షేర్లు 12.64% పతనమై 283.82 డాలర్ల వద్ద ముగిశాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 499.8 బిలియన్ డాలర్లు తగ్గింది. కంపెనీ తన మూడో త్రైమాసికంలో 127.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఇది గతేడాదితో పోలిస్తే 25% అధికమే అయినప్పటికీ, మార్కెట్ విశ్లేషకుల అంచనాలను అందుకోలేకపోయింది.

ముఖ్యంగా కంపెనీకి ప్రధాన ఆదాయ వనరైన గూగుల్ సెర్చ్ విభాగం వృద్ధి కేవలం 12% గా నమోదైంది. గత త్రైమాసికంలో ఇది 17% గా ఉండటంతో, వృద్ధి రేటు మందగించడం ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆల్ఫాబెట్ చేస్తున్న అపారమైన వ్యయం కూడా ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ త్రైమాసికంలోనే కంపెనీ మూలధన వ్యయాలు 51.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇందులో సింహభాగం డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఖర్చు 195 బిలియన్ల నుంచి 205 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని, 2027 నాటికి ఈ వ్యయం మరింత పెరుగుతుందని



కంపెనీ అంచనా వేసింది. భవిష్యత్తు కోసం చేస్తున్న ఈ భారీ పెట్టుబడులు ప్రస్తుత లాభదాయకతపై ప్రభావం చూపుతాయనే భయాలు మార్కెట్‌లో వ్యక్తమయ్యాయి.అయితే, ఈ నిరాశజనక ఫలితాల మధ్య గూగుల్ క్లౌడ్ విభాగం ఆశాకిరణంలా నిలిచింది. ఏఐ సేవలకు డిమాండ్ పెరగడంతో క్లౌడ్ విభాగం ఆదాయం రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి 30.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది అంచనాలను మించిన వృద్ధి అయినప్పటికీ, బాహ్య కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడటం వల్ల సమీప భవిష్యత్తులో క్లౌడ్ మార్జిన్‌లపై ఒత్తిడి ఉండవచ్చని కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు అంగీకరించారు. చాట్‌జీపీటీ వంటి పోటీదారులతో పాటు గూగుల్ సొంత ఏఐ ఫీచర్లు కూడా సంప్రదాయ సెర్చ్ అడ్వర్టైజింగ్ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయనే ఆందోళనలు ఈ ఫలితాలతో మరింత బలపడ్డాయి.

హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం.. అప్రమత్తమైన భారత సరిహద్దు జిల్లాలు



హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం పొంచి ఉంది. భూటాన్‌లోని ఓ హిమ సరస్సు నుంచి ఒక్కసారిగా వరద నీరు ఉప్పొంగడంతో దిగువ ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఈ ప్రభావం భారత్‌పైనా పడే ప్రమాదం ఉండటంతో పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లోని పలు జిల్లాలను అప్రమత్తం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

భూటాన్‌లో ఒక్కసారిగా వరద

భూటాన్‌లోని వాయవ్య ప్రాంతం గాసా జిల్లాలో ఉన్న షింటాపు హిమ సరస్సు వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సరస్సు నుంచి ఉప్పొంగిన నీరు మో చు నది మీదుగా దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తోంది. ఈ వరదల కారణంగా గాసా త్సాచు ప్రాంతంలోని సహజ వేడి నీటి బుగ్గల వద్ద సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం జరగలేదు.

భారత్‌లోని జిల్లాలకు హెచ్చరిక

వరద నీరు భూటాన్‌లోని పునాఖా పట్టణానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీగాంగ్ ప్రాంతానికి చేరినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని భూటాన్ అధికారులు భారత్‌ను అప్రమత్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అలీపుర్‌దువార్, జల్‌పాయ్‌గురి జిల్లాలతో పాటు అసోంలోని ధుబ్రి జిల్లాలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నదీ తీర ప్రాంతాలపై నిఘా

భూటాన్‌లో వరదల ప్రభావం సంకోశ్ నదిపై పడే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌దువార్ జిల్లాలో నదీ తీర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోనూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. భూటాన్‌లో వరద ఉద్ధృతికి సౌర విద్యుత్తుతో పనిచేసే సాగునీటి వ్యవస్థ దెబ్బతింది. పునాఖా–గాసా రహదారిపైకి వరద వ్యర్థాలు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది.

పోలీసుల లాఠీలకు భయపడొద్దు.. ఛలో ఢిల్లీకి పోటెత్తండి... రాహుల్ గాంధీ పిలుపు



ఢిల్లీలో జరగనున్న రామ్‌లీలా మైదాన్ మార్చ్ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ఓట్ల చోరీని అడ్డుకునేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు చేపడుతున్న మార్చ్ అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఓట్ బచావో.. దేశ్ బచావో పేరుతో భారీ ర్యాలీ చేపట్టనుంది.. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ప్రజలకు, యువతకు ఛలో ఢిల్లీకి పెద్దసంఖ్యలో తరలిరావాలంటూ పిలుపునిచ్చారు.ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చేపట్టిన మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదు.. ఇది భారతదేశ ఆత్మను కాపాడేందుకు చేపడుతున్న మార్చ్. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌లతో విసిగిపోయిన వారందరూ ఈ మార్చ్ లో పాల్గొనాలని రాహుల్ గాంధీ కోరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుకునే ప్రతిఒక్కరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలి. ఇది ఒక్క నిరసన మాత్రమే.. ఇది దేశం మొత్తం చేస్తున్న నిరసన. పోలీసుల గురించి ఆందోళన చెందకండి. లాఠీచార్జీల గురించి భయపడకండి. ఇలాంటి చర్యలకు పాల్పడే ధైర్యం బీజేపీకి ఉండదు. మనమంతా కలిసి మార్చ్‌లో పాల్గొందాం. రాజ్యాంగాన్ని కాపాడేందుకు, భారతదేశాన్ని పరిరక్షించేందుకు కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.మీ రాజకీయ అనుబంధం ఏదైనా సరే.. విద్యార్థి సంఘాలన్నింటికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. భారతదేశంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, మీపై దాడి జరుగుతోందని, మీ భావప్రకటన స్వేచ్ఛ, మీ ఆలోచనలు, మీ అభిప్రాయాలు లక్ష్యంగా మారుతున్నాయని మీరు అనుకుంటే.. ఈ మార్చ్‌లో వచ్చి పాల్గొనండి. ఈ మార్చ్ అద్భుతంగా సాగుతుంది. ఇది ఈ దేశ ఆత్మను కాపాడేందుకు చేపడుతున్న మార్చ్. మీరందరినీ అక్కడ కలుసుకోవాలని ఎదురుచూస్తున్నాను. అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.మరోవైపు, నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీని భారీ స్థాయిలో నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలతో సమావేశమవుతున్నారు. శుక్రవారం నిర్వహించనున్న మాక్ పార్లమెంట్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను ప్రతీకాత్మకంగా అభిశంసించే కార్యక్రమాన్ని చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం అనంతరం నవంబర్ 1న రాంలీలా మైదానంలో ర్యాలీ నిర్వహించనున్నారు.

విలేకరిపై డొనాల్డ్ ట్రంప్ బాడీ షేమింగ్.. చూడటానికి భయంకరంగా ఉన్నావంటూ వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మీడియా ప్రతినిధిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఆరోగ్యం, రద్దయిన ఎన్నికల ర్యాలీల గురించి ప్రశ్నించిన రాయిటర్స్ విలేకరిపై వ్యక్తిగత దాడికి దిగారు. అతడి శరీరాకృతిని కించపరిచేలా “అసహ్యంగా ఉన్నావు”, “చూడటానికి భయంకరంగా ఉన్నావు” అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన గురువారం మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్ వద్ద చోటుచేసుకుంది.సౌత్ కరోలినాలో ప్రచార ర్యాలీ ముగించుకుని తిరిగి వస్తున్న ట్రంప్‌ను రాయిటర్స్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ జాకబ్ బోగేజ్ పలకరించారు. కొన్ని వారాలుగా నిరంతరాయంగా ప్రయాణిస్తున్నందున, మీ ఆరోగ్యం ఎలా ఉందని మొదట ప్రశ్నించారు. అనంతరం “ప్రయాణాలతో విసిగిపోవడం వల్లే కాన్సాస్ ర్యాలీని రద్దు చేశారా?” అని అడగటంతో ట్రంప్ ఒక్కసారిగా సహనం కోల్పోయారు.“అలాంటి ప్రశ్న అడిగినందుకు నీకే అనారోగ్యంగా ఉండాలి. నువ్వు ఒక రోగివి. ఏ సంస్థ నీది?” అని ట్రంప్ మండిపడ్డారు. రాయిటర్స్ అని తెలియగానే “రాయిటర్స్ ఒక చెత్త సంస్థ. ఈ వ్యక్తిని చూడండి. అతడి శరీరాకృతి దారుణంగా ఉంది. రెండు వారాలుగా నన్ను అనుసరిస్తున్నావు కదా, నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. నువ్వు అసహ్యంగా ఉన్నావు. ముందు నీ శరీరాన్ని అదుపులో పెట్టుకో. చూడటానికి భయంకరంగా ఉన్నావు” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా కాన్సాస్‌లోని సలీనాలో సెనేటర్ రోజర్ మార్షల్‌కు మద్దతుగా శనివారం, ఐయోవాలోని దుబుక్‌లో ఆదివారం జరగాల్సిన ర్యాలీలను ట్రంప్ రద్దు చేసుకున్నారు. దీనిపై వివరణ ఇస్తూ, కాన్సాస్‌లో మార్షల్ గెలుపు ఖాయమని, అందుకే అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని భావిస్తున్నానని చెప్పారు. ప్రత్యక్ష ర్యాలీల బదులు టెలీ–ర్యాలీల ద్వారా ఎక్కువ మంది ఓటర్లకు చేరువయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది ఒక వ్యూహాత్మక ఎత్తుగడ అని ఆయన పేర్కొన్నారు.గత కొద్ది రోజులుగా ట్రంప్ సుదీర్ఘ ప్రచార ర్యాలీల్లో పాల్గొంటుండటంతో ఆయన గొంతు బొంగురుపోయింది. నిరంతరం ర్యాలీలు చేయడం వల్ల తన స్వరపేటికపై ఒత్తిడి పడుతోందని ఆయనే గతంలో వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా డెమోక్రటిక్ సెనేటర్‌ను ఎన్నుకోని కాన్సాస్‌లో ఈసారి పోటీ గట్టిగా ఉండటంతో, ప్రత్యర్థి అభ్యర్థికి అధిక్యం ఉన్నట్లు కొన్ని సర్వేలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ర్యాలీలు రద్దు కావడం, ఆరోగ్యంపై ప్రశ్నలు ఎదురవ్వడంతో ట్రంప్ తన అసహనాన్ని విలేకరిపై ప్రదర్శించారు.

'ఇదే నా వార్నింగ్.. మీ ఎదుగుదల కోసం మరో మహిళను అణగదొక్కకండి'

ఉపాసన కొణిదెల కీలక వ్యాఖ్యలు



యాంకర్ గా బుల్లితెరపై తిరుగులేని పాపులారిటీ సంపాదించుకున్న సుమ కనకాల.. చేతినిండా షోలతో ఏడాది పొడవునా బిజీగా ఉంటారు. ఎంత బిజీగా ఉన్నా, తనవంతు బాధ్యతగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆమె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫెస్టివల్ ఆఫ్ జాయ్' ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అందరి జీవితాల్లోనూ పండగ నింపాలనే లక్ష్యంతో సుమ ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ వేడుకలకు అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్, హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన కామినేని కొణిదెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఎంతోమందికి మేలు చేస్తాయని, సమాజంలో ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మెగా కోడలు కీలక వ్యాఖ్యలు చేశారు.ఉపాసన మాట్లాడుతూ.. "సుమ గారిని చూసినప్పుడు ఒక నిజమైన మహిళ ఇలానే ఉండాలని అనిపిస్తుంది. ఆమె ఎంతో పవర్ ఫుల్ గా, ఆత్మ విశ్వాసంతో ఉంటారు. అలానే ఆమె సక్సెస్ అయ్యారు. ఆమె ఆత్మవిశ్వాసం, పట్టుదల, విజయాలు నిజంగా అభినందనీయం. మనందరం ఆమెను ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సుమని మనం ఎన్నో ఆడియో ఫంక్షన్స్ లో చూస్తుంటాం. తన యాంకరింగ్ తో ఎన్నోసార్లు షోని కాపాడారు. అన్నిట్లోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అందుకు సుమకు థ్యాంక్స్ చెప్తున్నా. ఆమె ఎందరికో గుండెచప్పుడుగా మారారు. 'ఫెస్టివల్ ఆఫ్ జాయ్' కార్యక్రమాన్ని ప్రారంభించి, ఇంత గొప్పగా ముందుకు తీసుకెళ్తున్నందుకు ధన్యవాదాలు" అని అన్నారు.'సమాజంలో చాలామంది మహిళలకు మన సహాయం అవసరం ఉంది. కానీ నా పరిశీలనలో తెలిసింది ఏంటంటే.. బయట చాలామంది ఆడవాళ్లు స్వార్థంతో తమ ఎదుగుదల కోసం ఇతర మహిళలను తొక్కాలని చూస్తున్నారు. అలాంటి ఆడవారికి నేనిచ్చే వార్నింగ్ ఇదే.. మీ సక్సెస్ కోసం, ఒక బలహీనమైన మగాడిని సంతోష పెట్టడం కోసం ఇతర స్త్రీలను అణగదొక్కవచ్చని అస్సలు ఆలోచించకండి" అంటూ ఉపాసన ఘాటుగా మాట్లాడారు. అనాథాశ్రమాలలో పిల్లల దీన స్థితిని గుర్తు చేస్తూ.. కొందరు మహిళలు చేసిన తప్పులు, అన్యాయాల వల్లే అక్కడ ఎంతోమంది అమాయక పిల్లలు ఆ పరిస్థితిని అనుభవిస్తున్నారని అన్నారు.ఒక మహిళ బాధ, కన్నీళ్లు.. ఇంకో స్త్రీకి ఎప్పటికీ గెలుపు కాకూడదని ఉపాసన పేర్కొన్నారు. మహిళలంతా ఒకరికొకరు తోడుగా నిలబడాలని, అందరూ కలిసికట్టుగా ఎదగాలని ఉపాసన పిలుపునిచ్చారు. అందుకు ముందుగా మన మైండ్ సెట్ మారాలన్నారు. తన రీసెర్చ్ ఇదే నేర్పించిందని, ఈ స్టేజ్ మీద ఇలాంటి మహిళల మధ్య ఉన్నందుకు చాలా హ్యాపీగా ఉందన్నారు. స్వార్థంతో ఆలోచించే వ్యక్తులకు తాను దూరంగా ఉంటానని, నిజాయితీగా తోటివారికి సాయం చేసే మంచి మనసున్న స్త్రీలు తన చుట్టూ ఉండేలా చూసుకుంటానని ఉపాసన చెప్పుకొచ్చారు.

తెలుగు రాష్ట్రాల్లో 'జైలర్ 2' ప్రభంజనం..

13 రోజుల్లో వచ్చిన గ్రాస్ ఎంతంటే



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం జోరు బాక్స్ ఆఫీస్ వద్ద ఏ మాత్రం తగ్గలేదు. వర్కింగ్ డేస్ లో కూడా ఈ చిత్రం స్టడీ కలెక్షన్స్ ని నమోదు చేసుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. మొదటి వారం లోనే 600 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రానికి, 13 రోజుల్లో 730 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే 93 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు ఇప్పటి వరకు వచ్చిందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. ఈ వీకెండ్ తో 100 కోట్ల గ్రాస్ మార్కుని దాటేస్తుందట. చాలా మంది తెలుగు స్టార్ హీరోలకు కూడా సాధ్యం అవ్వని ఈ రికార్డు ని రజినీకాంత్ అవలీలగా దాటేయడం ఇప్పుడు ఇండస్ట్రీ లో హాట్ టాపిక్ గా మారింది. ఇక ప్రాంతాల వారీగా ఈ చిత్రానికి వచ్చిన గ్రాస్ వసూళ్లను ఒకసారి పరిశీలిద్దాం.తమిళనాడు ప్రాంతం నుండి ఈ చిత్రానికి 13 రోజుల్లో 185 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చినట్టు చెప్తున్నారు ట్రేడ్ విశ్లేషకులు. జైలర్ చిత్రానికి ఈ ప్రాంతం నుండి ఫుల్ రన్ లో 188 కోట్ల రూపాయిలు వచ్చాయి. ఇప్పుడు ఆ రికార్డు ని 'జైలర్ 2' నేటితో దాటే అవకాశాలు ఉన్నాయి. ఈ వీకెండ్ తో తమిళనాడు రాష్ట్రంలో ప్రతిష్టాత్మక 200 కోట్ల రూపాయిల గ్రాస్ మార్కుని దాటబోతుందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. అదే విధంగా తెలుగు రాష్ట్రాల నుండి 93 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు రాయగా, కర్ణాటక నుండి 81 కోట్లు , కేరళ నుండి 72 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 49 కోట్లు , ఓవర్సీస్ నుండి 252 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు ఈ చిత్రానికి వచ్చినట్టు చెప్తున్నారు ట్రేడ్ విశ్లేషకులు.ఓవరాల్ వరల్డ్ వైడ్ గా 732 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు , 366 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. విడుదలకు ముందు ఈ చిత్రానికి 300 కోట్ల రూపాయిల ప్రీ రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ జరగ్గా, ఇప్పటి వరకు 66 కోట్ల రూపాయిల లాభాలు వచ్చాయి. ఫుల్ రన్ లో ఈ చిత్రం 850 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు రాబట్టే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. నార్త్ ఇండియా లో సరైన విడుదల పడుంటే కచ్చితంగా ఈ చిత్రానికి వెయ్యి కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చేదని , కోలీవుడ్ చిరకాల కోరిక నెరవేరేదని అంటున్నారు.

'ఆ అవమానాన్ని ఎప్పటికీ మోస్తూనే ఉంటాను'..

'పెద్ది' వివాదంపై జాన్వీ కపూర్ షాకింగ్ కామెంట్స్



రామ్ చరణ్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో అచ్చియమ్మ అనే పాత్రలో జాన్వీ కనిపించారు. ఇందులో ఆమె పాత్రను చూపించిన విధానంపై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. మహిళలను కించపర్చేలా ఆమె పాత్రను చిత్రీకరించారని, కొన్ని కెమెరా యాంగిల్స్ లో అసభ్యకరంగా చూపించారంటూ సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొన్నాళ్లపాటు ఇదే హాట్ టాపిక్ గా నడిచింది. ఎట్టకేలకు 'పెద్ది' వివాదంపై జాన్వీ స్పందించారు.కరణ్ జోహార్ హోస్టుగా వ్యవహరిస్తున్న 'కాఫీ విత్ కరణ్ 9' టాక్ షోలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'పెద్ది' వివాదం గురించి కరణ్ జోహార్ ప్రస్తావించారు. "పెద్ది' విషయంలో ఏం జరిగింది? అది నిన్ను చాలా విధాలుగా ప్రభావితం చేసిందని నాకు తెలుసు, ఎందుకంటే అది జరిగిన రోజే నేను నీతో మాట్లాడాను. దీన్ని రెండు విధాలుగా చూడవచ్చు. ఒకటి, ఈ పాత్రలో ఆమెను లైంగిక కోణంలో చిత్రీకరించారనే సానుభూతి చాలా మందిలో కనిపించింది.

మరోవైపు, ఆ సీన్స్ తీస్తున్నప్పుడు ఆమె సెట్‌లో ఉంది కదా. దాన్ని ఎందుకు ఆపలేదు?' అని ప్రశ్నించే వర్గం కూడా ఉంది. ఈ వివాదంపై నీకు ఏమనిపించింది?" అని కరణ్ జోహార్ ప్రశ్నించారు.జాన్వీ కపూర్ స్పందిస్తూ.. సినిమా కోసం ఎంతోమంది కష్టపడ్డారని, అందుకే ఈ విషయం గురించి మాట్లాడటానికి సంకోచించానని చెప్పారు. 'పెద్ది'లో తన పాత్రను చూపించిన తీరు సమాజంపై, ముఖ్యంగా మహిళల పట్ల ఉండే దృక్పథంపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందని జాన్వీ అభిప్రాయపడ్డారు. అయితే, తన పాత్ర విషయంలో జరిగిన దానికి తన వంతు బాధ్యత తీసుకోవాల్సిందేనని, 100 శాతం అది తన పొరపాటేనని స్పష్టం చేశారు. కపూర్ ఫ్యామిలీకి చెందిన వ్యక్తిగా తనకు కొన్ని ప్రత్యేక అవకాశాలు, వెసులుబాట్లు ఉన్నాయని పేర్కొన్న జాన్వీ.. అలాంటి పరిస్థితుల్లో తన అభ్యంతరాలను గట్టిగా వినిపించి ఉండాల్సిందని అన్నారు. తాను మరింత అప్రమత్తంగా ఉండాల్సిందని, కొన్ని విషయాలపై గట్టిగా ప్రశ్నించి ఉండాల్సిందని ఆమె అంగీకరించారు.'పెద్ది' సినిమాలో మహిళా పాత్రను చూపించిన విధానం సమస్యాత్మకంగా ఉందా? అతిగా ఆబ్జెక్టిఫై చేసేలా ఉందా? లైంగిక వేధింపులను సమర్థించే భావన కలిగించిందా? అనే ప్రశ్నలకు జాన్వీ కపూర్ అవుననే సమాధానమిచ్చారు. ఓ మహిళగా తనకు చాలా బాధేసిందని, ఆ తప్పు వల్ల కలిగిన అవమాన భారాన్ని జీవితాంతం మోయక తప్పదని అన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి మళ్లీ ఎదురుకాకుండా చూసుకోవడమే ఇప్పుడు తన ముందున్న లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా దర్శకుడు చెప్పిన విధంగా పనిచేయాలనే ఒత్తిడి నటీనటులపై ఉంటుందని, ప్రొఫెషనల్‌గా ఉండాలనే ఉద్దేశంతో దర్శకుడు చెప్పింది చేశానని చెప్పారు. అలా అని తప్పును ఇతరులపై నెట్టడం తనకు నచ్చదని జాన్వీ అన్నారు.దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రతి సినిమాకు ముందుగానే ఫుల్ బౌండ్ స్క్రిప్ట్ అందుబాటులో ఉండటం చాలా అరుదని, స్క్రిప్ట్‌లో కెమెరా యాంగిల్స్ వంటి వివరాలు కూడా ప్రతిసారీ స్పష్టంగా ఉండవని జాన్వీ కపూర్ చెప్పారు. అయితే, తనకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని మరింత గట్టిగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాల్సిందని ఇప్పుడు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ వివాదం తనకు బాధాకరమైన అనుభవంగా మిగిలిపోయిందని జాన్వీ అన్నారు. తాను బాధితురాలిగా కనిపించాలనుకోవడం లేదని చెబుతూనే, ఆ పరిస్థితి తనను తీవ్రంగా కలచివేసిందని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి ఎదురైతే తన అసౌకర్యాన్ని స్పష్టంగా వ్యక్తం చేస్తానని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చారు.

సమంతకి దరిదాపుల్లో రాలేకపోయిన పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లు




సౌత్ లో ప్రస్తుతం క్రేజ్ పరంగా , స్టార్ డమ్ పరంగా సమంత మించిన హీరోయిన్ మరొకరు లేరు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సాధారణంగా లేడీ సూపర్ స్టార్ అంటే మన అందరికీ టక్కుమని నయనతార , అనుష్క పేర్లు గుర్తుకువస్తాయి. ఎందుకంటే వాళ్ళు లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో ఎన్నో సూపర్ హిట్స్ ని అందుకున్నారు. సమంత కి కూడా సూపర్ హిట్స్ ఉన్నాయి , కానీ మొట్టమొదటిసారి సౌత్ ఇండియా లో లేడీ ఓరియెంటెడ్ చిత్రం ద్వారా వంద కోట్ల గ్రాస్ ని కొల్లగొట్టిన ఘనత సమంత కి మాత్రమే దక్కింది. ఆమె హీరోయిన్ గా నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ఆ రేంజ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది మరి. అయితే సమంత కి ప్రస్తుతం దరిదాపుల్లో ఒక్క సౌత్ హీరోయిన్ గా లేదని రీసెంట్ గా మరోసారి అధికారికంగా తేలింది. ఆ విశేషాలేంటో ఒకసారి క్లుప్తంగా చూద్దాం.ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఆర్మాక్స్' ప్రతీ ఏడాది లాగానే ఈ ఏడాది కూడా అత్యంత ప్రజాధారణ పొందిన హీరోయిన్స్ జాబితా ని విడుదల చేసింది. ఈ జాబితాలో సమంత నెంబర్ 1 స్థానం లో నిలబడగా, నేషనల్ క్రష్ గా పిలవబడే రష్మిక నాల్గవ స్థానంలో నిల్చింది. అదే విధంగా కాజల్ అగర్వాల్ 6 వ స్థానంలో నిలబడగా , 9 వ స్థానం లో త్రిష నిల్చింది. ఇక సాయి పల్లవి , నయనతార ర్యాంకులు అయితే ఇంతకు ముందుతో పోలిస్తే బాగా తగ్గిపోయింది. ఓవరాల్ గా సౌత్ లో సమంత కి పోటీ ఇచ్చే హీరోయిన్స్ ఎవ్వరూ లేరని మరోసారి తేలిపోయింది. ప్రతీ ఏడాది 'ఆర్మాక్స్' విడుదల చేసే జాబితాలో టాప్ లో ఉంటూ వచ్చిన సమంత , ఈ ఏడాది కూడా తన ఆధిపత్యాన్ని కొనసాగించడం విశేషం. సోషల్ మీడియా లో మంచి పాపులారిటీ తో పాటు , రీసెంట్ గానే 'మా ఇంటి బంగారం' సక్సెస్ తో సమంత క్రేజ్ ఎవ్వరూ ఊహించని రేంజ్ కి వెళ్లిందని, అందుకే మరోసారి ఆమె టాప్ లో నిలిచిందని అంటున్నారు.ఇకపోతే ప్రస్తుతం సమంత మెటర్నిటీ లీవ్ లో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఆమె పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న సందర్భంగా ,కొంతకాలం ఆమె షూటింగ్స్ కి దూరం గా ఉండాలని నిర్ణయించుకుంది. ఒకపక్క నిర్మాతగా , మరోపక్క హీరోయిన్ గా వరుస సక్సెస్ లను అందుకుంటూ ముందుకెళ్తున్న సమంత ని మళ్లీ వెండితెర పై చూడాలంటే కొన్నేళ్లు ఆగక తప్పదు. అయితే సోషల్ మీడియా ద్వారా మాత్రం ఆమె నిత్యం అభిమానులతో టచ్ లోనే ఉంటుంది.

శ్రీనిధి శెట్టి - త్రివిక్రమ్ మధ్య అసలు ఏమి జరిగింది



సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అయితే చాలు.. అందులో ఏం జరిగిందో తెలుసుకోకుండానే చాలామంది రకరకాలుగా మాట్లాడుకుంటారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో.. కొన్ని సెకన్ల వీడియోలను మాత్రమే కట్ చేసి పెట్టడం వల్ల అసలు విషయం ఒకటైతే, చూసేవాళ్లకు మరోలా అనిపిస్తుంది. ఇప్పుడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్..హీరోయిన్ శ్రీనిధి శెట్టి మధ్య జరిగిన ఒక చిన్న సంఘటన కూడా ఇలాగే అసలు ఏం జరిగింది అన్న సందేహంతోనే సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతూ ఉంది. అసలు విషయానికి వస్తే..విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన ఆదర్శ కుటుంబం -- హౌస్ నంబర్ 47 సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఈ సంఘటన జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు హీరోయిన్ శ్రీనిధి శెట్టి కూడా హాజరయ్యారు. ఈ సమయంలో శ్రీనిధి త్రివిక్రమ్ దగ్గరకు వెళ్లగా..ఆయన కిందకు వంగడం వీడియోలో కనిపిస్తోంది. అదే సమయంలో శ్రీనిధి కూడా కిందకు వంగి త్రివిక్రమ్ కాళ్లు పట్టుకోవడంతో ఈ వీడియో అందరినీ ఆశ్చర్యపరిస్తోంది. ఈ చిన్న వీడియోను చూసిన కొందరు అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మరికొందరు ఈ సంఘటన గురించి సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. ఒకరకంగా మొదటిసారి ఈ వీడియోని చూస్తే ముందుగా త్రివిక్రమ్ శ్రీనిధి కాళ్లు పట్టుకుంటున్నట్టు ఆ తర్వాత శ్రీనిధి త్రివిక్రమ్ కాళ్లు పట్టుకున్నట్టు అనిపిస్తుంది. కానీ వీడియోని మరోసారి బాగా గమనిస్తే.. త్రివిక్రమ్ కింద ఏదైనా పడిందేమోనని చూస్తున్నట్లు కూడా అనిపిస్తోంది. త్రివిక్రమ్ అక్కడ ఏదో పడితే తీస్తూ ఉండగా అది గమనించిన శ్రీనిధి.. వెంటనే ఆయన కాళ్లు పట్టుకున్నట్లు అర్థమవుతుంది. లేదు అంటే త్రివిక్రమ్ తమాషాకి కూడా ఈ పని చేసి ఉండొచ్చు. ఎందుకంటే అప్పుడు యాంకర్ సుమ అసలు ఏం జరుగుతుంది అక్కడ అని అన్నారు. మొత్తం మైన ఈ వీడియో ఒక కన్ఫ్యూజన్ తోనే ముగిసింది. ఇక్కడే సోషల్ మీడియా వీడియోల అసలు సమస్య కనిపిస్తోంది. ఒక సంఘటన జరిగినప్పుడు దాని ముందు, తర్వాత ఏం జరిగిందో కూడా తెలుసుకోవాలి. కేవలం కొన్ని సెకన్ల వీడియోను చూసి ఒక నిర్ణయానికి రావడం సరైన పద్ధతి కాదు. వీడియోను ఎడిట్ చేసి పెట్టినప్పుడు అసలు సందర్భం తెలియకపోవచ్చు. దీంతో సాధారణంగా జరిగిన సంఘటన కూడా పెద్ద చర్చకు దారితీస్తుంది. ఇక ఈ కార్యక్రమంలో శ్రీనిధి శెట్టి త్రివిక్రమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఆయన దర్శకత్వంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అలాగే వెంకటేష్‌తో కలిసి పనిచేయడం మంచి అనుభవమని, ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు.

'ఇరుముడి' దర్శకుడితో బాలయ్య పవర్ ఫుల్ సినిమా



నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల అఖండ 2 తో అలరించిన ఆయన ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'దాదా' సినిమా చేస్తున్నారు. ఈ మూవీ ఈ ఏడాది డిసెంబర్ 24 న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే బోయపాటి దర్శకత్వంలో అఖండ 3 మూవీ కూడా చేయాల్సి ఉంది. అటు టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలోనూ బాలకృష్ణ ఓ సినిమా చేస్తున్నారు. చీదీఖ112 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీ తెరకెక్కుతోంది. అయితే తాజాగా మరో సినిమాకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల మాస్ మహారాజ రవితేజ నటించిన ఇరుముడి మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు శివ నిర్వాణతో బాలకృష్ణ ఓ సినిమా చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాలు వస్తున్నాయి.మాస్ మహారాజ ఇరుముడి మూవీ ఆగస్టు 21 న థియేటర్లలో విడుదలై ఘన విజయం సాధించింది. ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా రూ.250 కోట్లకుపైగా కలెక్షన్లు సాధించి రవితేజ కెరీర్? లోనే ప్రత్యేకంగా నిలిచింది. వరుస ప్లాప్స్ లో ఉన్న ఆయనకు బిగ్గెస్ట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ గా నిలిచింది. ఈ మూవీలో రవితేజ జోడీగా ప్రియా భవానీ శంకర్ నటించారు. అలాగే కూతురి పాత్రలో బేబీ నక్షత్ర నటించి మెప్పించారు. ఇక మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై దీన్ని రవిశంకర్, నవీన్ ఎర్నేని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఈ మూవీ ఇచ్చిన జోష్ లో శివ నిర్వాణ ఇటీవల మైసూరులో బాలయ్యను కలిసినట్లు సమాచారం.మైసూరులో జరిగిన ఈ భేటీలో బాలకృష్ణకు దర్శకుడు శివ నిర్వాణ ఓ శక్తివంతమైన సబ్జెక్ట్ చెప్పినట్లు తెలుస్తోంది. బాలయ్య బాడీ లాంగ్వేజ్.. మాస్ ఇమేజ్ కు సరిగ్గా సరిపోయేలా ఈ కథను దర్శకుడు సిద్ధం చేసినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఈ స్టోరీకి బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం అందుతోంది. బాలయ్య కు ఇరుముడి లాంటి సినిమా పడితే ఆ బీభత్సం ఎలా ఉంటుందో తెలిసిందే. మరి ఈ క్రేజీ కాంబినేషన్ కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నట్లు సమాచారం.

అంతరిక్షంలో చైనా రహస్య విమానం.. డ్రాగన్ ప్లాన్ ఏంటి?



అంతరిక్షంలో చైనా రహస్యంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలకు సంబంధించి అమెరికా సంచలన చిత్రాన్ని విడుదల చేసింది. చైనాకు చెందిన స్పేస్ ప్లేన్ 'షెన్‌లాంగ్' (శ్రావ్యవఅశ్రీశీఅస్త్ర), కక్ష్యలో మరో గుర్తుతెలియని వ్యోమనౌకతో కలిసి ఉన్న అరుదైన ఫొటోను అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ణxూూ) బయటపెట్టింది. ఈ పరిణామం అంతరిక్షంలో చైనా సామర్థ్యం, దాని లక్ష్యాలపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది.డీఐఏ తన 'ఛాలెంజెస్ టు సెక్యూరిటీ ఇన్ స్పేస్' నివేదికలో ఈ చిత్రాన్ని ప్రచురించింది. 2024 మే నెలలో షెన్‌లాంగ్ తన మూడో మిషన్‌లో ఉన్నప్పుడు, అమెరికాకు చెందిన వాంటోర్/మ్యాక్సార్ కంపెనీకి చెందిన 'వరల్డ్‌వ్యూ-3' శాటిలైట్ సుమారు 90 కిలోమీటర్ల దూరం నుంచి ఈ హై-రిజల్యూషన్ ఫొటోను తీసింది. ఈ ఫొటోలో షెన్‌లాంగ్ రెక్కలు, తెరిచి ఉన్న పేలోడ్ బే, అలాగే దాని వెనుక భాగంలో సోలార్ ప్యానెళ్లతో కూడిన మరో వ్యోమనౌక స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఆ రెండో వ్యోమనౌక ఏంటి, వాటి మధ్య సంబంధం ఏంటనేది రహస్యంగానే ఉంది.అమెరికాకు చెందిన శ-37దీ స్పేస్ ప్లేన్ తరహాలోనే చైనా కూడా ఈ షెన్‌లాంగ్‌ను అభివృద్ధి చేసింది. దీనిని రాకెట్ ద్వారా ప్రయోగించి, కక్ష్యలో కార్యకలాపాలు నిర్వహించి, తిరిగి భూమిపై రన్‌వేపై ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు. ఇప్పటివరకు షెన్‌లాంగ్ నాలుగుసార్లు ప్రయోగాలు జరిపింది. 2026 ఫిబ్రవరిలో నాలుగోసారి ప్రయోగించినప్పుడు, "శాంతియుత పునర్వినియోగ వ్యోమనౌకల సాంకేతిక అభివృద్ధి కోసం" ఈ ప్రయోగం చేపట్టినట్లు చైనా ప్రకటించింది.అయితే, ఈ స్పేస్ ప్లేన్ ద్వారా ఎలాంటి ప్రయోగాలు చేస్తోందో, ఏ పేలోడ్‌లను తీసుకువెళుతోందో చైనా అత్యంత రహస్యంగా ఉంచుతోంది. గతంలో పలుమార్లు షెన్‌లాంగ్ నుంచి కొన్ని వస్తువులు కక్ష్యలోకి విడుదలైనట్లు లియోల్యాబ్స్ వంటి అంతరిక్ష పరిశోధన సంస్థలు గుర్తించాయి. ఈ తాజా ఫొటోతో, కక్ష్యలో ఇతర వ్యోమనౌకలతో అనుసంధానమయ్యే సాంకేతికతను చైనా సాధించిందని స్పష్టమైంది. అమెరికా కూడా తన శ-37దీ స్పేస్ ప్లేన్ కార్యకలాపాలను అత్యంత రహస్యంగా ఉంచుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య అంతరిక్షంలో ఆధిపత్య పోటీ మరింత తీవ్రమవుతోందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

అమెరికా ద్వంద్వ విధానం: ఓవైపు ఇరాన్‌పై యుద్ధం.. ఇదే సమయంలో పాకిస్థాన్ అణ్వాయుధ తయారీకి సాయం



పాకిస్థాన్ వద్ద ఉన్న వ్యూహాత్మక అణు ఆయుధ సంపత్తిలో అమెరికా సరఫరా చేసిన ఎఫ్-16 ఫైటర్ జెట్‌లు కూడా భాగమేనని వాషింగ్టన్ నిఘా సంస్థలు చాలా కాలంగా అంగీకరిస్తున్నాయి. చిన్నతరహా అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లేలా కొన్ని ఎఫ్-16 విమానాలను పాకిస్థాన్ మార్పుకుందని భావిస్తున్నారు. అయితే, ఇదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించే నెపంతో డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఆ దేశంపై యుద్ధం చేస్తుండగా... అదే సమయంలో ప్రధానంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న పాకిస్థాన్ ఖీ-16 విమానాల వ్యవస్థను వాషింగ్టన్ ఆధునీకరిస్తూ నాణ్యతను పెంచుతోంది.పాకిస్థాన్‌కు ఎఫ్-16 విమానాల ఆధునీకరణకు 686 మిలియన్ డాలర్ల ప్యాకేజీ కింద అమెరికా ఆ జెట్‌ల ఏవియానిక్స్, ఆపరేషనల్ ఫ్లైట్ ప్రోగ్రామ్ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్-వార్‌ఫేర్ సిస్టమ్స్, క్రిప్టోగ్రాఫిక్ హార్డ్‌వేర్‌లను ఆధునీకరిస్తోంది. అంతేకాకుండా, గగనతలం, ఉపరితల ఆయుధ సామాగ్రి మధ్య రియల్-టైమ్, జామింగ్-రహిత సమాచార మార్పిడి, నెట్‌వర్క్-సెంట్రిక్ సామర్థ్యాలను పెంచడానికి వ్యూహాత్మక డేటా-లింక్ సిస్టమ్‌లను అమర్చుతోంది. ఈ అప్‌గ్రేడ్‌ల వల్ల ఈ యుద్ధ విమానాల కాలపరిమితి 2040 వరకు పెరుగుతుంది.ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేస్తోందనే నెపంతో ఒకవైపు యుద్ధం చేస్తోన్న వాషింగ్టన్.. మరోవైపు తన ఆయుధాగారాన్ని విస్తరిస్తూ ఆధునీకరిస్తున్న పాకిస్థాన్‌కు మాత్రం పూర్తి మినహాయింపునిస్తోంది. పాకిస్థాన్ గత 22 ఏళ్లకుపైగా అమెరికా 'మేజర్ నాన్-నాటో మిత్రదేశం' హోదాను నిలబెట్టుకుంటూనే ఉంది. ఉగ్రవాద నిరోధక చర్యల్లో, భవిష్యత్ కార్యాచరణల్లో తమ భాగస్వామ్య బలగాలతో పాకిస్థాన్ పరస్పర సమన్వయం చేసుకోవడానికి ఈ ప్యాకేజీ ఉపయోగపడుతుందని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ పేర్కొంది.గతేడాది డిసెంబరులో అమెరికా కాంగ్రెస్ పాకిస్థాన్‌కు ఆధునీకరణ ప్యాకేజీని ఆమోదించిన విషయం తెలిసిందే. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆసియా రక్షణ మంత్రుల సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా మంత్రి పీట్ హెగ్సెత్‌తో జరిగిన భేటీలో గట్టిగా హెచ్చరించారు. పాకిస్థాన్‌కు సున్నితమైన సాంకేతికతను బదిలీ చేయడం వల్ల మూడో పక్షానికి ఆయుధ రహస్యాలు, సాంకేతికత చేరే ప్రమాదం ఉందనే తీవ్ర ఆందోళనను రాజ్‌నాథ్ సింగ్ వ్యక్తం చేశారు.

నెతన్యాహు ప్లాన్-బీ అమల్లోకి..విపక్ష నేతతో కలిసి ప్రభుత్వం? ఆఫర్స్ ఇవే...



ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్ కు తాజాగా జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ రాలేదు. 120 సీట్లున్న పార్లమెంట్ లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ మార్క్ 61 కాగా.. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పార్టీ లికుడ్ కు 53 సీట్లు, విపక్ష నేత గాడీ ఐసెన్ కోట్ కు చెందిన యాషర్ పార్టీకి 48 సీట్లు రాబోతున్నాయి. వీరిద్దరు కాకుండా అరబ్ పార్టీలకు 19 సీట్లు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ప్రధాన పార్టీలకు అరబ్ పార్టీల మద్దతు తప్పనిసరిగా మారింది.అయితే ఇన్నాళ్లూ తాము యూదు వ్యతిరేకులుగా ముద్ర వేసిన అదే అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ప్రజల్లోకి వ్యతిరేకత వస్తుందన్న భయం ఇరు పార్టీలను వెంటాడుతోంది. అయితే ప్రధాని నెతన్యాహుతో పోలిస్తే విపక్ష నేత గాడీ ఐసెన్ కోట్ అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు ఆయన కొన్ని షరతులు పెడుతున్నారు. ఇది గ్రహించిన నెతన్యాహు.. అరబ్ పార్టీల మద్దతు ఎలాగో తీసుకోరు కాబట్టి ప్లాన్ బీ అమలుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఏకంగా ప్రతిపక్ష నేతకే గాలం వేస్తున్నారు.విపక్ష నేత, మాజీ ఆర్మీ చీఫ్ కూడా అయిన గాడీ ఐసెన్ కోట్ తో కలిసి ప్రభుత్వ ఏర్పాటు చేయాలని నెతన్యాహు వర్గం భావిస్తోంది. ఇందుకోసం ఆయన వద్దకు రాయబారాలు పంపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం రెండు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో నెతన్యాహు ప్రధానిగా ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఐసెన్ కోట్ కు కీలక మంత్రిత్వ శాఖల్ని అప్పగించడం లేదా, నెతన్యాహు-ఐసెన్ కోట్ ఇద్దరూ తలో సగం పదవీకాలం ప్రధానులుగా ఉండేలా ఒప్పందం చేసుకోవడం ఉన్నాయి. అయితే నెతన్యాహు కింద తాను పనిచేసేది లేదని ఐసెన్ కోట్ ఇప్పటికే తేల్చిచెప్పేశారు. అయినా నెతన్యాహు వర్గంలో మాత్రం ఆశ చావడం లేదు. దీంతో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

హసీనా దేశం వీడిన వీడియో వెనుక ఏం జరిగింది?

మాజీ సైనికాధికారి అనుమానాస్పద మృతితో కొత్త ప్రశ్నలు

బంగ్లాదేశ్‌లో సంచలనం రేపిన ఘటన వెలుగులోకి వచ్చింది. మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచిపోతున్న వీడియోతో సంబంధం ఉందని ప్రచారంలోకి వచ్చిన మాజీ మైమానిక దళ అధికారి కేఎం తహసీఫ్ సొరీ (28) నదిలో శవమై కనిపించాడు. ఢాకాలోని తురాగ్ నదిలో బుధవారం అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అంతకుముందు రోజు అతడు కనిపించకుండా పోయాడు. ఈ మరణం వెనుక అనుమానాలున్నాయని అతడి బంధువులు ఆరోపించడంతో ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, అతడిది హత్యా? ప్రమాదవశాత్తూ మునిగిపోయాడా? అన్నది ఇంకా తేలలేదు.

హసీనా దేశం విడిచిన వీడియోతో సంబంధం ఏంటి?

2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి దేశం విడిచివెళ్లారు. ఆమె సైనిక విమానంలో బయలుదేరిన దృశ్యాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ఆ వీడియోను చిత్రీకరించిన వ్యక్తిగా తహసీఫ్ పేరు తెరపైకి వచ్చింది. అయితే, అతడే వీడియో తీశాడా? లేక వేరొకరు చిత్రీకరించిన దాన్ని మాత్రమే షేర్ చేశాడా? అనే విషయంలో అధికారిక నిర్ధారణ లేదు.

'నా సోదరుడిని చంపేశారు'.. బంధువు సంచలన ఆరోపణలు

తహసీఫ్ మరణంపై అతడి బంధువు మోష్కెకా జహాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. హసీనా దేశం విడిచిన వీడియోను షేర్ చేసిన కారణంగా తహసీఫ్ వేధింపులకు గురయ్యాడని, చివరకు అతడిని హత్య చేశారని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వీడియోను అతడు స్వయంగా చిత్రీకరించలేదని, మరో అధికారి తీసిన దాన్ని పొరుడిగా షేర్ చేశాడని ఆమె పేర్కొన్నారు.మైమానిక దళం నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత కూడా అతడిని నిఘా అధికారులు అనుసరిస్తున్నారని, మానసిక వేధింపులు కొనసాగాయని ఆమె పేర్కొన్నారు.

నదిలో ఎలా కనిపించాడు?

పోలీసుల సమాచారం ప్రకారం.. తహసీఫ్ మృతదేహం ఢాకాలోని ఉత్తరఖాన్ ప్రాంతం సమీపంలో తురాగ్ నదిలో లభించింది. అతడి జేబులో ఉన్న ఐఫోన్ ఆధారంగా గుర్తింపును నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం



కోసం ఢాకాలోని షహీద్ సుహ్రావర్ది మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.ప్రాథమిక పరిశీలనలో శరీరంపై బయటకు కనిపించే గాయాలు లేవని పోలీసులు తెలిపారు. తొలుత నీటిలో మునిగిపోవడం మరణానికి కారణమై ఉండవచ్చని అనుమానించినప్పటికీ, అసలు కారణం పోస్టుమార్టం నివేదిక తర్వాతే తెలుస్తుందని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ కూడా విచారణ, పోస్టుమార్టం వివరాలు వచ్చిన తర్వాతే ఈ ఘటనపై మాట్లాడతామని తెలిపారు.

వైమానిక దళం నుంచి ఎందుకు వైదొలిగాడు?

తహసీఫ్ వైమానిక దళం నుంచి పదవీ విరమణ చేసిన అంశం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హసీనా దేశం విడిచిన వీడియో వివాదంతో అతడి వైదొలగడానికి సంబంధం ఉందంటూ గతంలో ప్రచారం జరిగింది. అయితే, బంగ్లాదేశ్ సైనిక ప్రజాసంబంధాల విభాగం గతంలో విడుదల చేసిన ప్రకటనలో అతడి పదవీ విరమణ నిబంధనల ప్రకారం జరిగిందని, ఇతర ఆరోపణలతో సంబంధం లేదని పేర్కొంది.ప్రస్తుతం తహసీఫ్ మరణానికి గల కారణం, ఇందులో ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఆరోపణలు నిజమా కాదా అన్నది దర్యాప్తులో తేలాల్సిందే. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల తదుపరి విచారణ ఈ కేసులో కీలకం కానున్నాయి.

ఉక్రెయిన్ రైల్వే స్టేషన్‌పై డ్రోన్‌లతో దాడికి పాల్పడిన రష్యా.. కనీసం 13 మంది మృతి



ఉక్రెయిన్‌లోని ఓ రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్నిప్రో రైల్వే స్టేషన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో కనీసం 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు గురువారం వెల్లడించారు. ప్లాట్‌ఫారమ్‌పై రైలు నిలిచి ఉన్న సమయంలో ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. డ్నిప్రో నుంచి జపోరిజియా వెళ్లాల్సిన ప్యాసింజర్ ఎలక్ట్రిక్ రైలు ప్లాట్‌ఫారమ్‌పై వేచి ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, అప్పటికే ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగింది. దాడిలో 13 మంది అక్కడిక్కడే మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే మెడికల్ టీమ్‌లు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.డ్నిప్రో స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడికి సంబంధించి ఉక్రెయిన్ రైల్వేస్ తమ టెలిగ్రామ్ ఖాతాలో కీలక వివరాలను వెల్లడించింది. జెట్ ఆధారిత డ్రోన్ తో రష్యా ఈ దాడికి పాల్పడిందని పేర్కొంది. "డ్నిప్రో నుంచి జపోరిజియా వెళ్లాల్సిన రైలు నంబర్ 866 ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న సమయంలో రష్యా ఈ డ్రోన్ దాడి జరిపింది... తీవ్ర ముప్పు ఉంది అని ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, అప్పటికే ప్లాట్‌ఫారమ్‌పై ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు" అని వెల్లడించింది.ఈ భయానక దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిలో 13 మంది మరణించారని, మరొక 10 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆయన తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన ఆయన.. రష్యాపై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు."కొందరు రష్యన్ ఒలిగార్చ్‌లు (శ్రీమంత వ్యాపారులు), ఇంధన రంగంపై విధించిన ఆంక్షలను సడలించినప్పటి నుంచి మాస్కో ఈ తరహా తీవ్రవాద దాడులను మరింత పెంచింది" అని జెలెన్స్కీ మండిపడ్డారు. రష్యా తన యుద్ధాన్ని కొనసాగిస్తున్నంత కాలం ఆంక్షలను తగ్గించకూడదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ , జీ 7 దేశాలు రష్యా, దాని యుద్ధ యంత్రాంగంపై మరింత కఠినమైన నూతన ఆంక్షలను విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరోలోకి షెంగ్‌మిన్



చైనా కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు గురువారం కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ సైన్యాన్ని పర్యవేక్షించే కేంద్ర సైనిక కమిషన్‌లో మిగిలిన ఏకైక జనరల్ జాంగ్ షెంగ్‌మిన్‌కు పొలిట్‌బ్యూరోలో చోటు కల్పించారు. కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత నిర్ణయాలు తీసుకునే నాయకత్వ విభాగమే పొలిట్‌బ్యూరో.పార్టీలో క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, అవినీతి నిరోధక చర్యలను మరింత బలోపేతం చేసే తీర్మానాన్ని కూడా నేతలు ఆమోదించారు. అధికారంపై పట్టును మరింత కాలం కొనసాగించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.నాలుగు రోజుల పాటు రహస్యంగా సాగిన సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు రాబోయే సంవత్సరాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. పలు తీర్మానాలను ఆమోదించారు. పార్టీ అధినేతగా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మరో ఐదేళ్ల పదవీకాలం పొందుతారని విస్తృతంగా అంచనాలు వెలువడుతున్నాయి. ఈ సమావేశం ఆయన నాలుగోసారి ఐదేళ్ల పదవీకాలం చేపట్టడానికి సుమారు ఏడాది ముందు జరిగింది.

సైనిక కమిషన్‌లో ప్రక్షాళన...

కేంద్ర సైనిక కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేస్తున్న జనరల్ జాంగ్ షెంగ్‌మిన్‌ను పార్టీ పొలిట్‌బ్యూరోలోకి ఎన్నుకుంది. చైనా అగ్రశ్రేణి సైనికాధికారుల్లో ఇద్దరిని షీ జిన్‌పింగ్ గతంలో పదవుల నుంచి తొలగించారు. దీంతో షీ జిన్‌పింగ్ మినహా కమిషన్‌లో మిగిలిన ఏకైక సభ్యుడిగా జాంగ్ నిలిచారు. జాంగ్‌కు ఈ పదవి దక్కే వరకు పొలిట్‌బ్యూరోలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది.సైన్యంలో అంతర్గత క్రమశిక్షణను పర్యవేక్షించే బాధ్యత కూడా జాంగ్‌కు ఉంది. కేంద్ర సైనిక కమిషన్ క్రమశిక్షణ తనిఖీ విభాగం డిప్యూటీ కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారు.పార్టీ విడుదల చేసిన తీర్మాన సారాంశంలో తమ ముందున్న బాధ్యతలు నానాటికీ కఠినంగా మారుతున్నాయని పేర్కొంది. జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి నడిపించాల్సిన అవసరం ఉందని తెలిపింది.అవినీతిని నిర్మూలించడం, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతను కాపాడటం ద్వారా స్వీయ నియంత్రణను మరింత పెంచుకోవాలని నిర్ణయించింది. దీర్ఘకాలం పాలనను కొనసాగించే సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు పార్టీ పురోగామి స్వభావాన్ని, నిబద్ధతను కాపాడుకోవాలని తీర్మానించింది. ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించాలని పేర్కొంది. ఈ వివరాలను అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది.

అవినీతి నిరోధక చర్యలు ...

2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి షీ జిన్‌పింగ్ అవినీతి నిరోధక చర్యలకు ప్రాధాన్యమిస్తున్నారు. దశాబ్దానికి పైగా అధికారులపై చర్యలు కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం పనితీరు సరిగా లేని అధికారులపైనా దృష్టి సారిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు."అవినీతి నిరోధక చర్యలను ఇకపై తాత్కాలిక ప్రచార కార్యక్రమంగా చూడకూడదు. అవి నిరంతరం కొనసాగుతాయి" అని యూరేషియా గ్రూప్ సీనియర్ విశ్లేషకుడు మింగ్‌డా క్యూ వ్యాఖ్యానించారు.పార్టీలో అవినీతి, క్రమశిక్షణ ఉల్లంఘనలు అత్యంత తీవ్రమైన సవాళ్లుగా షీ జిన్‌పింగ్ భావిస్తున్నారని గురువారం వెలువడిన ప్రకటన స్పష్టం చేస్తోందని ఆయన తెలిపారు. వీటిని అరికట్టేందుకు మరిన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, గతంలో పార్టీ అగ్రనేతలు, సైనికాధికారులపై తీసుకున్న చర్యలను కూడా సమావేశంలో సమీక్షించారు. పదవుల నుంచి తొలగింపులు, ఇతర మార్పులను సమర్థించారు.చైనాలో ఊహించిన దానికంటే ఎక్కువ మంది అగ్రనేతలు పదవులు కోల్పోయారని ఆసియా సొసైటీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫెలో నీల్ థామస్ తన విశ్లేషణలో పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య 74 శాతమేనని ఆయన లెక్కించారు. మాజీ నేత మావో జెడాంగ్ హయాం తర్వాత ఇదే అత్యల్ప హాజరు శాతమని తెలిపారు. మావో పాలనలో తరుచూ రాజకీయ ప్రక్షాళనలు జరిగేవి.

విశాఖలో వైసీపీ మేయర్ అభ్యర్థికి జనసేన నేత మద్దతు..!



ఏపీలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార కూటమిలో భాగస్వామ్య పక్షమైన జనసేన పార్టీకి కూటమి ధర్మం ప్రకారం 30 శాతం సీట్లు ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారంటూ ఇప్పటికే మండిపడుతున్న ఆ పార్టీ నేతలు.. పలు చోట్ల రెబెల్స్ గా బరిలోకి దిగుతున్నారు. అయితే విశాఖలో ఇప్పుడు మరో అడుగు ముందుకేసి కూటమి మేయర్ అభ్యర్థిని కాదని, వైసీపీ నిలబెట్టిన మేయర్ అభ్యర్థికి జనసేన సీనియర్ నేత ఒకరు మద్దతు ప్రకటించి సంచలనం రేపారు. విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ గా కూటమి తరపున టీడీపీ నేత ముక్కా శ్రావణికి టికెట్ ఇచ్చారు. ఆమెను కూటమి పార్టీలన్నీ కలిసి గెలిపించాలని చంద్రబాబు టార్గెట్ కూడా ఇచ్చారు. అయితే నగరంలోని కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ సీట్ల పంపకాల్లో మాత్రం జనసేనకు పలు చోట్ల మొండి చేయి చూపారు. దీనిపై ఆగ్రహంగా ఉన్న పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ ఇవాళ ఎక్స్ లో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఇందులో తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. పొత్తు ధర్మాన్ని పాటించిన ప్రతిసారీ కూటమి నిలబెట్టిన అభ్యర్థుల గెలుపు కోసం మనమంతా నిబద్ధతతో కృషి చేద్దామని జనసేన కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఎక్కడైతే జనసేన పార్టీకి 30% వాటా దక్కలేదో, అక్కడ ఆ మేరకు జనసైనికులు, వీర మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేద్దామన్నారు. విశాఖపట్నం విషయంలో తన వైఖరి ప్రత్యేకమని తెలిపారు. విశాఖ పర్యావరణాన్ని పరిరక్షిస్తాను, సింహాచలం కొండలను కాపాడతాను, సహజ వనరులను రక్షిస్తాను, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి కృషి చేస్తానని బహిరంగంగా ప్రకటించిన మహిళా కార్పొరేటర్ అభ్యర్థి వరుదు కళ్యాణి గారికి తన మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆమె వైసీపీ అభ్యర్థి అయినప్పటికీ, పార్టీలకు అతీతంగా ప్రాంత ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం తన బాధ్యతగా భావిస్తున్నానని బొలిశెట్టి తెలిపారు. కూటమి ధర్మాన్ని గౌరవిస్తూనే, విశాఖ ప్రయోజనాల విషయంలో రాజీ పడలేనన్నారు. విశాఖ పర్యావరణం, సింహాచలం కొండలు, సహజ వనరులు, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఆమె చేసిన హామీలను పరిగణనలోకి తీసుకుని, విశాఖ మేయర్ ఎంపికపై ప్రాంత ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని వినమ్రంగా కోరుతున్నట్లు బొలిశెట్టి పేర్కొన్నారు.

తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. సులువుగా దర్శనం



తిరుమలలో ఒక మోస్తారుగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. శుక్రవారమయినా భక్తుల రద్దీ తక్కువగా ఉంది. అర్ణబ్ తుపాను ప్రభావంతో తిరుమలకు భక్తుల సంఖ్య తగ్గిందని అధికారులు తెలిపారు. అర్ణబ్ తుపాను ప్రభావంతో రోడ్డు మార్గం, రైలు మార్గంలో కొంత ఇబ్బందులు ఏర్పడుతుండటంతో తాము ముందస్తుగా తిరుమలకు ప్రయాణాన్ని ఖరారు చేసుకున్న వారు స్వయితం రద్దు చేసుకున్నారు. దీంతో తిరుమలలో నేడు భక్తుల రద్దీ తక్కువగా ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

శుక్రవారం వచ్చి...

తిరుమలకు వచ్చే భక్తులు శుక్రవారం నాడు వచ్చి శనివారం కూడా కొండపైనే ఉండి స్వామి వారిని దర్శించుకుని వెళతారు. శనివారం కొండమీద ఉంటే శుభప్రదమని నమ్మకం. అందుకే శుక్రవారం నుంచి భక్తుల రద్దీ ప్రతి వారం కొనసాగుతూనే 'ఉంటుంది. అయితే గత కొన్ని రోజుల నుంచి అర్ణబ్ తుపాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు భయపెడుతుండటంతో ప్రయాణాలను రద్దు చేసుకుని మరీ ఉన్నారని, అందుకే కొండ మీద రద్దీ తక్కువగా ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆరు గంటల సమయం....

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని పన్నెండు కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఆరుగంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్ర దర్శనం టోకెన్లున్న భక్తులకు రెండు గంటల సమయం పడుతుంది. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 62,811గా ఉంది. శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తులు 19,499 గా ఉందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.20 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 3.88 లక్షలు జరిగాయి. తిరుమలలో అన్న ప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 1.63 లక్షలుగా ఉంది.

ఐఫోన్ దొంగలను వెంటాడి పట్టుకున్న యువతి.. ఢిల్లీలో సినీ ఫక్కీలో ఛేజింగ్



ఢిల్లీకి చెందిన ఓ యువతి అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించింది. తన ఐఫోన్ లాక్కెళ్లిన దొంగలను స్కూటీపై వెంబడించి, కిందపడేసి మరీ పోలీసులకు పట్టించింది. బుధవారం సాయంత్రం ఢిల్లీలోని షాలిమార్ బాగ్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం ఖుషీ మహేశ్వరి (24) బుధవారం రాత్రి 8:30 గంటల సమయంలో కథక్ క్లాస్ ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తోంది. షాలిమార్ బాగ్ మెట్రో స్టేషన్ గేట్ నం.1 వద్దకు రాగానే, వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె చేతిలోని ఐఫోన్ 16 ప్రోను లాక్కుని వేగంగా పారిపోయారు. ఈ హఠాత్పరిణామంతో ఖుషీ బ్యాలెన్స్ కోల్పోయి కిందపడింది. స్వల్ప గాయాలైనా ఏమాత్రం వెరవకుండా, వెంటనే తేరుకుని "దొంగ దొంగ" అని గట్టిగా అరుస్తూ తన స్కూటీపై వారిని వెంబడించడం మొదలుపెట్టింది.సుమారు అర కిలోమీటరు ఛేజింగ్ తర్వాత, ముకుంద్‌పూర్ మైపు వెళ్లే రింగ్ రోడ్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో దొంగల బైక్ వేగం తగ్గింది. ఇదే అదనుగా ఖుషీ వారిని అడ్డగించే ప్రయత్నం చేయగా, నిందితుల్లో ఒకరు ఆమె స్కూటీని తోసేందుకు చూశాడు. అయినప్పటికీ ఆమె వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో ఖుషీ స్కూటీ, దొంగల బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ఒక దొంగను పట్టుకున్నారు. రెండో నిందితుడు ఆజాద్‌పూర్ ఫ్లైఓవర్‌పై నుంచి దూకి పారిపోయేందుకు యత్నించగా, అక్కడే విధుల్లో ఉన్న ఓ పోలీసు అధికారి అతడిని పట్టుకున్నాడు.నిందితులను భల్స్వా డైరీకి చెందిన సమీర్ అలియాస్ కచ్రా (19), మోహిత్ అలియాస్ మోహితా (19)గా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి ఖుషీ ఐఫోన్‌తో పాటు మరో మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండు ఫోన్లు గతంలో నమోదైన దొంగతనం కేసులకు సంబంధించినవని తేలింది. నిందితుల్లో ఒకరిపై గతంలోనూ స్నాచింగ్ కేసులు ఉన్నాయని నార్త్-వెస్ట్ డీసీపీ ఆకాంక్ష యాదవ్ తెలిపారు. ఖుషీ మహేశ్వరి చూపిన ధైర్యాన్ని ఆమె అభినందించారు.

కూటమి రెబల్స్ సవాల్ - అగ్రనేతలు చెప్పినా, సీమ..గోదావరిలో కొత్త లెక్కలు..!!



స్థానిక ఎన్నికల్లో రెబల్స్ కూటమి పార్టీలకు సవాల్ గా మారుతున్నారు. పార్టీల అగ్రనేతలు చెప్పినా పలు ప్రాంతాల్లో వెనక్కు తగ్గటం లేదు. తమ లక్ష్యం పరీక్షించుకునేందుకు పోటీలో కొనసాగటం ఇప్పుడు కూటమి సమన్వయానికి సమస్యగా మారుతోంది. రాయలసీమతో పాటుగా గోదావరి జిల్లా ల్లో రెబల్స్ బెడద ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో.. పార్టీల ముఖ్య నేతలు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి కారణంగా ఎంత మేర నష్టం ఉంటుందనేది రాజకీయంగా ఉత్కంఠ మొదలైంది. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కు కౌంట్ డౌన్ మొదలైంది. జెడ్పీటీసీ.. ఎంపీటీసీ ఎన్నికల తేదీల ను రీషెడ్యూల్ చేసారు. కాగా.. పెద్ద సంఖ్యలో జెడ్పీటీసీ.. ఎంపీటీసీల్లో కూటమి పార్టీల నుంచి పెద్ద సంఖ్య లో రెబల్స్ పోటీ లో నిలిచారు. వీరిని బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కావటం లేదు. పార్టీల అగ్రనేతలు చెప్పినా వీరు వెనక్కు తగ్గటం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు గా 26 జెడ్పీటీసీలు.. 170 ఎంపీటీసీల్లో రెబల్స్ బరిలో ఉన్నట్లు గుర్తించారు. ఇవి రాయలసీమతో పాటుగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. కూటమి అధికారంలో ఉండడంతో ఈ సారి పోటీ చేస్తే ఖచ్చితంగా గెలుస్తామని ధీమాతో మూడు పార్టీల నుంచి ఆశావాహులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసారు. చివరకు తమకే బీ ఫామ్ దక్కుతుందనే నమ్మకంతో చివరి వరకు వ్యవహరించారు. అయితే... సీట్ల సర్దుబాటులో భాగంగా వారికి అవకాశం దక్కలేదు. దీంతో, ఇప్పటి కే నామినేషన్లు దాఖలు చేసి ఉండటంతో వారు పోటీలో కొనసాగుతున్నారు.

రంగంలోకి ముఖ్య నేతలు

జెడ్పీటీసీ.. ఎంపీటీసీ ఎన్నికలను ఎన్నికల సంఘం రీ షెడ్యూల్ చేసింది. అయితే, రాష్ట్రవ్యాప్ తంగా 959 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 582 స్థానాల్లో 26 చోట్ల కూటమి రెబల్స్ బరిలో ఉన్నారు. 7853 ఎంపీటీసీ స్థానాలకు గాను 171 స్థానాల్లో రెబల్స్ బరిలో ఉన్నారు. ప్రధానంగా రాయలసీమలో 12 జడ్పీటీసీ, 64 ఎంపీటీసీ స్థానాలకు తిరుగుబాటు అభ్యర్థులు బరిలో ఉన్నారు. నంద్యాల జిల్లా లో ఆళ్లగడ్డ, సిరివెళ్ల, పాములపాడు, గోస్పాడు, గడివేముల జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ, జనసేన రెబల్స్ బరిలో ఉన్నారు. అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 31 ఎంపీటీసీల్లో రెబల్స్ బరిలో ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 6 జడ్పీటీసీ స్థానాలకు, 3 ఎంపీటీసీలకు రెబల్స్ బరిలో కొనసాగుతున్నారు. ఇక.. గోదావరి జిల్లాల్లో అయిదు జడ్పీటీసీలకు, 77 ఎంపీటీసీ స్థానాలకు రెబల్స్ బరిలో ఉండటంతో ముఖ్య నేతలు రంగంలోకి దిగుతున్నారు. పార్టీ అభ్యర్థులకే ఓట్లు వేయాలని కోరుతున్నారు. దీంతో.. వీరి కారణంగా ఫలితం పైన ఎలాంటి ప్రభావం ఉంటుందనే ఉత్కంఠ మొదలైంది.

ఓటుకు రూ.3 వేలు..బొత్స వర్సెస్ కిమిడి పోరు, ఓటర్లకు గరిష్ట ధర!



విజయనగరం జిల్లా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలు రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలోని గరివిడి మండల జడ్పీటీసీ స్థానానికి సీనియర్ నేతలు కిమిడి కళావెంకటరావు, బొత్స సత్యనారాయణ కోడళ్ల పోటీ పడుతున్నారు. దీంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక ఇరువురు నేతలకు ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. కళావెంకటరావు ప్రస్తుతం చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉండగా, బొత్స ఇదే నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పనిచేశారు.గత ఎన్నికల్లో బొత్సను ఓడించిన కళావెంకటరావు చీపురుపల్లిని సుస్థిరం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో కోడలిని జడ్పీటీసీగా బరిలో దింపి జడ్పీ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో బొత్స కూడా గత ఎన్నికల్లో ఎదురైన పరాభవానికి సమాధానంగా నియోజకవర్గంలోని నాలుగు స్థానాలు గెలుచుకునే లక్ష్యంతో పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరువురు నేతలు వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకుని విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు.చీపురుపల్లి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలు ఉండగా, ఇందులో రెండు చోట్ల బొత్స కుటుంబం నుంచి కోడలు పూజిత (గరివిడి), చెల్లెలు వెంకటలక్ష్మి (గుర్ల) పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరిలో బొత్స కోడలు పూజిత గెలుపు ఆయనకు వ్యక్తిగతంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిట్టింగ్ ఎమ్మెల్యే కళావెంకటరావు కోడలు సంధ్య పోటీ ఉండటమే అంటున్నారు. గరివిడి మండలం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా చెబుతున్నారు. అయితే ఇక్కడ బొత్స వ్యక్తిగత ఇమేజ్ కూడా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని అంటున్నారు. గత ఎన్నికల్లో బొత్సపై గెలిచిన ఎమ్మెల్యే కళావెంకటరావు తన గెలుపు గాలివాటం కాదని నిరూపించుకోవాలని భావిస్తున్నారని చెబుతున్నారు. తన సొంత నియోజకవర్గమైన రాజాం ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉండటం వల్ల తన కుటుంబ రాజకీయ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం అన్న ఆలోచనలో కళా ఉన్నారని అంటున్నారు. ఇక బొత్స కూడా ఇంచుమించు ఇదే ఆలోచనతో స్థానిక ఎన్నికలపై గట్టిగా ఫోకస్ చేశారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో అనూహ్య ఓటమితో డీలా పడిన బొత్స.. ఈ ఎన్నికల ద్వారా తిరిగి పుంజుకోవాలని, చీపురుపల్లి తన కంచుకోటగా నిరూపించుకోవాలని తాపత్రయ పడుతున్నారని చెబుతున్నారు. దీంతో ఇద్దరు సీనియర్ నేతలు ఎత్తుకుపైఎత్తులు వేస్తుండటంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. ఇరువురు నేతలు గెలుపు కోసం ఎంతవరకు అయినా వెళ్లేలా కనిపిస్తుండటంతో ఓటర్లకు మంచి కానుకలు అందుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రచారం ప్రకారం ఒక్కో ఓటుకు మూడు వేల రూపాయలు అయినా చెల్లించేందుకు ఆయా పార్టీలు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామాలకు గ్రామాలను కొనేసి ఎన్నికను ఏకపక్షం చేసుకోవాలనే ఆలోచనతో నాయకులు ఉన్నారని అంటున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఎన్నడూ లేనట్లు ప్రస్తుతం ఓటుకు గరిష్ట రేటు పలుకుతోందని చెబుతున్నారు.

ఉత్తర కొరియా క్షిపణుల ప్రయోగం



సియోల్ : ఉత్తర కొరియా గురువారం తూర్పు సముద్ర జలాల వైపు వరుసగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది. సరిహద్దుల్లో మళ్లీ ప్రచార లౌడ్‌స్పీకర్ ప్రసారాలు ప్రారంభిస్తామని, కొత్త ఆయుధాలను మోహరిస్తామని ఉత్తర కొరియా హెచ్చరించిన కొద్ది రోజులకే ఈ ప్రయోగాలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ వారాంతంలో చైనాలో ఆకస్మికంగా పర్యటించిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర కొరియాకు చైనా ప్రధాన మిత్రదేశం. ఆర్థికంగా కూడా చైనాపైనే ఆ దేశం ఎక్కువగా ఆధారపడుతోంది. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవడమే లక్ష్యంగా కిమ్ ఈ పర్యటన చేపట్టారు.దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తర కొరియాలోని తూర్పు తీర పట్టణం వోన్సాన్ నుంచి సుమారు 10 స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఒక్కో క్షిపణి సుమారు 250 కిలోమీటర్లు (155 మైళ్లు) ప్రయాణించింది. ఉత్తర కొరియా నుంచి ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా తిప్పికొట్టేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని దక్షిణ కొరియా తెలిపింది. అమెరికాతో సమన్వయం చేసుకుంటున్నట్లు వెల్లడించింది. ఉత్తర కొరియా క్షిపణిని ప్రయోగించినట్లు అనుమానిస్తున్నామని జపాన్ రక్షణ శాఖ కూడా ప్రకటించింది

మందుపాతరల పేలుళ్లతో...

గత నెలలో ఇరు దేశాల సరిహద్దుల్లో మందుపాతరలు పేలడంతో ముగ్గురు దక్షిణ కొరియా సైనికులు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. సైనిక విభజన రేఖకు దక్షిణంగా ఉత్తర కొరియా మందుపాతరలు అమర్చిందని సియోల్ ఆరోపించింది. ఈ ఘటనపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. అయితే పేలుళ్లకు తమకు ఎలాంటి సంబంధం లేదని ప్యాంగ్యాంగ్ ఖండించింది. తమను రెచ్చగొడితే ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు ప్రాంతాల్లో పదేపదే హెచ్చరిక కాల్పులు జరుపుతున్నారని ఆరోపిస్తూ.. మళ్లీ ప్రచార ప్రసారాలు ప్రారంభిస్తామని, సరిహద్దుల్లో కొత్త ఆయుధ వ్యవస్థలను అప్రమత్తం చేస్తామని ఉత్తర కొరియా గత వారం ప్రకటించింది. దీనిపై స్పందించిన దక్షిణ కొరియా.. అనుకోకుండా ఘర్షణలు తలెత్తకుండా సరిహద్దు రేఖపై స్పష్టత కోసం చర్చలు జరపాలని ప్రతిపాదించింది. అయితే ఉత్తర కొరియా దీనిపై ఇంకా స్పందించలేదు.ఈ వారం ప్రారంభంలో దక్షిణ కొరియా సరిహద్దు పట్టణంలో పర్యటించిన అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) విలేకరులకు ఓ విషయం కనిపించింది. సరిహద్దుకు అవతలివైపు ఉత్తర కొరియా ఫిరంగులు గతంలో కనిపించని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఉన్నాయి.కిమ్ జోంగ్ ఉన్ దక్షిణ కొరియాతో సంబంధాలను తెంచుకోవాలనే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవలి సంవత్సరాల్లో సరిహద్దుల్లో ఉత్తర కొరియా మందుపాతరలు, ముళ్ల కంచెలు, ఇతర రక్షణ నిర్మాణాలను పెంచుతోంది. ఈ పనుల సమయంలో ఉత్తర కొరియా సైనికులు పలుమార్లు సరిహద్దు దాటి వచ్చారని సియోల్ ఆరోపించింది. దీనికి ప్రతిస్పందనగా తమ సైన్యం హెచ్చరిక కాల్పులు జరిపిందని తెలిపింది. అయితే సరిహద్దు ఉల్లంఘనలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను ఉత్తర కొరియా ఖండించింది.

అమెరికాతో చర్చల కోసం ఆయుధ పరీక్షలా?


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కిమ్‌తో మళ్లీ చర్చలు ప్రారంభించాలని ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి మరిన్ని రాయితీలు పొందాలనే లక్ష్యంతో ఉత్తర కొరియా ఇటీవలి వారాల్లో ఆయుధ పరీక్షలను పెంచినట్లు భావిస్తున్నారు.శనివారం కిమ్ చైనాలోని సరిహద్దు పట్టణం డాండాంగ్‌లో పర్యటించారు. కొత్తగా ప్రారంభించిన వంతెన మీదుగా అక్కడికి చేరుకున్నారు. 1950-53 కొరియా యుద్ధ సమయంలో ఉత్తర కొరియాకు చైనా అందించిన సహాయాన్ని గుర్తుచేసే స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. ఉత్తర కొరియా అధినేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కిమ్ చైనాలో పర్యటించడం ఇది ఆరోసారి.ఈ సందర్భంగా చైనాతో ఉన్న 'అజేయమైన' స్నేహాన్ని దృఢంగా కొనసాగిస్తామని కిమ్ చెప్పారు. అదే రోజు తర్వాత ఓ ఉన్నత స్థాయి చైనా అధికారితో సమావేశమైన ఆయన.. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.గత కొన్నేళ్లుగా రష్యాతో సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చిన కిమ్.. ఇటీవల చైనాతోనూ సంబంధాలను బలోపేతం చేసుకునే చర్యలు చేపట్టారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధానికి మద్దతుగా ఉత్తర కొరియా సైనికులు, ఆయుధ సామగ్రిని పంపిన విషయం తెలిసిందే.కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు రాజకీయ పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత దేశాలకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ గురువారం సూచించారు. ప్రాంతీయ శాంతిని ప్రోత్సహించేందుకు అన్ని దేశాలు కృషి చేయాలని బీజింగ్ ఆశిస్తోందని చెప్పారు.

అమెరికన్ల ఉద్యోగాలు విదేశీయులకు ఇస్తే ఊరుకోం.. కంపెనీలకు వాన్స్ వార్నింగ్



అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ కార్మికులకు కట్టబెట్టే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. వీసా మోసాలకు పాల్పడే సంస్థలు, అమెరికా ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే కంపెనీల యాజమాన్యాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. టెక్సాస్‌లోని వెదర్‌ఫోర్డ్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దేశ సార్వభౌమాధికారం అంటే అమెరికా పౌరుల ప్రయోజనాలను కాపాడటమేనని వాన్స్ అన్నారు. అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే సంస్థలపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఏయే కంపెనీలపై దర్యాప్తు జరుగుతోంది? ఏ వీసా కేటగిరీకి సంబంధించి అక్రమాలు జరిగాయి? అనే వివరాలను ఆయన వెల్లడించలేదు.అమెరికా కార్మికులకు మేలు చేసేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తున్నామని వాన్స్ చెప్పారు. దేశంలో కొత్తగా 670 బిలియన్ డాలర్ల తయారీ రంగ పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో టెక్సాస్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.యువత సొంత ఇల్లు కొనుగోలు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామని వాన్స్ తెలిపారు. వాల్‌స్ట్రీట్ సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు ఇళ్ల కొనుగోళ్లపై చూపే ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. టిప్స్ ద్వారా వచ్చే ఆదాయం, అదనపు పని గంటల వేతనాలు, సీనియర్లకు పన్ను ఉపశమనం కల్పించే చర్యలను ప్రస్తావించారు. చిన్నపిల్లలున్న కుటుంబాలకు ప్రయోజనాలు పెంచడంపైనా మాట్లాడారు.యువత సొంత ఇళ్లు కొనుక్కొని, కుటుంబాలను ఏర్పరచుకుని, స్థిరమైన ఉద్యోగాలతో జీవించే పరిస్థితులు రావాలని వాన్స్ ఆకాంక్షించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ.. మందులు కొనాలా? ఆహారం కొనాలా? అని ఆలోచించాల్సిన పరిస్థితులు తన కుటుంబంలో ఉండేవని చెప్పారు. సామాన్య కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యతగా అభివర్ణించారు.కెన్ పాక్స్‌టన్ అమెరికా సెనేట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాన్స్ ఈ సభలో పాల్గొన్నారు. ఉద్యోగాలు, సరిహద్దు భద్రత, ఇంధన ఉత్పత్తి, జీవన వ్యయాల తగ్గింపును ప్రస్తావిస్తూ రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతివ్వాలని ఓటర్లను కోరారు.

రోజుకు 654 ఉద్యోగాలు పోతున్నాయ్.. ప్రపంచానికి పెను సంక్షోభం..



ఒకప్పుడు టెక్నాలజీ రంగం అంటే భరోసా.. మంచి జీతం.. విలాసవంతమైన జీవితం.. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు! ఐటీ ఉద్యోగం వస్తే జీవితమే మారిపోతుందని లక్షలాది మంది యువత కలలు కనేవారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అదే టెక్ ఇండస్ట్రీలో ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో.. ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చేతిలో డిగ్రీ.. బ్యాంకు ఖాతాలో ఈఎంఐలు.. ఇంటి అద్దెలు.. కుటుంబ బాధ్యతలు.. ఇలా ఎన్నో భారాలను మోస్తున్న ఉద్యోగులకు లేఆఫ్స్ రూపంలో ఎదురవుతున్న దెబ్బలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

రోజుకు 654 మందికి ఉద్యోగం గల్లంతు

టెక్నాలజీ రంగంలో ఉద్యోగుల తొలగింపులు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయో తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎతీబవఖజూ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు 674 కంపెనీలు లేఆఫ్స్ ప్రకటించగా, మొత్తం 1,97,640 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అంటే సగటున రోజుకు 654 మంది ఉపాధిని కోల్పోతున్నారన్నమాట. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు మాత్రమే కాదు.. వేలాది కుటుంబాల జీవితాల్లో ఒక్కసారిగా చీకట్లు నింపుతున్న పరిణామాలకు అద్దం పడుతున్నాయి.ఉద్యోగం కోల్పోయిన ప్రతి ఒక్కరి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. నెలనెలా చెల్లించాల్సిన ఇంటి రుణం ఉండొచ్చు.. పిల్లల స్కూల్ ఫీజులు ఉండొచ్చు.. వృద్ధుల వైద్య ఖర్చులు ఉండొచ్చు. ఉద్యోగం చేస్తున్నంత కాలం వీటన్నింటినీ ఎలాగోలా నెట్టుకొచ్చిన వారు.. ఒక్కసారిగా ఆదాయం ఆగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ముఖ్యంగా విదేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వీసా నిబంధనలు, నివాస ఖర్చులు అదనపు భారంగా మారుతున్నాయి.

అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్.. ఉద్యోగుల్లో గుబులు

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా ఉద్యోగుల తొలగింపులను కొనసాగిస్తోంది. ఈ నెల ప్రారంభంలో సుమారు 1,000 ఉద్యోగాలను తొలగించిన సంస్థ.. తాజాగా మరో 250 ఉద్యోగాల కోతను ప్రకటించినట్లు అందిన సమాచారం చెబుతోంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన దిగ్గజ సంస్థల్లోనూ ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారడం టెక్ ఉద్యోగులను కలవరపెడుతోంది.పెద్ద కంపెనీలో ఉద్యోగం అంటే ఇక తిరుగులేదని భావించే రోజులు పోతున్నాయా? సంస్థకు లాభాలు వస్తున్నా, వ్యాపారం విస్తరిస్తున్నా ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా లేకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకోవడం, సంస్థాగత మార్పులు చేపట్టడం, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని పెంచడం వంటి పరిణామాలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చుతున్నాయి. అయితే ప్రతి లేఆఫ్‌కు ఏఐ ఒక్కటే కారణమని చెప్పలేం. వ్యాపార వ్యూహాలు, ఆర్థిక పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మైక్రోసాఫ్ట్ కీలక నిర్ణయం.. 60 వేల మందికి బైఅవుట్ ఆఫర్

మరోవైపు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సైతం ఉద్యోగులకు వాలంటరీ బైఅవుట్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. సుమారు 60 వేల మంది ఉద్యోగులకు ఈ అవకాశం కల్పించినట్లు వెల్లడించినట్లు వార్తలు వస్తున్నాయి. వాలంటరీ బైఅవుట్ అంటే ఉద్యోగులు స్వచ్ఛందంగా సంస్థను వీడేందుకు నిర్ణీత పరిహారం లేదా ఇతర ప్రయోజనాలతో కూడిన అవకాశం కల్పించడం. ఇది నేరుగా అందరినీ తొలగించడంతో సమానం కాకపోయినా.. ఉద్యోగుల సంఖ్య, సంస్థ వ్యయాలపై కంపెనీలు పునరాలోచన చేస్తున్నాయనే సంకేతాలను ఇస్తోంది.ఇలాంటి పరిణామాలతో టెక్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ భవిష్యత్తుపై ముందుగానే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే కంపెనీపై పూర్తిగా ఆధారపడకుండా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, అత్యవసర అవసరాల కోసం పొదుపు చేసుకోవడం, ఇతర ఉద్యోగ అవకాశాలపై దృష్టి పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

ఉద్యోగం పోతే.. కేవలం జీతమే కాదు, ఆత్మవిశ్వాసమూ దెబ్బతింటుంది


ఉద్యోగం కోల్పోవడం అంటే నెలవారీ జీతం ఆగిపోవడమే కాదు. రోజూ ఆఫీసుకు వెళ్లే అలవాటు.. సహోద్యోగులతో అనుబంధం.. సమాజంలో ఏర్పడిన గుర్తింపు.. కుటుంబానికి తాను అండగా ఉన్నాననే నమ్మకం.. ఇవన్నీ ఒక్కసారిగా కదిలిపోవచ్చు. మళ్లీ ఉద్యోగం సంపాదించాలనే ప్రయత్నంలో నెలల తరబడి ఇంటర్వ్యూలకు హాజరైనా ఫలితం రాకపోతే నిరాశ మరింత పెరుగుతుంది.అందుకే ఉద్యోగుల తొలగింపులను కేవలం కంపెనీల వ్యాపార నిర్ణయాలుగా మాత్రమే చూడలేం. సంస్థల సామర్థ్యం, ఉత్పాదకత ఎంత ముఖ్యమో.. ఉద్యోగుల జీవన భద్రత, నైపుణ్యాభివృద్ధి, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం.టెక్ రంగంలో మార్పులు అనివార్యం కావచ్చు. కానీ ఆ మార్పుల భారం పూర్తిగా ఉద్యోగుల కుటుంబాలపై పడకూడదు. ఉద్యోగులకు తగిన ముందస్తు సమాచారం, న్యాయమైన పరిహారం, కొత్త ఉద్యోగాల కోసం శిక్షణ, కెరీర్ మార్పులకు సహకారం అందించడం కంపెనీల బాధ్యతగా మారాలి.ఒకప్పుడు లక్షలాది మందికి ఆశలు కల్పించిన టెక్నాలజీ రంగం.. ఇప్పుడు అదే ఉద్యోగుల్లో భయాన్ని నింపుతోంది. రోజుకు 654 ఉద్యోగాలు పోతున్నాయనే గణాంకం వెనుక ఎన్ని కన్నీళ్లు ఉన్నాయో, ఎన్ని కుటుంబాల కలలు ఆగిపోయాయో లెక్కించడం కష్టం. సాంకేతిక అభివృద్ధి మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి కానీ.. అతడి జీవనాధారాన్నే ప్రశ్నార్థకం చేయకూడదు. ఇదే ఇప్పుడు టెక్ ఇండస్ట్రీ ముందున్న అసలైన సవాలు.

టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఆస్తులు రూ. 172 కోట్లు!




ఏపీలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా గుడిపాల జడ్పీటీసీ స్థానానికి టీడీపీ తరఫున పోటీ చేస్తున్న మమతశ్రీ తన ఆస్తుల విలువను రూ. 172.27 కోట్లుగా చూపడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల అఫిడవిట్‌లో ఆమె ఈ వివరాలను పొందుపరిచారు.అఫిడవిట్ ప్రకారం.. మమతశ్రీ కుటుంబానికి రూ. 9.28 కోట్ల చరాస్తులు, రూ. 162.99 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. ఆమె పేరిట రెండు స్కూటర్లు, 1.10 కిలోల బంగారం, 15 కిలోల వెండి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె భర్త మోగిలీశ్వర నాయుడు (ఈశ్వర నాయుడు) పేరిట మూడు గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, మూడు కాంక్రీట్ మిక్సర్ ట్రక్కులు ఉన్నాయి.స్థిరాస్తుల విషయానికొస్తే, మమతశ్రీ పేరిట రూ. 43.64 కోట్లు, ఆమె భర్త పేరిట రూ. 119.80 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. వీటిలో 44.62 ఎకరాల వ్యవసాయ భూమి, రూ. 24.89 కోట్ల విలువైన ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంతో పాటు కర్ణాటకలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో తమకు రూ. 32 కోట్ల మేర అప్పులు కూడా ఉన్నాయని దంపతులు అఫిడవిట్‌లో వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఒక అభ్యర్థి ఇంత భారీ మొత్తంలో ఆస్తులు ప్రకటించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

ఎల్‌నినో ... మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?



భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా.ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉ



ంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీనిరసన .. వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే



ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.

వాయిదా వేయాలని వ్యాపార సంఘాల విజ్ఞప్తి

పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే: రాహుల్ గాంధీ

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.నవంబర్ 1న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి తరలివచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతకుముందు రోజు, అంటే అక్టోబర్ 30న, 'మాక్ పార్లమెంట్' నిర్వహించనున్నట్లు ఖర్గే వెల్లడించారు.

ఓట్ల తొలగింపు సరైనదే: 'సర్'కు అనుకూలంగా కర్ణాటక కాంగ్రెస్ మంత్రి వ్యాఖ్యలు



కర్ణాటక ఓటర్ల జాబితా నుంచి దాదాపు కోటి ఓట్లను తొలగించడాన్ని రాష్ట్ర కాంగ్రెస్ మంత్రి సతీశ్ జార్కిహోళి సమర్థించారు. ఈ ప్రక్రియ నిబంధనల ప్రకారమే, అత్యంత పారదర్శకంగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, రెండు చోట్ల ఓటు ఉన్న డూప్లికేట్ ఓటర్ల పేర్లను మాత్రమే తొలగించారని, ఇది సరైన నిర్ణయమేనని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో ఎలాంటి గందరగోళం, అక్రమాలు జరగలేదని ఆయన తెలిపారు. ఈ చర్యల వల్ల అర్హులైన ఏ ఒక్క ఓటరు హక్కుకు భంగం కలగలేదని, బోగస్ ఓట్లను ఏరివేయడానికే ఈ ప్రక్రియ దోహదపడిందని వివరించారు.సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకత కర్ణాటకకు సంబంధించినది కాదని జార్కిహోళి స్పష్టం చేశారు. బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను అమలు చేసిన తీరుపైనే తమకు అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. కర్ణాటకలో మాత్రం సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వడం, ముందస్తు సమాచారం అందించడం వల్ల సవరణ ప్రక్రియ సక్రమంగా పూర్తయిందని అన్నారు.ఇతర రాష్ట్రాల్లో కూడా ఇంతే పద్ధతిగా, పారదర్శకంగా చేసి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలనే విధానం మంచిదే అయినా, దాన్ని అమలు చేసే తీరు సరిగ్గా ఉండాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని అన్నారు.

అలాంటి నిరసనల్లో పాల్గొంటే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హత.. యూపీ యోగి సర్కార్ నిర్ణయంపై ప్రతిపక్షాల ఫైర్



ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల వెరిఫికేషన్ విషయంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. హింసాత్మక మార్గాల్లో అధికార మార్పిడి లక్ష్యంగా పనిచేసే సంస్థల్లో సభ్యులుగా ఉండటం, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం ఉద్యోగానికి అనర్హతగా మారవచ్చని స్పష్టం చేసింది. అయితే రాజకీయ సిద్ధాంతాలు వేరుగా ఉన్నాయనే కారణంతోనే ఉద్యోగం నిరాకరించరాదని కూడా పేర్కొంది. ఈ నిర్ణయంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ విమర్శలు చేశాయి.

కొత్త నిబంధనల్లో ఏముంది?

రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో పాటు ప్రభుత్వ సంస్థలు, మండళ్లు, స్థానిక సంస్థల్లో నేరుగా నియామకాలు పొందే అభ్యర్థులకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి. హింసాత్మక పద్ధతుల్లో ప్రస్తుత వ్యవస్థను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థల్లో సభ్యత్వం ఉండటం లేదా అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం అనర్హతకు కారణం కావచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అభ్యర్థికి 21 ఏళ్ల నిండిన తర్వాత, వెరిఫికేషన్‌కు ముందు మూడేళ్ల వ్యవధిలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు తేలితే, ఆ వ్యక్తి ఇంకా వాటిలో చురుగ్గా ఉన్నట్లు పరిగణించే అవకాశం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో అతడి ప్రవర్తనలో సానుకూల మార్పు వచ్చినట్లు ఆధారాలు ఉంటే ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించవచ్చు.కేవలం ఎఫ్ఐఆర్ నమోదైనంత మాత్రాన లేదా దర్యాప్తు కొనసాగుతున్నంత మాత్రాన అభ్యర్థిని ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటించరాదు. కేసుల్లో నిర్దోషిగా తేలినవారు, రాజీ ద్వారా పరిష్కారమైన కేసులు ఉన్నవారు, బాలల న్యాయ చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు ఉన్నవారికి కూడా ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు

ఈ ఉత్తర్వులను సమాజ్‌వాదీ పార్టీ నేత ఉదయ్‌వీర్ బ్రిటిష్ పాలన కాలం నాటి విధానాలతో పోల్చారు. స్వతంత్ర భారతదేశంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఎన్నికల ద్వారా అధికార మార్పిడి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని అన్నారు.కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ ఈ నిర్ణయాన్ని అతిగా ఉందని విమర్శించారు. ఇలాంటి అంశాల్లో ప్రభుత్వమే న్యాయనిర్ణేతగా వ్యవహరించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

వెరిఫికేషన్‌కు 30 రోజుల గడువు

పోలీసులు, స్థానిక నిఘా విభాగం (ఎల్ఐయూ) అభ్యర్థుల క్యారెక్టర్ వెరిఫికేషన్ నివేదికలను అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా నియామక అధికారులకు సమర్పించాలి. నివేదిక అలస్యమైనంత మాత్రాన నియామక పత్రం ఇవ్వడం ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. అవసరమైన పత్రాలు, స్వీయ ధ్రువీకరణ తీసుకున్న తర్వాత తాత్కాలిక నియామక పత్రం ఇవ్వవచ్చు.వెరిఫికేషన్‌లో అభ్యర్థి అనర్హుడిగా తేలినా, తప్పుడు సమాచారం ఇచ్చినా నియామకాన్ని రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ప్రతికూల నివేదిక వచ్చిన సందర్భంలో అభ్యర్థి తన వాదనను ఆన్‌లైన్‌లో లేదా నేరుగా అధికారుల ముందు వినిపించే అవకాశం కల్పించాలి. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారికి మళ్లీ క్యారెక్టర్ వెరిఫికేషన్ తప్పనిసరి కాదని ఉత్తర్వులు స్పష్టం చేశాయి. అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ మార్గదర్శకాలు జారీ చేసినట్లు సమాచారం.

బెంగళూరులో లోకల్ వర్సెస్ నాన్ లోకల్ వార్.. ఐటీ ఉద్యోగాలపై కొత్త వివాదం

ఐటీ ఉద్యోగాలపై లోకల్ వార్.. బెంగళూరులో ముదురుతున్న వివాదం...ఏఐతో ఉద్యోగాలకు కోత.. మరోవైపు స్థానికుల కోటా డిమాండ్



బెంగళూరు ఐటీ రంగంలో ఇప్పుడు కొత్త వివాదం మొదలైంది. ఒకవైపు టెక్ కంపెనీల్లో నియామకాలు తగ్గి, ఉద్యోగాల కోతలు పెరుగుతుంటే.. మరోవైపు స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్ రాజకీయంగా వేడెక్కుతోంది. కన్నడిగులకు అవకాశాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు ఈ చర్చకు మరింత ఆజ్యం పోశాయి.

కన్నడిగులకు అన్యాయం జరిగితే ఊరుకోం :


కర్ణాటకలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దక్కాల్సిందేనని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గట్టిగా చెబుతున్నారు. కన్నడిగులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని ఐటీ కంపెనీలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇతర రాష్ట్రాల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నప్పుడు, కర్ణాటకలో మాత్రం ఇతర ప్రాంతాల ఇంజినీర్లను తక్కువ వేతనాలకు నియమించుకుంటున్నారంటూ ఓ యువతి చేసిన ఆరోపణలు ఈ వివాదానికి కారణమయ్యాయి..నిజానికి, ఈ అంశం ఇప్పటిది కాదు.. 2024లోనే సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు ఉద్యోగ కోటా కల్పించే బిల్లును ప్రతిపాదించింది. మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 50 శాతం, ప్రవేశ స్థాయి ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ ఇవ్వాలన్నది ఆ ప్రతిపాదనలో కీలక అంశం.

కంపెనీల్లో ఆందోళన ఇదే :

అయితే, పరిశ్రమల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇలాంటి నిబంధనలు అమలు చేస్తే పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోయే ప్రమాదం ఉందని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి.మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే మౌలిక సదుపాయాలు, రాయితీలతో లాభపడుతున్న కంపెనీలు స్థానికులకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కొందరు నేతలు వాదిస్తున్నారు. అయితే, ఉద్యోగాల్లో స్థానికతను తప్పనిసరి చేయడం రాజ్యాంగ హక్కులు, ప్రతిభ ఆధారిత నియామకాలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది.ఇదిలా ఉంటే, ఏఐ ప్రభావంతో ఐటీ రంగంలో ఉద్యోగ భద్రత ఇప్పటికే సవాలుగా మారింది. ప్రముఖ కంపెనీలు నియామకాలను తగ్గించడం, ఉద్యోగాల కోతలు చేపట్టడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి.రాజకీయంగా చూస్తే.. కన్నడ భాష, ప్రాంతీయ గౌరవం, స్థానిక ఓటర్ల మద్దతు ఈ వివాదంలో కీలకంగా కనిపిస్తున్నాయి. అయితే, ఉద్యోగాల సంఖ్య తగ్గుతున్న పరిస్థితుల్లో స్థానికులు, వలసదారుల మధ్య పోటీని పెంచడం పరిష్కారమా? లేక నైపుణ్యాలకు తగ్గ అవకాశాలు పెంచడమే అసలైన మార్గమా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది..

బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ గొర్తి శ్రీనివాసరావు మృతిపై సమగ్ర విచారణ చేయాలి

అనుమానాలునివృత్తిచేయాల్సినబాధ్యతకూటమిప్రభుత్వానిదే...సూసైడ్‌లేఖలోపేర్కొన్న వారి పాత్రపై నిష్పక్షపాత దర్యాప్తు జరగాలి...నిధుల అవకతవకలు, ఉద్యోగులపై ఒత్తిళ్లపైనా దృష్టిసారించాలి:: వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్



తాడేపల్లి, అనంతపురం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని ప్రణాళికాబద్ధంగా వేధిస్తూ, వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ ప్యానలిస్ట్ జ్వాలాపురం శ్రీకాంత్ విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అనంతపురం పార్టీ కార్యాలయంలో జ్వాలాపురం శ్రీకాంత్‌లు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. విజయవాడ బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ గొర్తి శ్రీనివాసరావు ఆత్మహత్య ఘటనపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆయన మరణానికి ముందు వాట్సాప్ గ్రూపులో చేసిన సందేశం, సూసైడ్ నోట్‌లోని అంశాలపై ప్రభుత్వం తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌లో జరిగిన ఆర్థిక అవకతవకలు, ఉద్యోగులపై ఒత్తిళ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గొర్తి శ్రీనివాసరావు బంగారు ఆభరణాలను బలవంతంగా తీసుకున్నారనే ఆరోపణలపైనా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, ఎండీ చంద్రశేఖర్ ఆజాద్, సీఈవో నాగసాయి, బాలా త్రిపురసుందరి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ గారి ప్రభుత్వ హయాంలో అర్హులైన బ్రాహ్మణ కుటుంబాలకు సుమారు రూ.800 కోట్ల సంక్షేమ ప్రయోజనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో పాటు దాదాపు 50 వేల మందికి పెన్షన్లు అందించినట్లు వారు చెప్పారు. ప్రస్తుతం గరుడ పథకం ద్వారా అందించే అంత్యక్రియల సాయం నిలిచిపోవడం, బ్రాహ్మణ కార్పొరేషన్, సహకార సొసైటీల కార్యకలాపాలు కుంటుపడటంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గొర్తి శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేసి, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, అర్హులైన బ్రాహ్మణులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు.

ప్రణాళిక ప్రకారం బ్రాహ్మణ సామాజికవర్గంపై వేధింపులు : మల్లాది విష్ణు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఒక ప్రణాళిక ప్రకారం బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని వేధింపులకు గురిచేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయి. విజయవాడ బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ గొర్తి శ్రీనివాస్ ఆత్మహత్య ఘటన దీనికి నిదర్శనం. ఆయన తన మరణానికి ముందు వాట్సాప్ గ్రూపులో పెట్టిన సందేశంలో ఆడిట్ వివరాలు సమర్పించేందుకు రెండు రోజుల గడువు కోరినా అవకాశం ఇవ్వలేదని పేర్కొన్న నేపథ్యంలో, ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించాలి. ఉద్యోగుల ఆడిటింగ్, ఆర్థిక లావాదేవీలు పరిశీలించాల్సిన అధికారులు ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలపై వాస్తవాలను బయటపెట్టి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆర్థిక లావాదేవీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. వైఎస్ జగన్ గారి ప్రభుత్వ హయాంలో అర్హులైన బ్రాహ్మణ కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.800 కోట్లను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం, దాదాపు 50 వేల మందికి పెన్షన్లు అందించాం. అర్చకులు, పురోహితులు, ఉపాధ్యాయులు, బ్రాహ్మణ ఉద్యోగులకు ఉపయోగపడేలా బ్రాహ్మణ కార్పొరేషన్, సహకార సొసైటీని బలోపేతం చేసి రుణ సదుపాయాలు కల్పించాం. కానీ ఇప్పుడు గరుడ పథకం ద్వారా అంత్యక్రియల కోసం అందించే రూ.10 వేల సాయాన్ని కూడా నిలిపివేసి ఆఖరుకి వెబ్‌సైట్‌ను కూడా మూసివేశారు. గొర్తి శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్, సహకార సొసైటీలను పునరుద్ధరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులపై తీసుకున్న చర్యలు, బ్రాహ్మణ జర్నలిస్టుపై నమోదైన కేసుల విషయంలోనూ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

గొర్తి శ్రీనివాసరావు మృతిపైఅనుమానాలు : జ్వాలాపురం శ్రీకాంత్


బ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజర్ గొర్తి శ్రీనివాసరావు మృతి అత్యంత బాధాకరమైన విషయం. ఆయన మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయి, ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, ఎండీ చంద్రశేఖర్ ఆజాద్, సీఈవో నాగసాయి, బాలా త్రిపురసుందరి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసింది. వైఎస్ జగన్ గారి ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి, ఇప్పుడు పథకాలు అందకుండా పోయాయి. కార్పొరేషన్ డైరెక్టర్లను పక్కనపెట్టి కొందరే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కార్పొరేషన్‌లో మూడు, నాలుగు కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత



బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. శ్రీనివాసరావు బంగారు ఆభరణాలను బలవంతంగా తీసుకున్నారనే ఆరోపణలపైనా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలి. ఆయన మృతిపై ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు విషయంలో జాప్యం చేయకుండా బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచి, తగిన ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు ఆయన కుటుంబానికి న్యాయం చేయాలి. బ్రాహ్మణ కార్పొరేషన్‌లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై పారదర్శక విచారణ జరిపించి, బ్రాహ్మణుల సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది.

ఉద్యోగులారా మేల్కోండి...హామీలను విస్మరించిన కూటమి సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పండి

ఉద్యోగులహక్కులనుకాలరాస్తూ..హామీలకు తిలోదకాలు...కూటమి ప్రభుత్వ మోసానికి ఉద్యోగులే గుణపాఠం చెప్పాలి...ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు మోసం చేస్తోంది... పీఆర్సీ, మధ్యంతరభృతి, డీఏ బకాయిలు ఎప్పుడిస్తారుచంద్రబాబూ...ఉద్యోగులకురావాల్సిన రూ.40 వేల కోట్లకుపైగాబకాయిలు చెల్లించకుండా ఇంకా ఎంతకాలం కాలయాపన చేస్తారు : మీడియా సమావేశంలో నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిలుపు



విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : ఎన్నికల ముందు ఉద్యోగుల ఓట్ల కోసం హామీల వర్షం కురిపించి, అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను గాలికొదిలేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని వైయస్‌ఆర్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. పీఆర్సీ, మధ్యంతర భృతి, డీఏ బకాయిలను పెండింగ్‌లో పెట్టి, ఉద్యోగులకు రావాల్సిన రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ, ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యోగులే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

పీఆర్సీ, మధ్యంతర భృతి ఎప్పుడు?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రెండున్నరేళ్ల దాటినా ఆ హామీని నెరవేర్చలేదు. వైయస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 27 శాతం మధ్యంతర భృతి ఇచ్చింది. ఇప్పుడు ఉద్యోగులకు 30 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతి ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. 2023 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ఇంకా ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారు? ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఇకనైనా వెంటనే అందించాలి.

ధరలు పెరుగుతున్నా ఉద్యోగులకు ఊరట ఏదీ?

బియ్యం, వంటనూనె, పప్పులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.2,400 నుంచి రూ.2,500కు చేరింది. వంటనూనె, చక్కెర, కందిపప్పు ధరలు కూడా భారీగా పెరిగాయి. నిత్యావసర ధరలను నియంత్రించకుండా, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, బకాయిలు చెల్లించకుండా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్లు, సర్వీస్ ప్రయోజనాలు కల్పించాలి. ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదు.

ఈహెచ్ఎస్ బకాయిలు చెల్లించి వైద్య సేవలు అందించాలి

ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ప్రతి నెలా ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం చందాలు వసూలు చేస్తున్నారు. అయినా ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉద్యోగులు తమ వాటా చెల్లించినప్పుడు ప్రభుత్వం కూడా తన వాటాను సకాలంలో చెల్లించాలి. ఆరోగ్య కార్డులు ఉన్నా వైద్యం అందని పరిస్థితి ఉండకూడదు. ఆసుపత్రులకు బకాయిలు వెంటనే చెల్లించి ఉద్యోగులు, పెన్షనర్లకు నిరంతర వైద్య సేవలు అందించాలి. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులకు టెట్ విషయంలో తగిన మినహాయింపు కల్పించాలి.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినఉద్యోగుల కుటుంబాలకున్యాయంచేయాలి

తుఫాను సహాయక చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన సచివాలయ ఉద్యోగిని కలాం సరస్వతి, విద్యుత్ ఉద్యోగి పైడిరాజు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఒక్కొక్క కుటుంబానికి రూ.5 కోట్ల చొప్పున పరిహారం చెల్లించాలి. వారి కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి అండగా నిలవాలి. ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలి.

ఉద్యోగులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పిలిచి, బీజేపీ మేయర్ అభ్యర్థికి ఓటు వేయకపోతే ఉద్యోగాలు పోతాయని బెదిరించినట్లు వచ్చిన వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగులను రాజకీయ ప్రయోజనాల కోసం బెదిరించడం ఎంతవరకు సమంజసం? ఉద్యోగ భద్రతను రాజకీయ మద్దతుతో ముడిపెట్టడం అన్యాయం.

ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కర్నూలు జిల్లా ఆలూరులో హోంగార్డు భార్య ఎంపీటీసీగా పోటీ చేస్తున్న నేపథ్యంలో ఒత్తిళ్లు తెచ్చి, హోంగార్డును బదిలీ చేసినట్లు వచ్చిన వ్యవహారంపైనా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రాజకీయాల్లో పాల్గొనే హక్కు ఉంది. ఆ హక్కును అడ్డుకునే ప్రయత్నాలను సహించకూడదు.

ఉద్యోగులారా మేల్కొండి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలి. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా, ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఉద్యోగులారా మేల్కొండి. హామీలను విస్మరించిన కూటమి సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పండి అని నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీలో టీడీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాలి...ఎన్నికల్లో సీసీటీవీ నిఘా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలి



విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : రాష్ట్రంలో నవంబరు 1న జరిగే పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేయకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కి వైయస్సార్‌సీపీ విజ్ఞప్తి చేసింది. అలాగే అర్నబ్ తుపాన్ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల జాబితాల తయారీకి ఇచ్చిన షెడ్యూల్ ను సవరించాలని పార్టీ కోరింది. దీంతో పాటు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైయస్సార్‌సీపీ అభ్యర్థులను వేధించిన అధికారులపై దర్యాప్తు చేయించి, తగు చర్యలు తీసుకోవాలని కోరింది. ఇంకా మదనపల్లెలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నాలుగు వేర్వేరు లేఖలు ఎస్ఈసీకి పంపారు.

పింఛన్ల పంపిణీని టీడీపీ ప్రభావితం చేయకుండా చూడాలి:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 30న జరుగుతున్న పింఛన్ల పంపిణీలో టీడీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేయకుండా నిరోధించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు అత్యవసర విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం సాధారణంగా ప్రతి నెల 1వ తేదీన పంపిణీ చేసే సామాజిక భద్రతా పింఛన్లను, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అక్టోబర్ 30న ఇస్తున్న విషయాన్ని లేఖలో ప్రస్తావించింది. రేపు జరిగే పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి వెళ్లి లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి, అధికార పార్టీకి అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నించే అవకాశం ఉందని తమకు తీవ్రమైన ఆందోళన ఉందని, ప్రజాసంక్షేమ పథకం కింద అందించే పింఛన్ల పంపిణీని ఎన్నికల ప్రచారానికి లేదా ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఉపయోగించే ప్రమాదం ఉందని భావిస్తున్నట్లు తెలిపింది. అందువల్ల పింఛన్ల పంపిణీ సమయంలో టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఇతర రాజకీయ ప్రతినిధులు ప్రభుత్వ సిబ్బందితో కలిసి వెళ్లకుండా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఈ కార్యక్రమాన్ని కేవలం అధీకృత ప్రభుత్వ ఉద్యోగులే నిర్వహించేలా చూడాలని, రాజకీయ జోక్యాన్ని నిరోధించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా వ్యవహరించే రాజకీయ కార్యకర్తలు, వారికి సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేసింది.

మదనపల్లెలో పోలింగ్ రోజు అక్రమాలను అడ్డుకోవాలి:

నవంబరు 1న జరిగే మున్సిపల్ ఎన్నికల సమయంలో అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, ఓటర్లు బెదిరింపులు లేదా అడ్డంకులను ఎదుర్కొనే అవకాశం ఉందని మదనపల్లె మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి జింకా వెంకట చలపతి లేవనెత్తిన ఆందోళనలను పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చింది. మదనపల్లెలో జరిగే ఎన్నికల ముందు కొంతమంది వ్యక్తులను సమీకరించినట్లు తమకు సమాచారం అందిందని అభ్యర్థి పేర్కొన్నట్లు లేఖలో తెలిపింది. దీనివల్ల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లను బెదిరించడం, పోలింగ్ కేంద్రాల వద్ద అంతరాయాలు సృష్టించడం, ఓటు హక్కు వినియోగానికి ఆటంకం కలిగించడం వంటి పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని, సంబంధిత అధికారులకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని కోరింది. ఎన్నికల సమయంలో, ముఖ్యంగా పోలింగ్ రోజున, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, ఆయన అనుచరుల జోక్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు గతేడాది ఆగస్టు 12న ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వైఎస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్ పై చేసిన దాడికి సంబంధించిన వీడియోలు, మీడియా కథనాలను కూడా ఈ లేఖతో పాటు పంపింది. ఈ ఘటనపైనా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ కోరింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల జాబితా సవరణకు రీషెడ్యూల్:

మరోవైపు తుపాను కారణంగా ఏర్పడిన అంతరాయాలు, ఓటర్ల వివరాల ధ్రువీకరణకు తగిన సమయం లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల జాబితాల తయారీ షెడ్యూల్‌ను సవరించాలని వైఎస్సార్సీపీ కోరింది. ఈ సందర్భంగా కాకినాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు శంకర శివ ప్రసన్న సాగర్ లేవనెత్తిన ఆందోళనలను పార్టీ ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చింది. 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, జాబితాల తయారీ, ప్రచురణకు సంబంధించి అక్టోబరు 23న జారీ చేసిన జీఓ ఆర్టీ నెం:1298 లోని షెడ్యూల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇంత తక్కువ సమయంలో సర్వే పూర్తి చేయడం వల్ల ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ, తప్పుల సవరణ ప్రక్రియల నాణ్యతపై ఆందోళనలు ఉన్నాయని పేర్కొంది. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి వంటి అధిక జనాభా కలిగిన మున్సిపల్ కార్పొరేషన్లలో ఇంటింటి సర్వే పూర్తి చేయడానికి, రికార్డులను పరిశీలించడానికి, తప్పులను సరిదిద్దడానికి తగిన సమయం అవసరమని తెలిపింది. అక్టోబర్ 25 నుంచి 28 మధ్య తుపాను పరిస్థితులు ఏర్పడటంతో సర్వే, ముసాయిదా జాబితాల ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియలకు అంతరాయం కలిగిందని గుర్తుచేసింది. దీంతో సిబ్బంది సర్వేను పూర్తి చేయలేకపోయారని, ఓటర్లు ముసాయిదా జాబితాలను పరిశీలించి తప్పులు గుర్తించడం, అభ్యంతరాలు సమర్పించడం కూడా కష్టమైందని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణకు ఒక్కరోజు మాత్రమే ఇచ్చి, వెంటనే తుది జాబితాలను ప్రచురించడం వల్ల ప్రజలకు తగిన పరిశీలన అవకాశం లభించదని పేర్కొంది. సర్వే పూర్తికాకుండానే తుది జాబితాలు ప్రకటిస్తే అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగించబడే లేదా తప్పుగా వర్గీకరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కొత్త షెడ్యూల్ ప్రకటించాలని కోరింది.

పక్షపాతం చూపిన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి:

మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పోలీసు అధికారుల పక్షపాత వైఖరి, జోక్యం, నామినేషన్ల దాఖలుకు అడ్డంకులు, బలవంతపు ఉపసంహరణలపై వచ్చిన తీవ్రమైన ఫిర్యాదులను వైయస్సార్‌సీపీ కమిషన్ దృష్టికి తెచ్చింది. గతంలో సమర్పించిన ఫిర్యాదుల్లో పేర్కొన్న ఆరోపణలతో పాటు, తాజాగా వెలుగులోకి వచ్చిన మరికొన్ని పేర్లు, ఘటనలను కూడా కమిషన్ దృష్టికి తీసుకువచ్చింది. ఈ ఆరోపణలు ఎన్నికల మిగిలిన దశల నిష్పక్షపాత నిర్వహణపై ఆందోళన కలిగిస్తున్నందున తక్షణ జోక్యం అవసరమని భావిస్తున్నట్లు తెలిపింది. పోలీసు అధికారులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన సమయంలో, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని, వైఎస్సార్సీపీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని, బెదిరింపులకు పాల్పడ్డారని, నామినేషన్లను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చారని ఫిర్యాదులో ఆరోపించింది. కొన్ని సందర్భాల్లో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేయడం, తప్పుడు కేసులు పెడతామని బెదిరించడం, దాడులు జరిగినప్పుడు రక్షణ కల్పించకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపింది. ఈ ఆరోపణలను పరిశీలించి, సంబంధిత అధికారుల పాత్రపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరింది. ఇందులో నియోజకవర్గాల వారీగా చూస్తే కర్నూలు రేంజ్ లో కర్నూలు డీఐజీ కె. ప్రవీణ్, పులివెందులలో అదనపు ఎస్పీ ప్రకాశ్ బాబు, రాజంపేటలో సీఐ హేమసుందర్ రావు, బద్వేల్, చిత్తూరు, గుంటూరు, గుడివాడ, మాచర్ల, వినుకొండ, పెదకూరపాడు ప్రాంతాల్లో నామినేషన్ల దాఖలుకు అడ్డంకులు, బెదిరింపులు, దాడులు, నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం వంటి ఆరోపణల్ని ప్రస్తావించింది. అలాగే ప్రకాశం జిల్లాలోని కొండేపి, మార్కాపురం జిల్లాలోని యర్రగొండపాలెం, శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి తదితర నియోజకవర్గాల్లో పోలీసు అధికారులు తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారని ఫిర్యాదులో తెలిపింది. కాబట్టి ఆయా అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికలకు సీసీటీవీల భద్రత, వెబ్ కాస్టింగ్:

అలాగే మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే విషయంలో హైకోర్టు ఆదేశాల అమలుపై వైఎస్సార్‌సీపీ మరో వినతిపత్రం కూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు పంపింది. ఇందులో గతంలో పంపిన మూడు వినతిపత్రాలు, హైకోర్టు అక్టోబర్ 16న ఇచ్చిన ఉత్తర్వుల ప్రతుల్ని జత చేసింది. ఇందులో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియలో హింస, బెదిరింపులు, అడ్డంకులు ఎదురవుతున్నాయని పార్టీ గతంలోనే కమిషన్ దృష్టికి తీసుకువచ్చిందని వైఎస్సార్సీపీ మరో లేఖలో ప్రస్తావించింది. పుంగనూరు, పులివెందుల, కడప, కమలాపురం, తిరుపతి, రాయచోటి, రాజంపేట, నెల్లూరు, నంద్యాల, ఆదోని, చెమ్మకుర్తి, ధర్మవరం, దాచేపల్లి, జమ్మలమడుగు, దర్శి, గురజాల తదితర ప్రాంతాల్లో నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడం, అభ్యర్థులు, ప్రతిపాదకులపై దాడులు, బెదిరింపులు, పోలీసుల మౌనం వంటి ఘటనలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని గుర్తుచేసింది. హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగా సున్నితమైన, అత్యంత సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, ప్రాంతాలవారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర పోలీసు శాఖ తెలిపినట్లు ఉత్తర్వుల్లో ఉందని తెలిపింది.

కాగా, ఇప్పటివరకు తమ వినతిపత్రాలపై తీసుకున్న చర్యలు లేదా హైకోర్టు ఆదేశాల అమలుకు సంబంధించిన వివరాలు కమిషన్ నుంచి అందలేదని వినతిపత్రంలో పేర్కొంది. ఈ వివరాలు లేకపోవడం వల్ల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనే నమ్మకం అభ్యర్థులకు, ఓటర్లకు కలగడం లేదని తెలిపింది. ముఖ్యంగా అధికార పార్టీ ఇతర ప్రాంతాల నుంచి తన కార్యకర్తలను, సంఘవ్యతిరేక శక్తులను మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తమకు సమాచారం అందిందని వైఎస్సార్‌సీపీ పేర్కొంది.

పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున ఇలాంటి వ్యక్తులు వార్డులు, డివిజన్లలో తిరుగుతూ ఓటర్లను భయపెట్టడం, పోలింగ్ కేంద్రాలకు మద్దతుదారులు చేరకుండా అడ్డుకోవడం, పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, నకిలీ ఓటింగ్‌కు పాల్పడడం, ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. నామినేషన్ల దశలోనే హింస, బెదిరింపులు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు దశల్లోనూ ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది.

కాబట్టి అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ప్రత్యక్ష వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడం అత్యంత ప్రభావవంతమైన భద్రతా చర్య అని వినతిపత్రంలో పేర్కొంది. దీని ద్వారా ఎన్నికల కమిషన్ తక్షణమే పరిస్థితులను పర్యవేక్షించగలదని, ఫిర్యాదులపై స్పందించేందుకు ఆధారాలు లభిస్తాయని తెలిపింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌లకు రౌండ్‌ది--క్లాక్ నిఘా, సాయుధ భద్రత అవసరమని పేర్కొంది. ఈ దిశగా ఎన్నికల కమిషన్ తీసుకోవాల్సిన చర్యల్ని వైఎస్సార్‌సీపీ ఈ లేఖలో గుర్తు చేసింది.

పోలింగ్‌కు ముందే ఈ చర్యలు అమలు చేసి, తీసుకున్న చర్యల వివరాలను తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది. తద్వారా లోపాలు ఉంటే గుర్తించి, చట్టపరమైన పరిష్కారాలు కోరేందుకు వీలుంటుందని వైయస్సార్‌సీపీ పేర్కొంది.

అర్నాబ్ తుపాను బీభత్సం...ఉగ్రరూపం దాల్చిన బాహుదా..

స్తంభించిన ఏపీ-ఒడిశా రవాణా



'అర్నాబ్' తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర ప్రాంతం అతలాకుతలమవుతోంది. ఒడిశాతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా బాహుదా నది ఉగ్రరూపం దాల్చడంతో ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, సువర్ణముఖి, వేగావతి నదులు కూడా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.బాహుదా నదిలోకి ఏకంగా 86,458 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో తీవ్ర పరిస్థితులు నెలకొన్నాయి.

గొట్టా బ్యారేజ్ వద్ద వంశధార నది ప్రవాహం 73,324 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ వరదల కారణంగా శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, మందస, పాతపట్నం నియోజకవర్గాలతో పాటు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.వరద ఉద్ధృతికి రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఇచ్ఛాపురం లొద్దపుట్టి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇచ్ఛాపురం-జడుపూడి మధ్య రైల్వే ట్రాక్‌లు, వంతెన దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు, గాలికొండ వద్ద కొండచరియలు విరిగిపడటంతో అరకు-విశాఖ ఘాట్ రోడ్డును మూసివేశారు. బొర్రా-కారకవలస స్టేషన్ల మధ్య ట్రాక్ దెబ్బతినడంతో కొత్తవలస-కిరండూల్ ప్యాసింజర్ రైలును నవంబర్ 3 వరకు రద్దు చేశారు.ప్రాథమిక అంచనాల ప్రకారం, ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 728 గ్రామాల్లో సుమారు 21,590 హెక్టార్లలో వరి పంట, 383 హెక్టార్లలో ఉద్యాన పంటలు ధ్వంసమయ్యాయి. బారువ వద్ద తీరప్రాంత కోత కారణంగా కొబ్బరి తోటలు సముద్రంలో కలిసిపోయాయి. సోంపేట-బారువ రహదారిలో సుమారు 7 కిలోమీటర్ల మేర పొలాల్లో 10 అడుగుల లోతున నీరు నిలిచిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఆర్మేనియా పార్లమెంట్‌లో ఎంపీల ముష్టియుద్ధం..

ప్రజలు చూడాలని లైవ్ ఆపని స్పీకర్



ఆర్మేనియా పార్లమెంటులో అసాధారణ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరి తీవ్ర ఘర్షణకు దారితీసింది. ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగానే ఎంపీలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు, తన్నుకున్నారు. ఈ గొడవలో ఒక ఎంపీ కుర్చీ విసిరి దాడి చేయగా, మరొకరు నీళ్లు చల్లుకుని సభలో గందరగోళం సృష్టించారు.గురువారం ఆర్మేనియా నేషనల్ అసెంబ్లీలో ఆడిట్ ఛాంబర్ సభ్యుడి ఎన్నికపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధాని నికోల్ పషిన్యాన్ నేతృత్వంలోని అధికార సివిల్ కాంట్రాక్ట్ పార్టీ ఎంపీ టరాన్ చఖోయాన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష స్ట్రాంగ్ ఆర్మేనియా పార్టీపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ పార్టీ నేత నరేక్ కారపెత్యాన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ, ఆయన బంధువు చేసిన పాత వ్యాఖ్యలను గుర్తుచేశారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం మొదలైంది.ఈ క్రమంలోనే నరేక్ కారపెత్యాన్ పోడియం వద్దకు దూసుకురావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రతిపక్ష ఎంపీ గార్నిక్ దావ్తాన్ తొలి పిడిగుద్దు విసిరారని స్పీకర్ తెలిపారు. అనంతరం సభ మొత్తం రణరంగంగా మారింది. డిప్యూటీ స్పీకర్ వాహగ్న్ అలెక్సాన్యన్ ఏకంగా ప్రతిపక్ష సభ్యులపైకి కుర్చీ విసిరారు. ఈ ఘర్షణలో ప్రతిపక్ష ఎంపీ ఆండ్రానిక్ గెవోర్గ్యాన్ ముక్కు పగిలి రక్తం కారగా, మరో ఎంపీ రూబెన్ ఖీతార్యాన్ దుస్తులు చిరిగాయి. దీంతో పార్లమెంటు భవనం వద్దకు అంబులెన్స్‌ను పిలిపించారు.కొద్దిసేపు ఘర్షణను చూస్తూ ఉండిపోయిన స్పీకర్ రూబెన్ రూబిన్యాన్, ఎంపీల ప్రవర్తనను ప్రజలు చూడాలనే ఉద్దేశంతోనే తాను ప్రత్యక్ష ప్రసారాన్ని కొనసాగించానని స్పష్టం చేశారు. అనంతరం సభను వాయిదా వేశారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని నికోల్ పషిన్యాన్, హింసకు పూర్తి బాధ్యత ప్రతిపక్షాలదేనని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీల చర్యలను సమర్థిస్తూ, కుర్చీ విసరడం "సరైన ప్రతిచర్య" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రతిపక్షాలు తమ స్థానం తెలుసుకోవాలని, లేదంటే ఇలాంటి పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు అంతర్జాతీయంగా వైరల్ అయ్యాయి.

కవిత కొత్త వ్యూహం... ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్



రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రేసులో తెలంగాణ రక్షణ సేన పార్టీ కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే వరంగల్ - ఖమ్మం - నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్ ను బరిలోకి దింపిన కవిత, రెండవ స్థానంలో కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికే పీఠం వేసి సరికొత్త రాజకీయ వ్యూహాన్ని చాటుకున్నారు.

ఎన్నికల అబ్జర్వర్‌గా చిట్నేని రఘు.. వార్ రూమ్ బాధ్యతల్లో రామ్ కల్యాణ్

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీకి చెందిన సీనియర్ నాయకులకు కీలక బాధ్యతలను అప్పగించారు. హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానానికి అబ్జర్వర్, కో ఆర్డినేటర్ గా పార్టీ సీనియర్ నేత డాక్టర్ చిట్నేని రఘును నియమించారు. అదేవిధంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి సమర్థవంతమైన ప్రచార వ్యూహాలు, వార్ రూమ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఛార్జిగా ప్రముఖ న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి జిల్లాల వారీగా బలమైన ఇన్ ఛార్జీల నియామకం

ఎన్నికల క్షేత్రస్థాయి పనితీరును వేగవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక ఇన్ ఛార్జీలను రంగంలోకి దించారు. హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ స్థానానికి సంబంధించి హైదరాబాద్ బాధ్యతలను సురభి, మతీన్, బండారి మహేందర్ ముదిరాజ్‌లకు అప్పగించగా.. రంగారెడ్డి జిల్లాకు అర్చనా సేనాపతి, మహబూబ్ నగర్ జిల్లాకు రంజిత్ గొంగళ్ల ఇన్ ఛార్జీలుగా వ్యవహరిస్తారు. ఇక నల్గొండ జిల్లా బాధ్యతలను సుజిత్, ఖమ్మం జిల్లాకు గట్టు కరుణ, వరంగల్ జిల్లా ఇన్ ఛార్జిగా మాడుగుల రాజిరెడ్డి వ్యవహరించనున్నారు.

జర్నలిజంలో రెండు దశాబ్దాల అనుభవం.. విద్యాభ్యాసంలో గోల్డ్ మెడలిస్ట్

హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన ఆకాశ్ కొల్లూరు పక్కా హైదరాబాద్ వాసి. జాతీయ స్థాయిలో దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా విశేష సేవలందించారు. ఇండియా టుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డెయిలీ హంట్ వంటి ప్రముఖ మీడియా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. బేగంపేటలోని ప్రసిద్ధ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. విద్యావంతుడు, సమాజంలో మంచి గుర్తింపు ఉన్న సీనియర్ జర్నలిస్టును బరిలోకి దించడంతో ఈ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పోటీ ఆసక్తికరంగా మారింది.

పేదరికంపై భారత్ గెలుపు.. ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

పేదరిక నిర్మూలనలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రగోగమిస్తున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011 నుంచి 2023 మధ్య 12 ఏళ్ల కాలంలో దేశంలో సుమారు 496 మిలియన్ల మంది (దాదాపు 50 కోట్లు) ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని తన తాజా నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి కేవలం 2.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'అక్టోబర్ 2026 ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్' నివేదిక ప్రకారం, రోజుకు 4.20 డాలర్ల (సుమారు రూ. 350) కంటే తక్కువ ఆదాయంతో జీవించే జనాభా 2011లో 57.7 శాతం ఉండగా, 2023 నాటికి అది 16.1 శాతానికి తగ్గింది. తీవ్ర పేదరికానికి సూచికగా భావించే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 250) ఆదాయ పరిమితి కంటే దిగువన ఉన్న వారి సంఖ్య 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. దేశంలో వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు మెరుగుపడటం, ఆహార సబ్సిడీల వంటి ప్రభుత్వ సామాజిక బదిలీ పథకాల వల్లే ఈ అద్భుతమైన ప్రగతి సాధ్యమైందని నివేదిక విశ్లేషించింది.ముఖ్యంగా 2017-2023 మధ్య కాలంలో దేశంలో కొత్తగా 134 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, ఇందులో గ్రామీణ ప్రాంత మహిళలు వేతనంతో కూడిన పనుల్లోకి రావడం కీలక పాత్ర పోషించిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అయితే, కొత్తగా వచ్చిన ఉద్యోగాల్లో చాలా వరకు తక్కువ ఉత్పాదకత ఉన్న రంగాల్లోనే ఉండటంతో, ఉద్యోగుల వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పు కనిపించలేదని పేర్కొంది.పేదరికం గణనీయంగా తగ్గినప్పటికీ, దేశంలో ఆదాయ అసమానతలు ఇప్పటికీ తీవ్రంగానే ఉన్నాయి. అత్యధిక వేతనం పొందే మొదటి 10 శాతం మంది ఉద్యోగుల ఆదాయం, అత్యల్ప వేతనం పొందే చివరి 10 శాతం మంది కంటే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అలాగే, పట్టణ ప్రాంతాల్లో పేదరికం 8.6 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 19.3 శాతంగా నమోదైంది. భవిష్యత్తులో పేదరికాన్ని మరింత తగ్గించాలంటే వ్యవసాయేతర రంగాల్లో అధిక ఉత్పాదకత, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడంపై దృష్టి పెట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది.

గాంధీజీ మనవడి ఆస్తిపై కన్ను.. 30 ఎకరాలు కొట్టేయాలని చూశాడు



జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, ధర్మం మార్గానికి ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి గౌరవం ఉందో మరోసారి నిరూపితమైంది. అమెరికాలోని వర్జీనియాలో మహాత్మా గాంధీ మనవడు దివంగత కనూ గాంధీ, ఆయన సతీమణి శివా గాంధీకి చెందిన 30 ఎకరాల విలువైన భూమిని ఒక స్థానికుడు అక్రమంగా ఆక్రమించుకునేందుకు పన్నిన కుట్ర నీరుగారిపోయింది. గుజరాత్‌కు చెందిన ఒక ట్రస్టీ చాకచక్యంగా, పట్టుదలతో సాగించిన 20 నెలల సుదీర్ఘ న్యాయపోరాటం ఫలితంగా ఆ భూమికి ఎట్టకేలకు విముక్తి లభించింది. 1987వ సంవత్సరంలో కనూ గాంధీ దంపతులు వర్జీనియాలోని ప్రముఖ షెనాండో నేషనల్ పార్క్‌ను ఆనుకుని ఉన్న 30 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. జీవిత చరమాంకంలో భారత్‌కు తిరిగి వచ్చిన వారు దక్షిణ గుజరాత్‌లో స్థిరపడ్డారు. 2016లో కనూ గాంధీ, 2020లో శివా గాంధీ కన్నుమూశారు. అయితే, తమ ఆస్తులన్నింటినీ గాంధేయవాద ప్రచారానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే మంచి సంకల్పంతో 'డాక్టర్ శివా అండ్ కనూ రామదాస్ మోహన్‌దాస్ గాంధీ ఛారిటబుల్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసి, ఈ స్థలాన్ని ట్రస్ట్‌కు బదిలీ చేస్తూ వీలునామా రాశారు. ప్రస్తుతం ఈ ట్రస్ట్‌కు సూరత్‌కు చెందిన పరిమళ్ దేశాయ్ మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు.

భూమి కొట్టేసేందుకు 'అడ్వర్స్ పొసెషన్' ఎత్తుగడ

2025 జనవరిలో గ్రెగొరీ బ్లాక్ అనే వర్జీనియా స్థానికుడు పరిమళ్ దేశాయ్‌కి ఒక లీగల్ నోటీసు పంపడంతో ఈ భూ వివాదం వెలుగులోకి వచ్చింది. వర్జీనియా చట్టాల ప్రకారం ఒక స్థలంలో వరుసగా 15 ఏళ్లు నివాసముంటే అది ఆక్రమణదారుడికే చెందుతుందనే 'అడ్వర్స్ పొసెషన్' నియమాన్ని ఆధారంగా చేసుకుని ఆ 30 ఎకరాల భూమి తనదేనంటూ బ్లాక్ కోర్టును ఆశ్రయించాడు. 2008 నుంచే తాను అక్కడ క్యాబిన్, దారులు, వృక్షాల పెంపకం చేపట్టానని, దానికి సంబంధించిన ఫొటోలను ఆధారాలుగా చూపించే ప్రయత్నం చేశాడు

గుజరాత్ ట్రస్టీ ధీటైన పోరాటం.. బయటపడ్డ అసలు రంగు

ట్రస్ట్ ఆస్తిని కాపాడుకోవడానికి మేనేజింగ్ ట్రస్టీ పరిమళ్ దేశాయ్ గట్టి పట్టుదలతో రంగంలోకి దిగారు. అమెరికాలో లాయర్లను నియమించుకుని, సరిహద్దుల సర్వే కోసం నిధులను వెచ్చించి పక్కా ఆధారాలు సేకరించారు. కోర్టు విచారణ సమయంలో శాటిలైట్ (+ూూ) మ్యాప్‌ల ద్వారా ఆ స్థలంలో సదరు ఆక్రమణదారుడు చెబుతున్న క్యాబిన్ 15 ఏళ్లుగా లేదని నిరూపించారు. అంతేకాకుండా, 2020 నుంచి తాము తరచూ ఆ స్థలాన్ని సందర్శిస్తున్నామని, అక్కడ మరొక మహిళ కూడా నివసిస్తోందని చూపించి.. ఆక్రమణదారుడి వాదనలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇది మహాత్ముడి వారసుల ఆస్తి అని, గాంధేయ భావజాల ప్రచారానికే దీన్ని ఉపయోగిస్తున్నామని కోర్టుకు వివరించారు.

కోర్టు సంచలన తీర్పు.. ఆక్రమణదారుడికి చురకలు

రెండు వైపుల వాదనలు విన్న వర్జీనియాలోని వారెన్ కౌంటీ సర్క్యూట్ కోర్టు న్యాయమూర్తి డారిల్ ఎల్. ఫంక్ తీర్పునిస్తూ.. ఆక్రమణదారుడి వాదనలను పూర్తిగా కొట్టిపారేశారు. అక్రమ ఆక్రమణను తక్షణమే తొలగించి, స్థలాన్ని తిరిగి ట్రస్ట్‌కు అప్పగించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా, కోర్టు ఖర్చుల కింద నిందితుడు వి11,375 జరిమానా చెల్లించాలని ఆదేశించారు. ఈ చారిత్రాత్మక తీర్పుతో అమెరికాలో గాంధీజీ వారసత్వ ఆస్తికి సంపూర్ణ రక్షణ లభించింది.

అర్ధరాత్రి ప్రియురాలి ఇంటికి వెళ్లిన బ్యాంక్ మేనేజర్ హత్య



ప్రియుడ్ని చింతచెట్టుకు కట్టేసి కర్రలతో దాడి చేసిన ప్రియురాలు కుటుంబ సభ్యులు గాంధీనగర్: అర్ధరాత్రి ప్రేమించిన అమ్మాయితో మాట్లాడుతుండగా ఓ బ్యాంకు మేనేజర్ ను ఆమె కుటుంబ సభ్యులు కొట్టి చంపిన సంఘటన గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకాలో తాగ్నా గ్రామంలో జరిగింది. పటాన్ జిల్లా వఘరోల్ గ్రామానికి చెందిన రంజిత్‌జీ చతుర్‌జీ ఠాకూర్ (31) అనే యువకుడు ఓ బ్యాంకులో క్రెడిట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత రెండేళ్ల నుంచి తాగ్నా గ్రామానికి చెందిన యువతితో ప్రేమలో పడ్డాడు. అక్టోబర్ 27న ఉదయం 9 గంటలకు రంజిత్ బైక్‌పై పనికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో 11:42 గంటలకు తల్లి ఫోన్ చేసింది. ఆలస్యంగా వస్తానని అతడు చెప్పాడు. అయితే తెల్లవారుజామున 3:30 గంటలకు ఓ బంధువు ఫోన్ చేసి రంజిత్ ప్రియురాలిని కలవడానికి తాగ్నా గ్రామానికి వెళ్లి అక్కడ పట్టుబడ్డాడని తెలిసింది.అర్ధరాత్రి ప్రేమికురాలుతో బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతుండగా అతడి ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు పట్టుకున్నారు. ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టుకు చేతులు, కాళ్లు కట్టేసి కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రంజిత్ స్పృహ కోల్పోవడంతో మంచంపై పడేశారు. ఘటనా స్థలంలో అతడు మృతి చెందాడు. ఉదయం 9 గంటలకు రంజిత్ కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు తాగ్నా గ్రామానికి చేరుకున్నారు. చింతచెట్టు కింద ఇనుప మంచంపై గోనె సంచి కప్పి ఉన్న రంజిత్ మృతదేహాన్ని చూసి కన్నీంటి పర్యంతమయ్యారు. అతడి శరీరంపై పలు చోట్ల గాయాలు ఉన్నాయని, మెడలో ఉన్న సుమారు ఒకటిన్నర తులాల బంగారు గొలుసు కనిపించడం లేదు తండ్రి తెలిపాడు. ప్రేమగా పెంచుకున్న కొడుకు విగతజీవిగా కనిపించడంతో కుటుంబంలో శోకసంద్రంలో మునిగిపోయింది. రంజిత్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి యువతి తల్లి, సోదరుడు, బాబాయ్, మరో బంధువుపై కేసు నమోదు చేశారు. మెహ్సానా ఎస్పీ హిమాన్షు సోలంకీ మాట్లాడుతూ.. నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

క్రిప్టో మార్కెట్‌లో కలకలం..

బైనాన్స్‌పై సైబర్ దాడి.. డిపాజిట్లు, విత్‌డ్రాల నిలిపివేత

ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ బైనాన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతా ఉల్లంఘన ఘటనపై దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో డిపాజిట్లు, విత్‌డ్రాలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఘటన వల్ల సుమారు 6.3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 6 లక్షల కోట్లు) మేర ప్రభావం ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేసింది.

తొలుత జరిపిన విచారణలో ఓ డెవ్‌ఆప్స్ ఇంజినీర్ ల్యాప్‌టాప్ హ్యాక్ అయి ఉండొచ్చని బైనాన్స్ తెలిపింది. దాని ద్వారా దుండగులు ఓ సర్వీస్ కంటైనర్‌లోకి ప్రవేశించి, అనధికారికంగా నగదు ఉపసంహరణ లావాదేవీలకు ప్రయత్నించినట్లు పేర్కొంది. అయితే క్రిప్టో వాలెట్లకు సంబంధించిన ప్రైవేటు కీలు లీకైనట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది.ఈ ఘటనతో ప్రభావితమైన ఆస్తులను నిలిపివేసేందుకు బ్లాక్‌చైన్ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

ఇప్పటివరకు బ్లాక్‌చైన్‌లోనే సుమారు 3 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేసినట్లు తెలిపింది. వినియోగదారుల నిధులు సురక్షితంగానే ఉన్నాయని, జరిగిన నష్టాన్ని ఎస్ఏఎఫ్‌యూ ఫండ్‌తో పాటు సంస్థ సొంత నిధుల నుంచి భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. అనుమానిత చిరునామాల అనుమతులను రద్దు చేసి, నిధుల జాడ తెలుసుకునేందుకు దర్యాప్తు సంస్థలు, బ్లాక్‌చైన్ నిపుణులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది.దర్యాప్తు పూర్తయి, భద్రతా చర్యలు ముగిసిన తర్వాత డిపాజిట్లు, విత్‌డ్రాలను పునరుద్ధరిస్తామని బైనాన్స్ తెలిపింది.

పూర్తి సాంకేతిక నివేదికను కూడా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. మరమ్మతు చర్యలు పూర్తయ్యాక తాజా 'ప్రూఫ్ ఆఫ్ రిజర్వ్స్' వివరాలను ప్రకటిస్తామని పేర్కొంది.మరోవైపు ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత క్రిప్టో మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. బిట్‌కాయిన్ ధర 77 వేల డాలర్ల దిగువకు పడిపోయి, సెప్టెంబరు తర్వాత కనిష్ఠ స్థాయిని తాకింది. ఇతర క్రిప్టో టోకెన్ల ధరలూ తగ్గాయి. ఈ హ్యాక్ నిర్ధారణ అయితే, 2025 ఫిబ్రవరిలో బైబిట్ ఎక్స్ఛేంజ్‌లో జరిగిన 1.5 బిలియన్ డాలర్ల చోరీని మించిన అతిపెద్ద క్రిప్టో దోపిడీగా నిలిచే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

'భోగాపురం' కాదు.. విశాఖపట్నం ఎయిర్‌పోర్టే, కీలక మార్పు

భోగాపురం విమానాశ్రయం కేంద్రంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉత్తరాంధ్రలో విమాన ప్రయాణీకులకు అందుబాటులోకి వచ్చిన భోగాపురం లో విమాన సర్వీసుల సంఖ్య పెరుగుతోంది. క్రమేణా ప్రయాణీకుల సంఖ్యలోనూ గణనీయంగా మార్పు వస్తోంది. పలు విమానయాన సంస్థలు ఇక్కడి నుంచి తమ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నాయి. ఇదే సమయంలో భోగాపురం విమానాశ్రయం ఇక నుంచి టికెట్ రిజర్వేషన్ కు విశాఖపట్నం ఏయిర్ పోర్టుగా మారుతోంది.భోగాపురం విమానాశ్రయం నుంచి రాకపోకలు పెరుగుతున్నాయి. అధునాతన సదుపాయాలతో నిర్మించిన ఈ ఏయిర్ పోర్టుకు ప్రయాణీకుల నుంచి ఆదరణ పెరుగుతోంది. దీంతో, పలు విమాన యాన సంస్థలు పలు ప్రధాన నగరాలకు తమ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకాక్, సింగపూర్ కు సర్వీసులు కొనసాగుతున్నాయి.

కాగా.. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం కోడ్ విషయమై కొంత గందరగోళం నెలకొన్నందున దాని పేరును మారుస్తున్నట్లు ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ (ఐఏటీఏ) ఓ ప్రకటన జారీచేసింది. ఇప్పటివరకు ఆ విమానాశ్రయ వివరాల్లో వీటీజెడ్ కోడ్‌తో భోగాపురం సిటీ అంటూ అనుబంధంగా వ్యవహరిస్తున్నామని పేర్కొంది.తాజా నిర్ణయం లో భాగంగా ఈ ఏడాది నవంబరు 21 నుంచి దాని కోడ్ వీటీజెడ్‌గానే ఉంచుతూ సిటీని భోగాపురానికి బదులుగా 'విశాఖపట్నం'గా వ్యవహరిస్తామంది. టికెట్ల వెబ్‌సైట్లలో గందర గోళం లేకుండా ఈ మార్పు చేసినట్లు విమాన ప్రయాణికుల సంఘం తెలిపింది. ఇక తాజాగా ఆర్నాబ్ తుఫాను కారణంగా భోగాపురం నుంచి పలు విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఇప్పుడు తిరిగి అన్ని సర్వీసులు రెగ్యులర్ అయ్యాయని అధికారులు వెల్లడించారు. అయితే.. విశాఖ నుంచి ఇక్కడకు రావటానికి సమయం పడుతున్న వేళ... ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను అందుబాటులోకి తెచ్చింది. ప్రయివేటు క్యాబ్ ల ధరల పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక.. ఇప్పుడు తాజా మార్పు మేరకు టికెట్ బుకింగ్ చేసుకోవాలని ప్రయాణీకులకు సూచిస్తున్నారు.